www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 సంచిక : 24 Vol No | విజయవాడ, శుక్రవారం 25 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

మరో మారు రైతన్నల పోరుబాట

- మూడు సంఘాల ఆధ్వర్యంలో జనవరి 30 నుండి ఫిబ్రవరి 7 వరకు ధర్నా
- ఎఐకెఎస్ నేతలు హన్నన్ మొల్లా, దావలే వెల్లడి

12

ఇస్రో మరో ఘనత

పిఎస్‌ఎల్‌వి సి44 ప్రయోగం విజయవంతం

3



ఖర్చుకు డబ్బేలా?

సర్కారుకు షెడ్యూల్ టెన్షన్ • 45వేల కోట్లకు పైగా లోటు • కొత్త అప్పులు అనుమానమే!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

సమయం దగ్గరపడుతోంది. మార్చిలో అనుకున్న ఎన్నికల షెడ్యూల్ ఫిబ్రవరిలోనే విడుదల కానున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. మరోవైపు చేతిలో చిల్లిగువ్వ లేని స్థితి. అమలుచేయాల్సిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు వీటన్నింటికి నిధులు ఎలా? ఇది రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఎదుర్కుంటున్న సంకటస్థితి! నిధుల సమీకరణ కోసం రకరకాల మార్గాలు అన్వేషిస్తున్నప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో ప్రభుత్వ వర్గాల్లో ఒత్తిడి నెలకొంది. ఒకసారి షెడ్యూల్ విడుదలైన తరవాత పథకాల అమలులో ప్రభుత్వ ప్రమేయం దాదాపుగా కనిపించదు. ఈలోగానే పథకాలపై తమ ముద్ర కనిపించేలా చర్యలు తీసుకోవాలి. అలా తీసుకోగలిగితేనే ఎన్నికల్లో ఎంతో కొంత మేర లబ్ధి కలుగుతుంది. అంటే, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే ప్రకటించిన, రానున్నరోజుల్లో ప్రకటించే పథకాలకు నిధులు సమకూర్చుకోవాలి. అది కూడా ఫిబ్రవరి నెలకు చూస్తే చాలదు! మార్చి నెలకు కూడా నిధులు సర్దుబాటు చేయాలి! అలా చేయలేకపోతే అసలుకే మోసం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోమాటలో చెప్పాలంటే మార్చి నెలలో అమలు చేయాల్సిన పథకాలకు కూడా ఫిబ్రవరిలోనే నిధులు కేటాయించాల్సిన పరిస్థితి ప్రభుత్వానిది! ఆదాయ వనరులు మాత్రం జనవరి నెలాఖరు వరకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండగా, ఫిబ్రవరిలో ఎన్నిరోజులు అందుబాటులో ఉంటాయో తెలియని స్థితి! కానీ,కళ్ల ముందు కనపడుతున్న ఖర్చుకు, ఆదాయ వనరులకు మధ్య కనీసం 45 నుండి 50 వేల కోట్ల రూపాయల మేరా తేడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తాన్ని భర్తీ చేయడం ఎలా అన్నదానిపై ప్రభుత్వంలో మల్లగుల్లాలు సాగుతున్నాయి.

అంచనాలు తారుమారు

వాస్తవానికి మార్చి నెల వరకు మిగతా 9లో



వీటికి నిధులు కావాలి (రూ. కోట్లు)

పథకం	మొత్తం
రైతుల రుణ మాఫీ	8,000
వడ్డీలేని రుణాలు	2200
విద్యుత్ సబ్సిడీ	4750
బియ్యం సబ్సిడీ	3250
ఇతర సబ్సిడీలు	1441
పారిశ్రామిక ప్రోత్సాహకాలు	2,000
కరవు ఇన్‌పుట్ సబ్సిడీ	2,000
పెండింగ్ బిల్లులు	2000
డ్వాక్రా మహిళలకు సాయం	8600
పెరిగిన పింఛన్లకు	1600

1 నుండి ఇబిసి కోటా

కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ: ఇటీవల చట్టరూపం ధరించిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఇబిసి) రిజర్వేషన్లు ఫిబ్రవరి 1 తేదీ నుండి కేంద్ర ప్రభుత్వ నియామకాలన్నింటికీ వర్తిస్తాయని కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ గురువారం ఆదేశాలను జారీ చేసింది. ఇబిసి రిజర్వేషన్లకు సంబంధించిన విధి విధానాలతో సమగ్ర నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేస్తామని ఈ ప్రకటనలో తెలిపింది. జనవరి 9వ తేదీన పార్లమెంట్ ఆమోదించిన 124వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం విద్య, ఉద్యోగావకాశాలలో పది శాతం మేర జనరల్ కేటగిరీలోని పేదలకు రిజర్వ్ అవుతాయని ఈ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఎస్సీ, ఎస్టీ, సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతో రిజర్వేషన్లు వర్తించని, కుటుంబ వార్షికాదాయం ఏడాదికి రు.8 లక్షల లోపు వున్న వారిని ఆర్థికంగా వెనుకబడిన వర్గాని(ఇబిసి)కి చెందిన మిగతా 9లో

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్ట సవరణలపై

స్టేకు సుప్రీం నో



న్యూఢిల్లీ : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టానికి కేంద్రం తెచ్చిన సవరణలపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. అత్యాచారాలకు పాల్పడిన వారిని ఎలాంటి విచారణ లేకుండానే అరెస్ట్ చేసేందుకు ఈ సవరణ అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది మార్చి 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌తో సహా సవరణలను సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిల్‌లను ఒకేసారి విచారించనున్నట్లు జస్టిస్ ఎకె.సిక్రీతో కూడిన ధర్మాసనం పేర్కొంది. గత ఏడాది ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో జస్టిస్ లలిత్ భాగమైనందున ఈ పిటిషన్‌లపై విచారణకు ఆయనను తిరిగి ఈ ధర్మాసనంలోకి చేర్చాలని కోరింది. ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ కేసు నమోదు చేయగానే అరెస్టులు చేయకూడదని, పోలీసులు విచారించాలని, ముందస్తు బెయిలును ఇవ్వాలని గతేడాది మార్చి 20న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీన్ని దళిత మిగతా 9లో

ఎన్‌డిఎకు మెజార్టీ అసాధ్యం

2019 ఎన్నికలపై ఎబిపి-సీవోటర్ సర్వే

8





పోరుకు సిద్ధం

సమ్మె బాటలో ఆర్టీసి కార్మికులు

తెలంగాణ సహా పలు రాష్ట్రాల కంటే తక్కువ వేతనాలు

వేతన పెంపే ప్రధాన డిమాండ్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

దేశంలోనే అతిపెద్ద ప్రజా రవాణా వ్యవస్థగా పేరుగాంచిన ఎపిఎస్ ఆర్టీసిని నష్టాల నుంచి లాభాల వైపు తీసుకొచ్చేందుకు అహర్నిశలూ కష్టపడుతున్న కార్మికులు యాజమాన్యంతో పోరాటానికి సిద్ధపడ్డారు. వేతన పెంపుదలకు యాజమాన్యం అంగీకరించకుండా మొండికేయడమే ఇందుకు ప్రధాన కారణం. వేతన సవరణ గడువు ముగిసి 21 నెలలు గడిచినా ఇంత వరకూ వేతన సవరణ చేయలేదు. వేతన సవరణ కమిటీ ఎనిమిది సార్లు సమావేశమైనా కార్మికుల డిమాండ్‌ను యాజమాన్యం అంగీకరించలేదు. సంస్థ నష్టాలను సాకుగా చూపి 20 శాతానికి మించి ఫిట్‌మెంట్ ఇవ్వలేమని, కార్మికులు డిమాండ్ చేస్తున్నట్లుగా 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం సాధ్యంకాదని యాజమాన్యం తేల్చి చెప్పడంతో కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పొరుగునున్న తెలంగాణతో సహా దేశంలో అనేక రాష్ట్రాలతో పోలిస్తే ఎపిఎస్ ఆర్టీసి సిబ్బంది వేతనాలే తక్కువగా ఉన్నాయి. హర్యానా, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, ఢిల్లీ వంటి ఉత్తరాధి రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఏడో వేతన కమిషన్ సిఫార్సుల ప్రకారం డ్రైవర్లు, కండక్టర్లకు రూ.18 వేలు బేసిక్ పే చెల్లిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాన్ని పొందుతున్నారు. ఎపిఎస్ ఆర్టీసిలో మాత్రం కండక్టర్‌కు రూ.12,400, డ్రైవర్‌కు రూ.13,600 బేసిక్ పే చెల్లిస్తున్నారు. తెలంగాణ ఆర్టీసి కన్నా ఎపిఎస్ ఆర్టీసి కార్మికులు తక్కువ వేతనాన్నే పొందుతున్నారు. తెలంగాణలో కండక్టర్లకు రూ.12,610, డ్రైవర్లకు రూ.13,780 చెల్లిస్తున్నారు. తమిళనాడు ఆర్టీసిలో ఉన్న పే బాండ్ సిస్టం ద్వారా కండక్టర్లు, డ్రైవర్లకు రూ.5200 బేసిక్ పే చెల్లించే వారు. గతేడాది 154 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంతో బేసిక్ వేతనం రూ.13,208కి పెరిగింది. కేరళలో రాష్ట్ర ప్రభుత్వ పే స్కేల్ ప్రకారమే ఆర్టీసి కండక్టర్, డ్రైవర్లకు రూ.18000 బేసిక్‌ను చెల్లిస్తున్నారు. అన్ని ఆర్టీసిలతో పోలిస్తే తాము తక్కువ వేతనాలు పొందుతున్నామని, వేతన పెంపు కోరడం న్యాయమైనదేనని ఆర్టీసి కార్మికులు చెబుతున్నారు. ఆర్టీసిలో మిగతా 9లో

ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

జనసేన

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను నివారించాలని జనసేన పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో 52 వేల మంది కార్మికులు, వారి కుటుంబాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యను మానవీయ కోణంలో అర్థం చేసుకోవాల్సి మిగతా 9లో



అమెరికాతో తెగదెంపులు

- తక్షణం దేశం వీడి వెళ్లండి
- అమెరికా దౌత్యవేత్తలకు మదురో ఆదేశం
- మీ కుట్రలు, కుతంత్రాలు చెల్లవిక
- గైడోను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తిస్తున్నాం : ట్రంప్

కారకస్, మాస్కో : ప్రతిపక్ష నేత జువాన్ గైడోను వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిగా అమెరికా గుర్తించడం పట్ల ఆ దేశ ప్రస్తుత అధ్యక్షుడు నికోలస్ మదురో ఘాటుగా స్పందించారు. అమెరికాతో దౌత్య పరమైన సంబంధాలన్నీ తెగతెంపులు చేసుకుంటున్నామని ఆయన ప్రకటించారు. 72 గంటల్లోగా అమెరికా దౌత్యవేత్తలు, ప్రతినిధులంతా తమ దేశాన్ని విడిచి వెళ్లిపోవాలంటూ మదురో ఆదేశించారు. వెనిజులా అధ్యక్షుడిగా మదురో జనవరి 10న రెండోసారి బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే."వారు చాలా దూరం వెళ్ళారు. అమెరికా సామ్రాజ్యవాద ప్రభుత్వంతో మిగతా 9లో

అమెరికా జోక్యం గర్హనీయం : సిపిఎం 9

జగన్ ఆంక్షలను భరించలేకపోయా

టిడిపిలో చేరికపై స్పష్టతనివ్వని రాధా



ప్రజాశక్తి – విజయవాడ ప్రతినిధి

వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో అవమానాలను భరించలేకే ఆ పార్టీకి రాజీనామా చేశానని మాజీ ఎంఎల్ఎ వంగవీటి రాధాకృష్ణ చెప్పారు. సొంత తమ్ముడిలాంటి వాడివని అంటూనే జగన్ తనపై ఆంక్షలు పెట్టారన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడుతూ తన తండ్రి రంగా విగ్రహావిష్కరణకు వెళ్లిన తనపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. తన తండ్రి విగ్రహావిష్కరణకు వెళ్లనివ్వనివారు ఇంకెక్కడికి వెళ్లనిస్తారని అన్నారు. తండ్రి లేనివాడినని చేరదీశానని.. తాను చెప్పినట్లు వినాల్సిందేనని జగన్ ఒత్తిడి చేసేవారని రాధా ఆరోపించారు. ఇప్పటి వరకూ ఆత్మాభిమానం చంపుకొని, అవమానాలు భరిస్తూ వచ్చానన్నారు. సెంట్రల్ సీటు విషయంలో ఒకింత బాధ పడ్డానే తప్ప పార్టీని వీడాలని అనుకోలేదని, కానీ పార్టీలో తనను పదేపదే అవమానాలకు గురిచేయడంతో రాజీనామా చేశానని చెప్పారు. తనకు మిగతా 9లో

విద్యుత్ మీటరు రీడర్లకు ఉద్యోగ భద్రత

రాష్ట్ర సదస్సులో వక్తల డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎంఎ గఫూర్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విద్యుత్ మీటరు రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన విద్యుత్ మీటరు రీడర్ల రాష్ట్ర సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ఎం బాలకాశి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపియం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో కీలకమైన పనిచేస్తున్న మీటరు రీడర్ల శ్రమను విద్యుత్ సంస్థలు దోచుకుంటున్నాయన్నారు. ప్రజలపై కరెంటు సర్‌ఛార్జీల పేరుతో భారం మోపుతూ, మీటరు రీడర్లకు మాత్రం అరకొరగా పీస్‌రేటు పద్ధతిలో వేతనాలు ఇవ్వడాన్ని ఖండించారు. మీటరు రీడర్లందరూ తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు పోరాడాలని సూచించారు. మీటరు రీడర్లు భవిష్యత్తులో చేయబోయే పోరాటాలకు సిపియం మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం ఎ గఫూర్ మాట్లాడుతూ లోకానికి వెలుగునిచ్చే విద్యుత్‌రంగ కార్మికుల జీవితాలు చీకట్లో మగ్గుతున్నాయన్నారు. జెన్‌కో,ట్రాన్స్‌కో,డిస్కంలలో పని చేసే కార్మికులతో పాటు మీటరు రీడర్లు, బిల్లుకలెక్టర్లు ఎవరూ సంతోషంగా లేరని తెలిపారు. చట్టాన్ని అమలుచేస్తూ, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాల్సిన ఐఎఎస్ అధికారులు, పాలకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మరారని విమర్శించారు. లేబర్ డిపార్ట్‌మెంట్ కనీస వేతనాలు పెంచి 15 సంవత్సరాలు గడిచిందని గుర్తుచేశారు. ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లను ప్రవేశపెట్టాలనే ఆలోచనలను విరమించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. మీటరు రీడర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో ప్రభుత్వానికి మిగతా 9లో

25న విశాఖలో కీలక భేటీ

- హాజరుకానున్న జనసేన, కమ్యూనిస్టు పార్టీల అగ్రనేతలు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ప్రజా సమస్యలపై చర్చించేందుకు జనసేన, కమ్యూనిస్టు పార్టీల అగ్రనేతలు ఈ నెల 25వ తేది విశాఖపట్నంలో సమావేశం కానున్నారు. జనసేన అధి నేత పవన్‌కళ్యాణ్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు, సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొననున్నారు. కీలక మైన ఈ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని రుషికొండలోని సాయిప్రియా రిసార్ట్‌లో నిర్వహిస్తున్నట్లు జనసేన ఒక ప్రకటనలో తెలిపింది. జనసేన నుంచి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌తోపాటు మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, మరికొందరు ముఖ్య నాయకులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీని వాసరావు, వై.వెంకటేశ్వరరావు, సిహెచ్. నర్సింగరావు, సిపిఐ సహాయ కార్యదర్శులు మిగతా 9లో

గణతంత్రం

గణతంత్ర దినోత్సవాలకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన రాష్ట్ర సచివాలయం



పొట్టేళ్ల బండి

విజయవాడలోని స్వరాజ్య మైదానంలో నిర్వహిస్తున్న హార్టీ కల్చర్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పొట్టేళ్ల బండి



చిన్నారులకు రక్షణేదీ?

- చట్టపరంగా రిజిస్టర్ అయిన సంరక్షణా కేంద్రాలు 18 శాతమే
- అక్రమ రవాణా బాధిత పిల్లలు రాష్ట్రంలోనే ఎక్కువ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పిల్లల సంరక్షణా కేంద్రాలు (చైల్డ్ కేర్ ఇన్స్‌టిట్యూషన్స్)లోని చిన్నారులకు రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. అత్యధిక కేంద్రాలు చట్టపరంగా నిబంధనలను పాటించకపోగా కనీసం రిజిస్ట్రేషన్ కూడా లేకుండా నిర్వహిస్తున్న వాటి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో ఆ కేంద్రాలపై ప్రభుత్వ పర్యవేక్షణ కూడా కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. పిల్లల సంరక్షణ కేంద్రాలు నిర్వహించాలంటే తప్పకుండా బాలల న్యాయ చట్టం (జువెనైల్ జస్టిస్ యాక్ట్) ప్రకారం రిజిస్టర్ చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా చిన్నారుల శరణాలయాలతో కలిపి మొత్తం 762 సంరక్షణా కేంద్రాలున్నాయి. వాటిలో చట్టపరంగా రిజిస్టర్ చేసుకున్నవి కేవలం 138 మాత్రమే (18 శాతమే). మిగిలినవాటిలో 50 కేంద్రాలు రిజిస్టర్ చేసుకునేందుకు నమోదు చేసుకుంటే 294 కేంద్రాలు ఇతర చట్టాల కింద రిజిస్టర్ అయి ఉన్నాయి. ఇక 269 సంరక్షణా కేంద్రాలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ కానీ, చట్టపరంగా ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమంలో కానీ లేకుండా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ కేంద్రాల్లో పిల్లల సంరక్షణ ప్రశ్నార్థకమవుతోంది. వాటిలో కనీస సదుపాయాలు లేకపోవడంతోపాటు చిన్నారులకు శిక్షలు కూడా ఎక్కువగా ఉంటున్నాయని ఇటీవల కేంద్ర మహిళా శిశు మంత్రిత్వ శాఖ సర్వేలోనూ వెల్లడించింది. చాలా కేంద్రాల్లో కనీసం రిజిస్టర్, అడ్మిషన్ల వివరాలు కూడా నిర్వహించడంలేదని స్పష్టం చేసింది. పలు సంరక్షణా కేంద్రాల్లో వాటి సామర్థ్యానికి మించి పిల్లలు ఉంటున్నారు. దాదాపు వంద చైల్డ్ కేర్ ఇన్స్‌టిట్యూషన్స్‌లో సామర్థ్యానికి మించి చిన్నారులున్నారు. ఒక్కో కేంద్రంలో సరాసరి 49 మంది పిల్లలు ఉంటున్నారు. ఇదే అంశంలో ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువమంది పిల్లలు ఉంటున్నారు. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఈ సంఖ్య ఎక్కువే. ఒక్కో సంరక్షణా కేంద్రంలో సరాసరి ఆశ్రయం పొందుతున్న పిల్లలు కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో 33 మంది ఉన్నారు.

రాష్ట్రంలో చిన్నారుల సంరక్షణా కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న పిల్లలు మొత్తం 5833 మంది ఉంటే వారిలో అనాథలుగా ఉన్నవారు 4048, తల్లిదండ్రులు వదిలేసినవారు 650, ఇతర కారణాలతో ఆశ్రయం పొందుతున్న పిల్లలు 1135 మంది ఉన్నారు. అయితే వారిలో వెట్టిచాకిరీ, యాచక వృత్తి కోసం, లైంగిక దోపిడీ తదితర అవసరాలకు అక్రమ రవాణాకు గురైన పిల్లలు మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నారు. దేశవ్యాప్తంగా అక్రమ రవాణాకు గురైన చిన్నారులు 3173 మంది ఉంటే, అత్యధికంగా మన రాష్ట్రంలోనే 554 మంది చిన్నారులు సంరక్షణా కేంద్రాలలో ఉన్నారు. వారిలోనూ 454 మంది పిల్లలు బాలకార్మికులుగా, వెట్టిచాకిరీ బాధితులు. ఇక హెచ్ఐవి బాధితులు, మానసిక వైకల్యం ఉన్నవారు కూడా దేశం మొత్తం మీద మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నారు. దేశవ్యాప్తంగా సంరక్షణా కేంద్రాల్లో హెచ్ఐవి బాధిత పిల్లలు 4999 ఉంటే అత్యధికంగా రాష్ట్రంలో 1184 మంది ఆశ్రయం పొందుతున్నారు. అలాగే ఈ కేంద్రాల్లో మానసిక వైకల్యం ఉన్న చిన్నారులు దేశవ్యాప్తంగా 10794 మంది ఉంటే అన్ని రాష్ట్రాల కంటే అధికంగా ఇక్కడ 2448 మంది ఉన్నారు.

రాష్ట్రంలో పిల్లల సంరక్షణా కేంద్రాల వివరాలు

రాష్ట్రంలో చిన్నారుల సంరక్షణా కేంద్రాలు	762
జువెనైల్ చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ ఉన్నవి	138
ఎలాంటి నిబంధనలూ పాటించని కేంద్రాలు	269
ఇతర చట్టాల ప్రకారం రిజిస్టర్ అయినవి	294
మొత్తం చిన్నారుల సంఖ్య	5833
ఒక్కో కేంద్రంలో ఉంటున్న సరాసరి పిల్లల సంఖ్య	49
సామర్థ్యానికి మించి పిల్లలు ఉన్న కేంద్రాలు	100

చంద్రబాబును కలిసిన ఘట్టమనేని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని వైసిపి మాజీ నాయకులు, సినీ నటుడు కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు గురువారం ఉదయం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి చంద్రబాబు లాంటి నాయకుడు అవసరమని అన్నారు. త్వరలోనే టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆదిశేషగిరిరావును పార్టీలోకి చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. గుంటూరు పార్లమెంటు సీటు కోరిన ఘట్టమనేని అధిష్ఠానం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో వైసిపికి రాజీనామా చేసినట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే.



పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

మరికొద్ది రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని విశాఖపట్నం వాతావరణ కేంద్ర అధికారులు గురువారం రాత్రి వెల్లడించారు. పొగమంచు క్రమక్రమంగా తగ్గనుందని తెలిపారు. కొద్ది రోజులపాటు రాత్రిపూట చలి కొనసాగుతుందని చెప్పారు.

సవరణ

24.1.2019 సంచిక 3 వ పేజీలో 'జగన్ హత్యకేసులో....' అనే శీర్షికను జగన్‌పై దాడి కేసులో....అని చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

- సంపాదకులు

ప్రజ్ఞ

1. దేశంలో అత్యంత పరిశుభ్రమైన రైలు ఏది?
2. గ్లోబల్ టాలెంట్ 2019 కాంపిటేషన్ ఇండెక్స్‌లో భారత ర్యాంక్ ఎంత?
3. మీడియా పర్సన్ ఆఫ్ ది ఇయర్ ఎవరు?
4. భారత్‌కు ఆఫ్ఘనిస్తాన్‌కి మధ్య ఎన్ని ఒప్పందాలు జరిగాయి?
5. మడగాస్కర్ అధ్యక్షుడిగా ఎవరు ప్రమాణ స్వీకారం చేశారు?

సమాధానాలు 7లో

మెరిట్ రిజర్వు అభ్యర్థులను ఓపన్‌లో భర్తీ చేయాలి

ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు విద్యార్థి యువజన సంఘాల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెరిట్‌లో వచ్చిన రిజర్వుడు అభ్యర్థులకు ఓపన్ కేటగిరీలో పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ మేరకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి రామన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అఫ్సర్, లెనిన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు, చరణ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీని కలిసి వినతి పత్రం సమర్పించారు. రిజర్వుడు అభ్యర్థులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మెరిట్‌లో వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బిసి, వికలాంగ అభ్యర్థులకు ఓపన్ కేటగిరీలోనే పోస్టులు భర్తీ చేసే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

31న ఆర్ఒఆర్ సమీక్షకు హాజరుకండి

ఎపిపిఎస్సీ కార్యదర్శికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నోటీస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపైన ఈ నెల 31న నిర్వహించే సమీక్షకు హాజరుకావాలని ఎపిపిఎస్సీ కార్యదర్శికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ గురువారం నోటీసు జారీ చేశారు. ఈ నెల 22న నిర్వహించిన సమీక్షకు హాజరు కాకపోవడం వల్ల రికార్డులు అందలేదని, ఈ సారి నిర్వహించే సమీక్షకు పూర్తి వివరాలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మోడీ కోసమే 'వారి' తపన

జగన్, కెసిఆర్‌లపై బాబు విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో అన్ని పార్టీలదీ ఒకదారైతే జగన్, కెసిఆర్‌లది మరోదారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మోడీని గెలిపించేందుకు వీరిద్దరూ తపన పడుతున్నారని చెప్పారు. మోడీ ఓడితేనే నవ్యాంధ్రప్రదేశ్ గెలుస్తోందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేయాలని హైదరాబాదు మోడీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. బిసి లకు, టిడిపికి అనుబంధానికి 36 ఏళ్లని, ఈ నెల 27న రాజమండ్రిలో జరిగే 'జయహో బీసీ' సదస్సుకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సదస్సుకు సన్నాహక సమావేశాన్ని ఉండవల్లిలోని ప్రజావేదికలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి 30 బీసీ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలే టిడిపికి వెన్నుముక అన్నారు. పేదల్లో ఎక్కువ మంది బీసీలే కావడంతో వీరి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు.

ఎయు విసి వ్యాఖ్యలపై మట్టి కుండలతో నిరసన



విసి వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

సైన్స్ కాంగ్రెస్‌లో ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలు అన్న వివాదాస్పద అశాస్త్రీయ వ్యాఖ్యలు చేయడాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎంఎల్‌సి విఠపు బాల సుబ్రమణ్యం ఖండించారు. గురువారం జెవివి ఆధ్వర్యంలో నాగేశ్వరరావుకు నాలుగు మట్టి కుండలను పంపించారు.

ఈ సందర్భంగా విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇలాంటి అశాస్త్రీయ వ్యాఖ్యలతోనే మన విద్యావ్యవస్థ వెనుకపడిందని అన్నారు. శాస్త్ర, సాంకేతికత నానాటికీ పెరిగిపోతున్న దశలో కూడా ఇలాంటి వ్యాఖ్యలు చదువుకున్న మేధావులు వల్లించడం దారుణమైన విషయంగా అభివర్ణించారు. చదువులోని శాస్త్రీయతను గుర్తించి, విద్యార్థులను ఆ దిశగా అడుగులు వేయించాలే తప్ప తప్పుడు దారి పట్టించకూడదన్నారు.

ఒక వర్శిటీ ఉపకులపతి స్థాయి వ్యక్తి ఇలాంటి వాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే అటువంటి వాఖ్యలు విరమించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిర్లా నాయుడు, మహేష్, రెడప్ప, సంషీర్ బాషా, సాయి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

29న ఉపాధి కూలీల దీక్ష

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్
- ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఈ నెల 29న విజయవాడలో ఉపవాస దీక్ష చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం(ఎఐఎడబ్ల్యూయు) ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్ తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో పనుల్లేక పెద్ద ఎత్తున వలసలు పోతున్నారని, ఉపాధి పనులు చేసిన చోట నెలల తరబడి బిల్లులు రావడం లేదని అన్నారు. ఉపాధి బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడం వల్ల అనివార్యంగా వలస బాట పడుతున్నారని, పెండింగ్ బిల్లుల కోసం పేదలు, సంఘాలు ఆందోళన చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ పేదల కడుపు కొడుతున్నారని తెలిపారు. కరువు మండలాల్లో కుటుంబానికి 150 రోజుల పని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పి ఐదు నెలలు గడిచినా నేటికీ కుటుంబానికి సగటున 55 రోజులకు మించి పని చూపలేదన్నారు. పేదలను నమ్మించి మోసం చేసేందుకు బిజెపి, తెలుగుదేశం నాటకాలు ఆడుతున్నాయని, అవసరమైతే 30 శాతం అదనపు అలవెన్స్ ఇచ్చి గిట్టుబాటు అయ్యేలా చూస్తామని సాక్ష్యాత్తూ ముఖ్యమంత్రే చెప్పారని, నేటికీ అది అమలు చేయడం లేదని మండిపడ్డారు. తీవ్రమైన కరువు వల్ల నేల గట్టిగా మారి కూలీల చేతులు బొబ్బలెక్కేలా పని చేసినా రోజుకు వందకు మించి గిట్టుబాటు కావడం లేదన్నారు. రాష్ట్రంలో రూ.420 కోట్ల వేతన బకాయిలు ఉన్నాయని, కూలీలు కార్యాలయాల చుట్టూ తిరిగినా కూలీ ఇవ్వడం లేదని తెలిపారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కుటుంబానికి నెలలో 20 రోజుల పని కల్పించాలని, రోజుకు రూ.500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పే స్లిప్పులు, పోస్టాఫీసు ద్వారా వేతనాలు చెల్లించాలని, అందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని అన్నారు. 30 రోజులు పూర్తి చేసిన ప్రతి కుటుంబానికీ పనిముట్లు ఇవ్వాలని, గ్రూపులకు టెంట్లు ఇవ్వాలని, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, యంత్రాలను, సిమెంటు పనులను నిషేధించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని, కూలీలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ నిధులు ఇతర వాటికి మళ్లించరాదని కోరారు. 29న చేపట్టే దీక్షకు ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్తం

గిరిజన వసతి గృహాలలో యోగా బోధకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో యోగా బోధకులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 13 మంది యోగా బోధకులను ఏడాది పాటు నియమించాలని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.7 వేలు వేతనంగా చెల్లించాలనీ, జాతీయ ఆయుష్ మిషన్ నిధుల వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల జిఒ జారి

ప్రభుత్వ, జడ్పి ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల జిఒ నెం: 32ని జారీ చేసిందని, ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకటేశ్వరరావు, జి హృదయరాజులు తెలిపారు. ఈ జిఒ ప్రకారం ఉపాధ్యాయులు వెంటనే రిలీవ్ అవుతారని తెలిపారు.

చంద్రబాబు వలలో రాధా

వైసిపి నేత పేర్ని నాని

చంద్రబాబు వలలో వంగవీటి రాధాకృష్ణ చిక్కుకున్నారని వైసిపి అధికార ప్రతినిధి పేర్ని నాని అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును రాధా నమ్మడం బాధాకరమని, రంగా ఆశయాలను చంద్రబాబు నేరవేరుస్తాడని నమ్మడం భ్రమ అని అన్నారు. రాధాకు వైసిపి సముచిత స్థానం కల్పించిందని, గౌరవం ఇవ్వలేదనడం సరికాదని తెలిపారు.

రంగా విగ్రహావిష్కరణకు వెళ్లవద్దని జగన్ ఎప్పుడూ చెప్పలేదన్నారు. రంగా హత్యకు టిడిపియే కారణమన్న సంగతి అందరికీ తెలుసన్నారు. రాధా ఎక్కడున్నా మంచి భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నానన్నారు.



రాష్ట్ర సహకార శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అజయ్‌కుమార్ తదితరులు

పిఎసిఎస్ ఉద్యోగుల సమ్మె విరమణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రాథమిక సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులు వేతన సవరణ తదితర సమస్యలపై చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు పిఎసిఎస్ గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉండవల్లిలోని ప్రజావేదికలో సహకార మంత్రి సి ఆదినారాయణ రెడ్డితో బుధవారం జరిగిన చర్చల్లో మంత్రి కొన్ని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని, మిగిలిన వాటినికూడా పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారని తెలిపారు. ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సు చేసిన విధంగా వేతనాలను 20 శాతాం పెంచడానికి అంగీకరించినట్లు తెలిపారు. గ్రాట్యూటీని కమిటీ సిఫార్సు చేసిన రెండు లక్షల రూపాయలు నుండి మూడు లేదా నాలుగా లక్షల రూపాయలకు పెంచుతామన్నారని తెలిపారు. ప్రతిభ ప్రాతిపదికగా ప్రమోషన్లు ఇవ్వడానికి, ఉద్యోగ భద్రతను కల్పించడానికి అంగీకరించారని తెలిపారు. వేతన చెల్లింపు సామర్థ్యాన్ని చేరుకునేందుకు సహకార సంఘాల కమిటీ ఇచ్చిన గడువు మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలకు పెంచుతున్నామన్నారు. గత మంత్రి వర్గ సమావేశంలో పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయించారని చెప్పారు. దీంతో డిసెంబర్ 17వ తేది నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెను విరమించినట్లు ప్రకటించారు. సమ్మెకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ ప్రదాన కార్యదర్శి పి సత్యనారాయణ, కోశాధికారి టి వెంకటరామయ్య పాల్గొన్నారు.

దావోస్‌లో అంధ్రా రుచులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఆంధ్రా రుచులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చేందుకు ఎపి పర్యాటక శాఖ కృషిని ప్రారంభించింది. దీనిలో భాగంగా దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు వద్ద ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. వివిధ దేశాలకు చెందిన వారు ఈ స్టాల్‌లో వంటకాలను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పర్యాటక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నం మ్యారియట్ సహకారంతో దావోస్‌లో ఈ స్టాల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అంతరించిపోతున్న సంప్ర దాయ వంటకాలను ఈ తరానికి తెలియజెప్పేందుకు కృషి చేస్తున్నట్లు పర్యాటక పర్యాటక సాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి హిమాన్షుశుక్లా తెలిపారు.

అక్టోబర్ నుంచే పెన్షన్

డప్పు కళాకారుల సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం తొలుత ప్రకటించిన విధంగా అక్టోబర్ 2018 నుంచే డప్పు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం నేతలు కోరారు. ఆ మేరకు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు అండ్ర మాల్యాద్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతి కుమార్, కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మారెళ్ళ శ్రీనివాసులు సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌ను గురువారం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. పెన్షన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 34,137 మందికి ఐడి కార్డులతో నిమిత్తం లేకుండా అవకాశం కల్పించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ పెన్షన్ ఇవ్వాలన్నారు. పెన్షన్ కోసం ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం అనేక పోరాటాలు చేసిందన్నారు. వాటి ఫలితంగానే ప్రభుత్వం డప్పు కళాకారులకు పెన్షన్ ప్రకటించిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత జూన్‌లో ప్రకటించినా ఇంత వరకు పించను అందలేదని, తాజాగా ఫిబ్రవరి నుంచి ఇస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రాంతీయ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరూ ఇళ్లస్థలాలకు అర్హులేనని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రభుత్వ ఉద్యోగులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలో నూతన మార్గదర్శకాలను అనుసరించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు తమ అర్హతల వివరాలు తెలియజేస్తూ జిల్లా కలెక్టరు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నోడల్ అధికారం కలిగిన జిల్లా కలెక్టర్లు ఈ ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పరిశీలించనున్నట్లు తెలిపారు.

ఐఆర్‌పై త్వరలో నిర్ణయం : సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యంతర భృతిపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సానుకూలంగా లేకపోవడంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో ఎపి ఎన్జీవో సంఘ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం కలిసి డిఎ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంఘ నాయకులతో చంద్రబాబు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించేందుకు సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఆటంకంగా ఉన్నాయన్నారు. దీనిపై అప్పీలుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. నాలుగున్నరేళ్లలో ఉద్యోగుల సహకారం మరువలేనిదన్నారు. కేంద్రం అనుకూలంగా ఉంటే కష్టాలు ఉండేవి కాదని, ఇప్పటికీ కేంద్రం నుంచి రూ.75 వేల కోట్లు రావాల్సి ఉందన్నారు. జీతాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎన్జీవో సంఘ నాయకులు ఎన్నికల కోడ్ వచ్చేలోగా ఐఆర్ ప్రకటించి అమలు చేయాలని, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం తరహాలో ఇక్కడా సిపిఎస్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పని చేసే వారికి పీఆర్సీ అమలు చేయాలని కోరారు.

పరిహారం కోసం సాగుదారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి (విశాఖపట్నం)
వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూసేకరణలో భూములు కోల్పోయిన డి పట్టా సాగుదారులకు, హక్కు దారులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించాలని విశాఖ జిల్లా నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సాగుదారులు ధర్నా చేశారు. వీరికి వైసిపి పాయకరావుపేట నియోజవకర్గం సమన్వయ కర్త వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం ఎపిఐఐసి ద్వారా మండలంలోని డి.ఎల్.పురం, అమలాపురం, వేంపాడు, చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట రెవెన్యూ గ్రామాల్లో రైతుల నుండి సేకరించిన భూములతో పాటు డి పట్టా భూములు, సాగులో ఉండి పట్టాలేని వారి భూములు సేకరించిందని తెలిపారు. హక్కుదార్లు, సాగుదారుల భూములకు పరిహారం చెల్లిస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నా నేటి వరకు ఎటువంటి పరిహారం చెల్లించలేదని తెలిపారు.



విశాఖలో ఇంటర్ స్వర్ణోత్సవాలు

విశాఖ ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఇంటర్మీడియట్ విద్య స్వర్ణోత్సవ వేడుకలను విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు మూలమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం కొత్తగా 50 జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రముఖ సినీగాయకుడు వందేమాతరం శ్రీనివాస్ తన పాటలతో ఉత్తేజపరిచారు.

పిఎన్‌వి రహదారి విస్తరణకు ప్రపంచ బ్యాంక్ డెడ్‌లైన్

మార్చి 31వరకే గడువు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి
కృష్ణాజిల్లా పెడన, నూజివీడు, విస్సన్నపేట (పిఎస్‌వి) ఆర్ అండ్ బి రహదారి విస్తరణ పనులకు ప్రపంచబ్యాంక్ డెడ్‌లైన్ విధించింది. ఈ ఏడాది మార్చి 31కి పనులు పూర్తి చేయకుంటే నిధులు విడుదల చేయమని హెచ్చరించింది. రూ.274 కోట్లతో 3 ప్యాకేజీల్లో జరుగుతున్న ఈ పనుల్లో ఏ ప్యాకేజీలోనూ సగం పనులు కూడా పూర్తి కాలేదు. రహదారి విస్తరణలో కీలకమైన వంతెనల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయే పరిస్థితేర్పడింది.65, 16, 226 నెంబర్ల జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉండే పిఎస్‌వి ఆర్ అండ్ బి రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను 2017 మే నెలలో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టారు. 6 నుండి ఏడు మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డును 10 నుండి 12 మీటర్లకు విస్తరిస్తున్నారు. ఒప్పందం ప్రకారం ఈ పనులను 15 నెలల్లో పూర్తి చేయాలి. 2018 డిసెంబర్‌కు ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావాల్సివుంది. నాలుగు ప్యాకేజీలుగా విభజించి టెండర్లను పిలిచారు. 33 కిలోమీటర్ల మేర రూ.85 కోట్లతో చేపట్టిన హనుమాన్ జంక్షన్ - విస్సన్నపేట మధ్య విస్తరణ పనులు పూర్తయ్యాయి. హనుమాన్‌జంక్షన్ వద్ద ఎన్‌హెచ్ 16కు విస్సన్నపేట వద్ద ఎన్‌హెచ్ 226కు ఈ రోడ్డు అనుసంధానం జరిగింది. ఈ రోడ్డు విస్తరణకు సంబంధించి హనుమాన్ జంక్షన్ - పెడన మధ్య 71 కిలోమీటర్లు మూడు ప్యాకేజీల్లో రూ.274 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ ఎలో రూ.86 కోట్లతో చేపట్టిన పనుల్లో 50 శాతం, ప్యాకేజీ బిలో రూ.84 కోట్ల పనుల్లో 32 శాతం, ప్యాకేజీ సిలో రూ.104 కోట్లతో చేపట్టిన పనుల్లో 17 శాతం మాత్రమే పూర్తయ్యాయి.ఈ రోడ్డు విస్తరణలో 5 ప్రెస్ కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా 4, బాక్స్ కల్వర్టులు 11కు 8, మైనర్ బ్రిడ్జిలు 7 నిర్మించాల్సి ఉండగా 4 పూర్తయ్యాయి. బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. మిగిలిన పనులూ జరుగు తున్నాయి. బుడమేరు, నాగవరప్పాడు వద్ద వంతెనల పనులు జరుగుతున్నాయి. పెరికీడు వద్ద వంతెన నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ క్రమంలో పెరికీడు వద్ద వంతెన మినహా మిగిలిన పనులు పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా కాంట్రాక్టర్ల వద్ద రెండు నెలల్లో పనులు పూర్తి చేయడానికి వర్కు షెడ్యూల్‌ను తీసుకున్నారు.



ఒంగోలు కలెక్టరేట్ వద్ద సమ్మెలో భాగంగా ధర్నా చేస్తున్న ఉద్యోగులను ద్దేశించి మాట్లాడుతున్న ఆ సంఘం నేత

మూడో రోజుకు 104 ఉద్యోగుల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-యంత్రాంగం/అమరావతి బ్యూరో
రాష్ట్రవ్యాప్తంగా సంచార చికిత్స (104) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సిబ్బంది చేపట్టిన సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది. పలు సంఘాల నాయకులు వీరి సమ్మెకు మద్దతు ప్రకటించారు. జిఒ 151 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.

గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను నాగేశ్వరరావు హాజరై సంఘీభావం తెలిపారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన దీక్షలో సిఐటియు పశ్చిమ కృష్ణా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద మూడోరోజు సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వీరలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద 104 కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధర్మ పోరాట దీక్ష శిబిరాన్ని జెఎసి జిల్లా ఛైర్మన్ హరనాథ్, నేత శ్రీనివాస్ ప్రారంభించారు.

చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు విజయశేఖర్ మాట్లాడారు. 104 ఉద్యోగుల సంఘం నాయకులు ప్రతీప్‌రెడ్డి, ధనలక్ష్మిలతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలో ఉద్యోగుల ఆందోళనకు సిఐటియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు హాజరై మద్దతు తెలిపారు.

విజయనగరం కలెక్టరేట్ వద్ద జాతీయ రహదారిపై ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.బాలరాజు, అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ మాట్లాడారు. ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు. శ్రీకాకుళంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాల ఆవరణలో దీక్షలు కొనసాగుతున్నాయి.ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేపట్టారు. విశాఖ జిల్లా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో చేతులకు సంకెళ్లు వేసుకుని 'చంద్రన్న సంకెళ్లు' పేరుతో వినూత్నంగా నిరసన తెలిపారు.

ఉద్యోగుల ధర్మపోరాట దీక్ష

ప్రభుత్వం జారీ చేసిన 151 జిఒ ప్రకారం చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ మొత్తాలను తమ వేతనాల నుంచి కోత విధించకూడదని డిమాండ్ చేస్తూ చంద్రన్న సంచార చికిత్స (104) ఉద్యోగులు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ధర్మపోరాట దీక్ష చేపట్టారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఇచ్చిన హామీని యాజమాన్యం అమలుచేయడంలేదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించి, నాయకులపై కేసులు పెడతామంటూ యాజమాన్యం బెదిరిస్తోందని పేర్కొన్నారు.



ఇస్రో మరో ఘనత

పిఎస్ఎల్‌వి సి-44 ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట
ఇస్రో మరో ఘనతను సాధించింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి గురువారం రాత్రి ప్రయోగించిన పిఎస్ఎల్‌సి సి-44 విజయవంతమైంది. విలువైన సేవల కోసం మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. భారత అంతరిక్ష పరిశోధనలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రయోగంగా శాస్త్రవేత్తలు అభివర్ణించారు. ఈ రాకెట్ ద్వారా 750 కిలోల బరువున్న మైక్రోశాట్-ఆర్, నాలుగు కిలోల బరువున్న కలాం శాట్ మినీ ఉపగ్రహాలను ఈ రాకెట్ అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. బుధవారం రాత్రి 7.37గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభమై నిరంతరంగా 28గంటల పాటు కొనసాగింది. అనంతరం గురువారం రాత్రి 11.37గంటలకు రాకెట్‌ను ప్రయోగించి విజయం సాధించారు. ప్రయోగం జరిగిన 13నిముషాల 55సెకన్లలోనే 274కిలో మీటర్ల సూర్యాను వర్తన ధృవ కక్ష్యలో మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాన్ని విడిచిపెట్టేలా శాస్త్రవేత్తలు ప్రణాళికను సిద్ధం చేసి పంపారు. మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహం నిర్ధిత కక్ష్యలోకి చేరిన తర్వాత సుదీర్ఘ సమయం అనంతరం కలాంశాట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేరవేశారు.

పిఎస్-4 ఒక ఉపగ్రహం

పిఎస్ఎల్‌వి సి-44లోని నాల్గవ దశ పిఎస్-4 ఒక ఉపగ్రహంలా పనిచేసే విధంగా ఈ రాకెట్ ప్రయోగాన్ని చేపట్టడం విశేషం.పిఎస్ఎల్‌వి ఆర్బిట్ ప్లాట్‌పారం అనే ప్రత్యేక కక్ష్యలో ఇపిఎస్-4 పరిభ్రమించింది.2.5మీటర్ల పొడవు 1.34మీటర్ల వ్యాసంతో నాల్గవ దశను నిర్మించారు. ఇందులో 1.6 టన్నుల ధ్రవ ఇంధనాన్ని నింపారు. ఈ దశలోనే తమిళనాడులోని స్టూడెంట్ రూపొందించిన కలాంశాట్ అనే నానో ఉపగ్రహాన్ని అమర్చారు. 4కిలోల కన్నా తక్కువ బరువున్న ఈ కలాంశాట్ రాకెట్‌లోని నాల్గవ దశలోనే ఉండి శాస్త్రవేత్తలు నిర్దేశించిన నూతన కక్ష్యలో పరిభ్రమింపచేసే విధంగా శాస్త్రవేత్తలు రూప కల్పన చేశారు. రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత ఒక ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన అనంతరం 54వేల సెకన్లపాటు నాల్గోవ దశ అందులోని కలాంశాట్ ఉపగ్రహం సహా పరిభ్రమించి భూమికి 450కిలోమీటర్ల ఎత్తుకు చేరవేశారు. రాకెట్ ప్రయోగంలో 6,151సెకన్ల తర్వాత 54వేల సెకన్ల వరకు ఈ పిఎస్ఎల్‌వి ఆర్బిట్ ప్లాట్‌ఫారం పయనం సాగింది. ప్రయోగం జరిగిన గంట 42నిముషాల 51సెకన్ల నుంచి ఏకంగా 15గంటలపాటు పిఎస్-4దశ సాగనుంది. ఆ తర్వాత కలాంశాట్‌తో పాటు పిఎస్-4దశను కనీసం మూడు నెలల పాటు అంతరిక్షంలోనే ఉంచి ఒక ప్రయోగాత్మక ఆపరేషన్ నిర్వహించనున్నారు.

చరిత్ర సృష్టించనున్న నానో ఉపగ్రహం కలాంశాట్

భారతీయ శాస్త్రవేత్తలు రూపొందించిన మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహంతో పాటు కలాంశాట్‌ను ప్రయోగించారు. కేవలం 1.2కిలోల బరువున్న పది సెం.మీ.చతురస్ర ఆకార ఈ బుల్లి ఉపగ్రహం తమిళనాడు విద్యార్థుల పరిశోధనలకు అద్దం పడుతుంది. తమిళనాడులోని పల్లవర్తి పట్టణానికి చెందిన రిఫార్ట్ షారూక్ అనే 18ఏళ్ల వయస్సు గల విద్యార్థి ఆధ్వర్యంలో ఈ శాటిలైట్‌ను రూపొందించారు. రూ.12లక్షలు ఇందు కోసం వెచ్చించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రపంచంలోని మొట్టమొదటి 3డి ప్రింటెడ్ శాటిలైట్‌గా తయారుచేసి ప్రస్తుతం శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. స్పేస్ కిట్స్ ఇండియా సిఇఒ శ్రీమతి శేషన్ ఈసందర్భంగా బుల్లి శాస్త్రవేత్తలను అభినందించారు.

నూతన సంవత్సరంలో నూతనోత్సాహంతో శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని విజయవంతం చేశారు. ఈ క్యాలండర్ ఇయర్‌లో తొలి అడుగేశామని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ శివన్ పేర్కొన్నారు.

'తిత్లీ' పరిహారం అందక ఆగిన రైతు గుండె



ప్రజాశక్తి- మందస (శ్రీకాకుళం జిల్లా)
తిత్లీ తుపాను వల్ల పదెకరాల్లో నేలమట్టమైన జీడి, కొబ్బరి చెట్లు ఒకవైపు... వాటికి పరిహారం రూపంలో ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదన్న ఆందోళన మరోవైపు ఒక యువ రైతు ప్రాణాన్ని బలిగొన్నాయి. తుపాను వల్ల వాటిల్లిన అపార నష్టానికి పరిహారం అందజేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, అప్పుల బాధ వెరసి శ్రీకాకుళం జిల్లా మందస మండలం లింబుగాంకు చెందిన బతకల శ్రీను (32) గుండెపోటుకు గురై గురువారం మృతి చెందాడు. ఆయన కుటుంబసభ్యుల కథనం ప్రకారం... శ్రీను తనకున్న పదెకరాల భూమిలో జీడి, కొబ్బరి తోటలను సాగు చేస్తున్నాడు. వాటి ద్వారా వచ్చే ఫలసాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతేడాది అక్టోబరులో వచ్చిన తుపానుతో పదెకరాల తోటలు నేలకొరిగాయి. ఐదెకరాలకు మాత్రమే పరిహారం అందిస్తామని ప్రభుత్వ యంత్రాంగం తేల్చి చెప్పడంతో చేసేది లేక ఆ పరిధి మేరకు దరఖాస్తు చేసుకున్నాడు. అయినప్పటికీ నేటికీ పరిహారం అందలేదు. జీవనాధారమైన తోట నేలమట్టం కావడం, ఆదుకుంటుందనుకున్న ప్రభుత్వం మొండిచేయి చూపడం, పంట పెట్టుబడి, కుటుంబ పోషణకు చేసిన అప్పులు గుదిబండగా మారడంతో ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య గీత, ఎనిమిదేళ్ల కుమార్తె లాస్య, ఆరేళ్ల కుమారుడు లోహిత్ ఉన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై అనుమానాలు

ప్రజాశక్తి - నిజాంపట్నం
నిజాంపట్నానికి చెందిన రిమాండు ఖైదీ మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. జిజిహెచ్ వైద్యులు, పోలీస్ అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 3న నిజాంపట్నంలో జరిగిన మహివర్ధన్ హత్యకేసు రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. ఆ కేసులో మూడో ముద్దాయిగా ఉన్న కన్నా బసవశంకరరావు(54) బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బసవశంకరరావుకు బుధవారం గుండెపోటు రావడంతో అతడిని రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించామని పోలీసు అధికారులు తెలిపారు. అయితే పరిస్థితి విషమించడంతో అతడిని గుంటూరులోని జిజిహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. అయితే బుధవారం రాత్రి 12 గంటల తర్వాత బసవశంకరరావును చికిత్స కోసం జిజిహెచ్‌కు తీసుకొచ్చారని, అప్పటికే అతను మృతిచెందాడని జిజిహెచ్ వైద్యులు చెబుతున్నారు. బసవశంకరరావు మరణంపై పలు అనుమానాలు కలుగుతున్నాయని మృతుని భార్య తెలిపింది.

ఫొటో జర్నలిస్టుపై జలీల్‌ఖాన్ దాడి

- విజయవాడ నగర పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద ఘటన
- వీడియోను డిలీట్ చేయించిన ఎడిసిపి
- ఎపిడబ్ల్యూజెఎఫ్ ఖండన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి
విధుల్లో భాగంగా నగర పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద వీడియో చిత్రీకరిస్తున్న సాక్షి వీడియో జర్నలిస్టుపై విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. టిడిపి ఎంఎల్ఎ జలీల్‌ఖాన్ తమ్ముడికీ, తమ్ముడి కోడలు మోహముదాకూ మధ్య కుటుంబ వివాదం నడుస్తోంది. ఇందులో భాగంగా గురువారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించే బాధ్యతను నగర పోలీసు కమిషనరు ద్వారకా తిరుమలరావు క్రైం డిసిపి రాజకుమారికి అప్పగించారు. తన తమ్ముడి తరపున కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకుగానూ జలీల్‌ఖాన్ విజయవాడ నగర పోలీసు కమిషనరు కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న సాక్షి వీడియో జర్నలిస్ట్ కె.నాని ఆయన రాక దృశ్యాలను చిత్రీకరిం చారు. దీంతో ఆగ్రహించిన జలీల్‌ఖాన్ 'ఏయ్ ఏం..వీడియో తీస్తున్నావ్' అంటూ ఆగ్రహించారు. అంతేగాక వెనువెంటనే ఆయన అనుచరులు వీడియో జర్నలిస్టును బెదిరించి జలీల్‌ఖాన్ వద్దకు తీసుకొచ్చారు. వీడియో కెమెరా ఇస్తావా ? ఇవ్వవా? అని ఎంఎల్ఎ అడగగా, దానికి వీడియో జర్నలిస్ట్ నాని నిరాకరించారు. దీంతో ఎంఎల్ఎ అతని కెమెరాను బలవంతంగా లాక్కున్నారు. ఇంత జరుగుతున్నా అక్కడే ఉన్న అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎడిసిపి) నవాజ్‌షరీఫ్ ఖాన్, సిఐ ఉమామహేశ్వరరావు చోద్యంచూస్తూ ఉండిపోయారు. ఎడిసిపి నవాజ్ షరీఫ్ ఖాన్ జోక్యం చేసుకుని తాను ఆ వీడియోను డిలీట్ చేయిస్తానని చెప్పి వీడియో జర్నలిస్టును ఓ గదిలోకి తీసుకెళ్లారు. అనంతరం ఆ వీడియోను డిలీట్ చేయించారు. దీంతో పలువురు వైసిపి నేతలు, న్యాయవాది నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జలీల్‌ఖాన్‌తోపాటు ఆయన అనుచరులు ఖాజా, ఇతరులపై ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేయనున్నారు. జర్నలిస్ట్ నానీని చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు చికిత్స చేసి పంపివేశారు.

దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు టి.శ్రీరామ్మూర్తి, షేక్ ఖాజావలి ఒక ప్రకటనలో ఖండించారు. సాక్షాత్తూ పోలీసు కమిషనర్ కార్యాలయం వద్దే పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలోనే ఈ దాడి జరగడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ఎంఎల్ఎ జలీల్, ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని నగరంలోనే జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పందించి జలీల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలికపై లైంగిక వేధింపులు

హెచ్‌ఎం సస్పెన్షన్
మంత్రి గంటా సీరియస్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి
కృష్ణాజిల్లా మండల కేంద్రమైన ఆగిరిపల్లి ఎంపిపిఎస్ మెయిన్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలికను అదే పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు గంపా వెంకట్రావు లైంగికంగా వేధించినట్లు బాలిక తల్లి ఫిర్యాదుచేసింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని నూజివీడు డిఎస్పీ సిహెచ్‌జి.వి.ప్రసాద్ తెలిపారు. బాలికను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, నివేదిక వచ్చిన తరువాత హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమాన్‌జంక్షన్ సిఐ రాజశేఖర్, ఆగిరిపల్లి ఎస్ఐ వి.ఏసోబు పాల్గొన్నారు. బాలికను లైంగికంగా వేధించాడనే ఫిర్యాదుపై స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై రాష్ట్ర మానవవనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు కూడా సీరియస్‌గా స్పందించారు. హెచ్‌ఎం లైంగిక దాడి దారుణమని యుటిఎఫ్ మండల నాయకులు ఎం.జోగిరాజు, జె.జ్ఞాన సుందరం, ఎస్‌టియు నాయకులు ఎం.వేణు గోపాలరావు, ఎ.వెంకటేశ్వరరావు, టిఎన్‌యుఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.

పింఛన్ దరఖాస్తు కోసం వెళ్లి..

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (గుంటూరు)



పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వారం రోజుల నుండి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారిన వృద్ధుని గుండె ఆగిపోయింది. ఈ సంఘటన గురువారం గుంటూరు జిల్లా పిడుగురాళ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పేరం పిచ్చయ్య (63) పిడుగురాళ్ల రూరల్ మండలం తుమ్మల చెరువుకు చెందిన వ్యక్తి. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొద్ది సంవత్సరాల క్రితం కొడుకు మరణించడంతో కోడలికి వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేయాలని భావించాడు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ కార్డుకు ఒక పింఛన్ మాత్రమే వస్తుందని అధికారులు తెలపటంతో రేషన్ కార్డు మార్చుకునేందుకు కొద్ది రోజులుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. గురువారం కూడ అధికారుల కోసం వచ్చి వేచి చూస్తూ కార్యాలయం గోడ పక్కన పడిపోయి ఉండడాన్ని అటుగా వస్తున్న ప్రజాశక్తి సిబ్బంది గమనించారు. పిచ్చయ్య నోటి నుంచి రక్తం కక్కుతూ పడిపోయి కొన ఉపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే స్థానికులను, తహశీల్దార్ కార్యాలయ సిబ్బందిని పిలిచి ఆటోలో స్థానిక ప్రయివేటు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. పిచ్చయ్యను పరిక్షించిన వైద్య సిబ్బంది గుండెపోటు వచ్చి చనిపోయి ఉండవచ్చని తెలిపారు.

వంశధార, బాహుదా నదుల అనుసంధానం అవశ్యం

నిపుణుల కమిటీ సభ్యులు రౌతు సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
వంశధార, బాహుదా నదుల అనుసంధానం అవశ్యమని ఆ నదుల అనుసంధాన హైకెనాల్ నిపుణుల కమిటీ సభ్యులు రౌతు సూర్యనారాయణ, కె.వి.సుబ్బారావు అన్నారు. శ్రీకాకుళంలోని ఒక హోటల్‌లో గురువారం విలేకరులతో వారు మాట్లాడారు. ఈ నదుల అనుసంధాన ప్రక్రియ సాధ్యాసాధ్యాలపై రెండు రోజులుగా పరిశీలించామన్నారు. అనుసంధాన ప్రక్రియలో అవరోధాలను పరిశీలించామని తెలిపారు. వంశధార, నాగావళి నదుల్లో పుష్కలంగా నీటి వనరులున్నాయన్నారు. ఏటా ఈ నదుల్లోని వంద క్యూసెక్కుల వరద నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోందని పేర్కొన్నారు. ఈ నీటిని సంరక్షించడం ద్వారా మరిన్ని భూములకు సాగు నీరందించే వీలుందన్నారు. వంశధార నది నుంచి బాహుదా వరకూ నిర్మించే హైలెవల్ కెనాల్ ద్వారా సాగునీటితో పాటు తాగునీరందించేందుకు వీలవుతుందని తెలిపారు. సుమారు 116 కిలోమీటర్ల పొడవున ఈ కెనాల్ నిర్మించేందుకు పరిశీలన చేస్తున్నామన్నారు. వంశధార నదిపై నేరడి వద్ద బ్యారేజీ, కాట్రగడ వద్ద వరద నీటి కాలువ నిర్మాణంతో హిరమండలం రిజర్వాయర్ వరకూ నీటిని మళ్లించే ప్రక్రియ కొనసాగుతోందని వారు తెలిపారు.

'కోట్ల' కోటపై గురి...!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి
కర్నూలు జిల్లా రాజకీయంలో బలమైన వర్గం కలిగిన మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డిపై టిడిపి, వైసిపిలు పోటాపోటీగా దృష్టి సారించాయి. ఆయన తండ్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా తమకంటూ ప్రత్యేక గ్రూపును నిర్మించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు పోయినా జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో డిపాజిట్లు దక్కించుకున్నారు. ఎంపీగా పోటీ చేసిన కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డికి దాదాపు లక్షన్నర ఓట్లు పోలయ్యాయి. ఆయనకు కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బలమైన అనుచర వర్గం ఉంది. కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కోట్ల ఆశీస్సులు లేకుండా ఏ అభ్యర్థి గెలిచే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డిని తమ పార్టీలో చేర్చుకుంటే జిల్లాలో పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవచ్చన్న అంచనాతో టిడిపి, వైసిపిలు మొదటి నుంచి కోట్లతో చర్చలు జరుపుతున్నాయి. కానీ ఆయన బుధవారం అమరావతిలో జరిగిన కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశంలో జరిగిన చర్చలు ఈ ప్రచారానికి మరింత ఆజ్యం పోశాయి. తెలంగాణలో పొత్తు పెట్టుకొని, ఆంధ్రప్రదేశ్‌లో ఒంటరిగా వెళ్లడం సరి కాదని, ఎపిలో కూడా పొత్తు పెట్టుకోవాలని కోట్ల సూచించినా కాంగ్రెస్ అధిష్టానం ఒంటరి పోరుకే మొగ్గుచూపింది. కోట్ల అసంతృప్తితో సమావేశం నుంచి అర్ధాంతరంగా బయటకు వచ్చిన విషయం విధితమే. కాంగ్రెస్ అధిష్టానంపై కోట్ల అసంతృప్తిగా ఉన్నట్లు బయటకు పొక్కడంతో టిడిపి , వైసిపిలు మళ్లీ కోట్లను తమ పార్టీలో చేర్చుకునేందుకు పావులు కదిపినట్లు తెలుస్తోంది.

ఏనుగులను సురక్షిత ప్రాంతానికి తరలిస్తాం

ప్రజాశక్తి- విజయనగరం కలెక్టరేట్
ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల మధ్య సంచరిస్తోన్న ఏనుగుల గుంపును సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని, అవి గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటామని విశాఖ, ఒడిశా ఐఎఫ్ఎస్ అధికారులు తెలిపారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లోని ప్రజలకు వాటి వల్ల ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఏనుగుల సంచారంతో జరుగుతున్న నష్ట నివారణపై ఆంధ్రా, ఒడిశా జాయింట్ కోఆర్డినేషన్ సమావేశం విజయనగరంలోని అటవీ శాఖ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు రాహుల్‌పాండే, భువనేశ్వర్ రీజనల్ సిసిఎఫ్ అధికారి అభిరామ్‌నాయక్, బరంపురం రీజనల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు సురేష్‌పంత్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు. గత ఆరు నెలలుగా విజయనగరం జిల్లాలోని పార్వతీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల పరిసర ప్రాంతాల్లో సంచరిస్తోన్న ఏనుగులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

విశాఖకు విహార నౌక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖకు తొలిసారిగా విదేశీ పర్యాటక విహార (క్రూయిజ్) నౌక గురువారం చేరింది. సిల్వర్ డిస్కవర్ క్రూయిజ్‌కు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి గోపాలకృష్ణ, వైజాగ్ పోర్టు చైర్మన్ కృష్ణబాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివిధ దేశాల్లోని పర్యాటక ప్రాంతాలను తిలకించాలనుకునే వారికి అత్యద్భుతమైన అనుభూతి కాగలదని పేర్కొన్నారు.

అతి పురాతనమైన రాతి నంది విగ్రహం చోరీ

ప్రజాశక్తి - రామచంద్రపురం (తూర్పుగోదావరి)
రామచంద్రపురంలోని చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మూడడుగులు ఎత్తు, మూడడుగులు వెడల్పు గల నంది విగ్రహం బుధవారం రాత్రి చోరీకి గురవడం కలకలం రేపింది. నంది విగ్రహానికి అటు వైపు రెండు కుటుంబాలు, ఇటు వైపు ఒక కుటుంబం కాపురం ఉండగానే సుమారు వెయ్యి కేజీల బరువు గల నంది విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు తరలించుకుపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. కార్తీకమాసం ముందు నుంచీ విగ్రహం చుట్టూ ఉన్న టైల్స్ పగిలి ఉండటాన్ని గమనించిన యాత్రికులు, ఈ విషయాన్ని ఆలయ అర్చకుల దృష్టికి తీసుకెళ్లారు. కొబ్బరికాయలు కొట్టడం, దీపాల వేడి వల్ల పగిలి ఉంటాయని సమాధానం ఇచ్చారన్నారు. నంది విగ్రహ ప్రతిష్ట సమయంలో వేసే నవరత్నాలు, వజ్రాల కోసం చోరీ చేశారని కొందరు, క్షుద్రపూజలు కోసమని మరికొందరు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న రామచంద్రపురం డిఎస్‌పి సంతోష్, సిఐ పెద్దిరెడ్డి శివగణేష్ సంఘటన స్థలాన్ని జాగిలాలతో పరిశీలించారు. ఆలయ అధికారులను, అర్చకులను అడిగి సమాచారం సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంతటి చరిత్ర ఉన్న దేవస్థానంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.

సంపాదకీయం

ప్రియాంకకు కీలక బాధ్యతలు


కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, తూర్పు ఉత్తరప్రదేశ్ విభాగానికి ఇన్‌ఛార్జి బాధ్యతలతో ప్రియాంక గాంధీని నియమించడం ఆ పార్టీ అభిమానులకు, అనుయాయులకు శుభవార్తే! అలాగే ఆమె నియామక ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే బిజెపి ఛోటా నాయకుల మొదలు ప్రధాని మోడీ వరకు నేతలు స్పందించిన తీరు వారి తత్తరబాటును సూచిస్తోంది. ఇప్పటి వరకు తన తల్లి సోనియా, సోదరుడు రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ, అమేథీల్లో వారి తరపున ప్రచారంలో పాల్గొనడం వరకే పరిమితమైన ప్రియాంక ఇప్పుడు పార్టీ కీలక బాధ్యతల్లోకి వచ్చారు. కేంద్రంలో అధికార పీఠాన్ని దక్కించుకోవాలంటే దేశంలో అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పాగా వేయడం అతి ముఖ్యం. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, ఆ తరువాత జనతా పార్టీ గానీ అదేవిధంగా రాజీవ్ గాంధీ అధికారానికి వచ్చినపుడూ ఆ రాష్ట్రమే కీలకంగా నిలిచింది. కాని, గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అక్కడ తన ప్రాభవాన్ని కోల్పోయింది. ఎస్పీ, బిఎస్పీ, బిజెపిలు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. మోడీ గద్దెనెక్కడానికి 2014 ఎన్నికల్లో యుపిలో 71 స్థానాలు చేజిక్కించుకోవడం ప్రధాన సోపానంగా పేర్కొనవచ్చు. అంత కీలకమైన ఆ రాష్ట్రంలోని తూర్పు విభాగానికి ఇన్‌ఛార్జిగా ప్రియాంకను నియమించడం ప్రాధాన్యతను సంతరించుకున్న పరిణామం.

యు.పి లో గణనీయ సంఖ్యలో సీట్లను కైవసం చేసుకునేందుకు ప్రియాంకను రంగంలోకి దించినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాని ఆ రాష్ట్రంలో ఇప్పటికే అఖిలేష్, మాయావతి సీట్ల సర్దుబాటును ప్రకటించారు. రాయ్‌బరేలి, అమేథీల్లో తాము పోటీ చెయ్యబోమని ప్రకటించడం ద్వారా వారు కాంగ్రెస్‌ను పక్కన పెట్టినట్టేనని స్పష్టమవుతోంది. అయితే, అగ్ర కుల ఓటు పునాదిని కాంగ్రెస్, ఎస్సీ, ఒబిసి ఓట్లను ఎస్పీ, బిఎస్పీ సమీకరించాలనే లోపాయికారీ అవగాహన కూడా దీని వెనుక ఉందన్న కొందరు పరిశీలకుల వాదనలనూ కొట్టిపారేయలేం. తూర్పు యు.పి లోనే మోడీ, యోగి ఆదిత్యనాథ్ ప్రాతినిధ్యం వహించే స్థానాలు వుండడమేగాక ఆ ప్రాంతంలో అగ్ర కులాల పట్టు ఎక్కువగా వుండడం కూడా ఈ వాదనకు బలం చేకూర్చుతోంది. సోషల్ ఇంజనీరింగ్ ప్రక్రియను దేశమంతటా పాలక వర్గాలు విరివిగా ప్రయోగిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అలాగే తాను గెలవకపోయినా బిజెపి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ఎత్తుగడలు వేయడం కూడా సహజమే! ఆ పార్టీ రాజకీయ వ్యూహాల్లో ప్రియాంక గాంధీ నియామకం ఒక భాగం మాత్రమే.

రాహుల్‌కు ప్రియాంక 'ఊతకర్ర' వంటివారని బిజెపి సీనియర్ నేతలు వ్యాఖ్యానించగా, కాంగ్రెస్‌కు ఆ కుటుంబమే పార్టీ కాగా తమకు పార్టీయే కుటుంబమని ప్రధాని మోడీ చెప్పడం వాచాలత్వమే! బిజెపిలో అభ్యర్థులు, మంత్రివర్గాల కూర్పుతో సహా అన్ని విషయాలనూ 2013 నుండి మోడీ అమిత్ షా ద్వయమే నిర్ణయిస్తోందన్నది అందరికీ తెలిసిన విషయమే. కీలక నేతగా పేరున్న అద్వానీ మొదలు ప్రజాకర్షణ మెండుగా వుందని చెప్పబడే సుష్మా స్వరాజ్ వరకు అనేకమందిని పూర్తిగా పక్కకు నెట్టేశారన్నది నగ్న సత్యం. బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను, జిల్లా కలెక్టర్లను సైతం ప్రధాని కార్యాలయమే నియంత్రిస్తోంది. పార్టీలోనూ ప్రభుత్వంలోనూ కోటరీ చక్రం తిప్పుతోందని ఆ పార్టీ ఎంపీ శతృఘ్న సిన్హా వంటి వారి విమర్శ సత్యదూరం కాదు. కాబట్టి మోడీ చేసిన విమర్శ గురివింద సామెతను గుర్తు చేస్తోంది.

అయితే కాంగ్రెస్ పార్టీలో ఒక వ్యక్తి నియామకంతోనే ఏదో జరిగిపోతుందనో లేక ఆ పార్టీపై ప్రజల్లో అపారమైన సానుకూలత వచ్చేస్తుందనో ఎవరు ఆశించినా లేక ఊహాగానం చేసినా అది కల్లగానే మిగిలిపోతుంది. దేశానికి వినాశకరంగా వున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలను తొలుత అమలు చేసిందా పార్టీయే. అలాగే మత ప్రాతిపదికపై విభజన రేఖలు గీసే, ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే శక్తుల పట్ల మెతకగా వున్నదీ, వుంటున్నదీ కాంగ్రెస్ అన్నది నిర్వివాదాంశం. మతోన్మాద బిజెపికి దీటుగా నిలవాలంటే హిందుత్వ శక్తులను, వారి సిద్ధాంతాలను నఖ శిఖ పర్యంతం వ్యతిరేకించాలి. కాని అలా చేయకుండా నిరంతరం వాటితో రాజీ పడడంతో కాంగ్రెస్‌కు ఆ శక్తి క్రమంగా సన్నగిల్లుతుంది. అలనాటి శిలాన్యాస్, అయోధ్యలో వివాదాస్పద మందిర తాళం తెరవడం నుండి తాజాగా శబరిమల వివాదం వరకూ కాంగ్రెస్ నడక, నడత అదే కావడం గమనార్హం. ఆ పార్టీ విధానాలను సమీక్షించుకొని, సరిదిద్దుకోకుండా పెను మార్పులు సంభవించవు. ప్రియాంకకు లభిస్తున్న ప్రచారం కాంగ్రెస్‌కు సీట్లు తెచ్చిపెడుతుందా లేక ఆర్భాటంగానే మిగులుతుందా అన్నది వేచి చూడాల్సిందే.

ఇదీ విషయం




శతాబ్దాల వెనుకటి
చీకటి
చరిత్రలో
రారాజులు
చేసిందే
ఈరోజున జరుగుతుంది
అదే అదే
ఆనాటికి ఈనాటికి
కొద్దిమంది లోకాన్నంతా
కొల్లగొట్టుకొని
తినే విధానం

- కుందుర్తి

అంతర్జాతీయం

వెనిజులాలో మరో కుట్రకు తెర తీసిన అమెరికా

కె గడ్డెన్న


ట్రంప్ | మదురో | గైడో

అక్రమంగా తనకు తాను తాత్కాలిక అధ్యక్షుడినని ప్రకటించుకున్న గైడోకు బాహాటంగా మద్దతు పలికిన ట్రంప్ తన చర్యను సమర్థించుకోవడానికి వెనిజులాలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నాడు. పశ్చిమాసియాలో అత్యంత నిరంకుశమైన సౌదీ రాచరిక ప్రభుత్వాన్ని, ఈజిప్టులో జనరల్ సిసి నేతృత్వంలోని పచ్చి నియంతను సమర్థించిన ట్రంప్ ప్రభుత్వం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా వుంది.

వెనిజులాలో ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగబద్ధంగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికై అధికార బాధ్యతలు చేపట్టిన రెండు వారాలకే మదురో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అమెరికా సరికొత్త కుట్రకు తెగబడింది. వెనిజులా జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడు జువాన్ గైడో తనకు తాను తాత్కాలిక అధ్యక్షుడినని బుధవారం కారకాస్‌లో జరిగిన ఓ ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలో ప్రకటించుకోవడం, ఆ వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మైక్ పాంపియో గైడోను అధ్యక్షుడిగా అధికారికంగా గుర్తిస్తున్నట్లు ట్వీట్ చేయడం ఇదంతా పకడ్బందీగా పన్నిన కుట్రలో భాగమే. రెండేళ్ల క్రితం వెనిజులా నూతన జాతీయ రాజ్యాంగ పరిషత్ ఎన్నికతో జాతీయ అసెంబ్లీకి వున్న అధికారాలన్నీ రద్దయి, రాజ్యాంగ పరిషత్‌కు దఖలు పడ్డాయి. జాతీయ అసెంబ్లీకి ఇక ఎలాంటి అధికారాలు కానీ, విలువ కానీ లేదని వెనిజులా సుప్రీం ట్రిబ్యునల్ ఆనాడే స్పష్టం చేసింది. అయినా తనకు లేని అధికారాలను జాతీయ అసెంబ్లీ ఆపాదించుకుని, మదురో స్థానే తాత్కాలిక అధ్యక్షుడిగా గైడోను నియమిస్తున్నట్లు ప్రకటించడం చట్ట విరుద్ధమే కాదు, కోర్టు ధిక్కారం కూడా. ఇటువంటి చట్టవిరుద్ధమైన, అప్రజాస్వామిక చర్యకు అమెరికా, దాని కొత్త మిత్రుడు బోల్సనారా (బ్రెజిల్), కెనడా, కొలంబియా వెంటనే మద్దతు ప్రకటించాయి. అమెరికాకు వంత పాడే విషయంలో ఫ్రాన్స్, ఇయు తర్జన భర్జన పడుతున్నాయి. అమెరికా కుట్రను క్యూబా, బొలీవియా, రష్యా, టర్కీ, మెక్సికో వ్యతిరేకించాయి. మదురో ప్రభుత్వాన్ని రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వంగా గుర్తిస్తున్నట్టు అవి స్పష్టంగా ప్రకటించాయి. వెనిజులాతో సన్నిహిత ఆర్థిక, రాజకీయ సంబంధాలను అవి కొనసాగిస్తున్నాయి. ప్రపంచంలో అతి పెద్ద చమురు నిల్వలు ఉన్న దేశాల్లో ఒకటి అయిన వెనిజులాను తన గుప్పెట్లో పెట్టుకోవడం ద్వారా వనరులను కొల్లగొట్టాలన్నది అమెరికా పన్నాగం. వెనిజులాలో బొలివేరియన్ సోషలిస్టు ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా పన్నని కుట్ర లేదు. 2002లో హ్యూగో ఛావెజ్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు జార్జి డబ్ల్యు బుష్ సిఐఎ ద్వారా సైనిక కుట్రకు పాల్పడ్డాడు. అసంఖ్యాక ప్రజా మద్దతుతో ఛావెజ్ ఆ కుట్రను వమ్ము చేశాడు. ఒబామా ప్రభుత్వం వెనిజులాను అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి ముప్పుగా చిత్రించి ఆర్థిక ఆంక్షలు విధించింది. ట్రంప్ ప్రభుత్వం వెనిజులాలో సైనిక జోక్యానికి, పార్లమెంటరీ కుట్రలకు నిరంతరం యత్నిస్తూ వస్తోంది.

ఏ విధమైన చట్టబద్ధత లేని గైడోను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తిస్తున్నట్లు ట్రంప్ ట్వీట్ చేయడం ద్వారా వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో నగ్నంగా జోక్యం చేసుకున్నాడు. ఈ కుట్రను తిప్పికొట్టేందుకు మదురో అమెరికా దౌత్యవేత్తలను తక్షణమే దేశం వీడి వెళ్లాల్సిందిగా ఆదేశించాడు. మదురో డిక్రీ చెల్లదని, అమెరికా దౌత్యవేత్తలు ఎప్పటిలాగే ఇక్కడ ఉండొచ్చని తాత్కాలిక అధ్యక్షుడు గైడో ఆదేశం జారీ చేశారు. తద్వారా వెనిజులాలో అరాచక వాతావరణం సృష్టించి, ఆపై సైనిక జోక్యానికి దిగాలన్నది ట్రంప్ పథకం. వెనిజులాలో అమెరికా సైనిక జోక్యం చేసుకుంటుందా అని విలేకరులు అడిగితే అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని ట్రంప్ బదులిచ్చాడు. దీనిని పసిగట్టిన మదురో అమెరికాతో దౌత్య సంబంధాలను తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించాడు. అమెరికాలోని వెనిజులా ఆస్తులను జప్తు చేయాలని, వెనిజులా చమురు ఎగుమతులను అడ్డుకునేందుకు నావికా దిగ్బంధనం విధించాలని ట్రంప్ ప్రభుత్వం చూస్తోంది. అక్రమంగా తనకు తాను తాత్కాలిక అధ్యక్షుడినని ప్రకటించుకున్న గైడోకు బాహాటంగా మద్దతు పలికిన ట్రంప్ తన చర్యను సమర్థించుకోవడానికి వెనిజులాలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నాడు. పశ్చిమాసియాలో అత్యంత నిరంకుశమైన సౌదీ రాచరిక ప్రభుత్వాన్ని, ఈజిప్టులో జనరల్ సిసి నేతృత్వంలోని పచ్చి నియంతను సమర్థించిన ట్రంప్ ప్రభుత్వం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా వుంది. 2018 మే 21న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో 60 లక్షల మంది (68 శాతం) మద్దతుతో తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి హెన్రీ ఫాల్కాన్‌కు 21 శాతం, ఎవాంజెలిస్ పాస్టర్ జేవియర్ బెర్టుచికి 10శాతం ఓట్లు వచ్చాయి. అధిక సంఖ్యలో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్న ఈ ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛగా జరిగినట్లు అమెరికా పరిశీలకులతో సహా అంతర్జాతీయ పరిశీలకుల బృందం కితాబిచ్చింది. అయినా ట్రంప్ ప్రభుత్వం ఈ ఎన్నికలు అక్రమమని, వీటిని తాము గుర్తించడం లేదని చెప్పడం దాని తెంపరి తనాన్ని తెలియజేస్తోంది. మదురో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అది కుట్రలు మీద కుట్రలు పన్నుతోంది. ఆగస్టు 4న బొలివేరియన్ నేషనల్ గార్డు 81వ వార్షికోత్సవాల సందర్భంగా మదురోపై డ్రోన్లతో దాడి జరిపించింది. ఆ దాడి నుంచి మదురో సురక్షితంగా బయటపడ్డారు. కొద్ది రోజుల క్రితం వెనిజులా ఆయుధ గిడ్డంగులపై దాడికి యత్నించగా సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. జనవరి10న జరిగిన మదురో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి క్యూబా, బొలీవియా, నికరాగ్వా తదితర దేశాల అధినేతలు స్వయంగా హాజరై సంఘీభావం ప్రకటించడంతో బెంబేలెత్తిన ట్రంప్ ప్రభుత్వం గైడోను తెరపైకి తెచ్చింది. 68 శాతం మంది మద్దతుతో ఎన్నికైన మదురోను అక్రమ ప్రభుత్వమని, ప్రజల చేత ఎన్నుకోకుండా దొడ్డి దారిన తాత్కాలిక అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకున్న గైడోనే అసలైన అధ్యక్షుడు అని చెప్పడం ట్రంప్‌కే చెల్లింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పాపులర్ ఓటు ద్వారా కాకుండా ఎలక్టొరల్ కాలేజీలో స్థానాల ద్వారా గద్దెనెక్కిన నేత నుంచి ఇంతకన్నా ఏమి ఆశించగలం.

అమెరికాకు దాస్యం చేస్తున్న ఒఎఎస్, లిమా గ్రూపు

అమెరికా సామ్రాజ్యవాదం లాటిన్ అమెరికాలో ముఖ్యంగా వెనిజులా, నికరాగ్వాల్లో పన్నుతున్న కుట్రలకు అమెరికా దేశాల కూటమి (ఒఎఎస్), లాటిన్ అమెరికాలో స్పానిష్, పోర్చుగీస్ భాష మాట్లాడే దేశాల కూటమి (లిమా గ్రూపు) వంత పాడుతున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలో అమెరికాకు అవి బంటులుగా వ్యవహరిస్తున్నాయి. లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల ఉమ్మడి ప్రయోజనాల కోసం పాటుపడాల్సిన ఒఎఎస్ దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నది. వెనిజులాలో ట్రంప్ ప్రభుత్వం నగ్నంగా జోక్యం చేసుకుంటుంటే దానిని ఖండించాల్సింది పోయి అమెరికానే వెంటేసు కొచ్చేలా ఒఎఎస్ సెక్రటరీ జనరల్ లూయిస్ అల్మాగ్రో మాట్లాడుతున్నారు. 1960లో అంటే క్యూబా విప్లవం విజయం సాధించిన 12 మాసాలకే క్యూబాకు వ్యతిరేకంగా ఉత్తర అమెరికాతో కలిసి దాడికి దిగినప్పుడే ఒఎఎస్ కూటమి అసలు రంగు బయటపడింది. కోస్టారికాలోని శాన్ జోస్‌లో జరిగిన ఒఎఎస్ ఏడవ విదేశాంగ మంత్రుల సమావేశం క్యూబాను ఖండించాలని తన సభ్య దేశాలను కోరింది. క్యూబాను ఒంటరిపాటు చేసేందుకు రాజకీయంగా, దౌత్య పరంగా ఎలా ప్రయత్నించిందీ ఆ తరువాత బయటకొచ్చిన సిఐఎ రహస్య పత్రాలు తెలియజేస్తున్నాయి. ఇప్పుడు కూడా వెనిజులా, నికరాగ్వాలో ఒఎఎస్ అటువంటి విచ్ఛిన్నకర పాత్రనే పోషిస్తోంది. వెనిజులాలో మదురో ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతూ, ప్రత్యర్థుల మానవ హక్కుల ఉల్లంఘన, విద్యార్థులు, రాజకీయ నాయకులు, పౌరుల హక్కులను హరిస్తున్నదని అమెరికన్ మీడియాతో కలసి అసత్య ప్రచారం సాగిస్తోంది. చిలీ, అర్జెంటీనా, బ్రెజిల్, కొలంబియాలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, సామాజిక వేత్తలు, దేశీయ తెగలకు చెందిన వారిపై యథేచ్ఛగా హత్యాకాండ సాగుతుంటే వాటి గురించి లూయిస్ అల్మాగ్రో మాట్లాడరు. పైగా ఆ దేశాల్లో ప్రభుత్వాలను వెనకేసుకొస్తారు. లాటిన్ అమెరికా ప్రజలను గందరగోళపరచి, ఈ ప్రాంతంలో అమెరికా సామ్రాజ్యవాదుల కుట్రలకు అన్ని రకాల తోడ్పాటునందిస్తారు. కుహనా లిమా గ్రూపు కూడా అమెరికన్ సామ్రాజ్యవాదానికి ఇదే విధంగా దాస్యం చేస్తోంది. భవిష్యత్తులో మరింత ఉధృతంగా అవి ఈ పని చేస్తాయి. ఇటువంటి శక్తుల పట్ల లాటిన్ అమెరికా కార్మిక వర్గం అప్రమత్తంగా వుండాలి.

సమీక్ష

సామర్థ్యం అరుణ్ జైట్లీది మూల్యం చెల్లించేది ప్రజలు



మోడీ తనను తాను ఒక సమర్థుడైన ప్రధానిగా ఏవిధంగా వర్ణించుకుంటూ గొప్పలు పోతున్నారో, అరుణ్ జైట్లీ కూడా తనను తాను సమర్థుడైన ఆర్థికమంత్రిగా చిత్రీకరించుకుంటూ గొప్పలు పోతున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడంతోబాటు అదుపులో పెట్టామని జైట్లీ పదేపదే ప్రకటిస్తున్నారు. 2014-15లో 4.1 శాతం ద్రవ్యలోటు ఉండగా 2018-19 నాటికి దానిని 3.3 శాతానికి తగ్గించగలిగామని చెప్పుకుంటున్నారు. ద్రవ్యలోటు తగ్గడమంటే ఆర్థిక పరిస్థితి మెరుగుపడినట్టే కదా! మరి ఈ ద్రవ్యలోటు తగ్గి అదుపులో ఉండడమనేది ఎలా సాధ్యపడింది?

మొదటిది : మోడీ ప్రభుత్వానికి ముడి చమురు ధరలు తగ్గడం బాగా కలిసొచ్చింది. 2009-14 మధ్య కాలంలో ముడి చమురు ధర సగటున బ్యారెల్‌కు రూ.96.24 ఉండగా 2014-18 మధ్య అది రూ.61.60కు తగ్గింది. అందువలన ముడి చమురు దిగుమతి కోసం చెల్లించాల్సిన సొమ్ము 1/3వ వంతు తగ్గింది. ఇది మొదటి ప్రయోజనం. ఖర్చు తగ్గింది. ముడి చమురు ధర తగ్గినా పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గలేదు సరికదా పెరిగాయి. దీని పర్యవసానంగా ఆయిల్ కంపెనీల లాభాలు బాగా పెరిగాయి. ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీల నుండి ప్రభుత్వానికి అందే డివిడెండ్లూ పెరిగాయి. అంటే ఆదాయం పెరిగింది. ఇది రెండో ప్రయోజనం. పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గలేదు కనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు తగ్గలేదు. ఇది మూడో లాభం. ముడి చమురు ధరను బట్టి కేంద్ర ప్రభుత్వం ఎరువుల కంపెనీలకు చెల్లించవలసిన సబ్సిడీని నిర్ణయిస్తారు. ఎరువుల తయారీలో సహజ వాయువు, నాఫ్తా వంటివి ముడి పదార్థాలు. వీటి ధర ఎక్కువగా వుంటే ఎరువుల కంపెనీకి సబ్సిడీ ఎక్కువ చెల్లించాలి. వీటి ధరలు ముడి చమురు ధరతో ముడిపడి వుంటాయి. ఈ కాలంలో ముడి చమురు ధర తగ్గింది కనుక ప్రభుత్వం ఎరువుల కంపెనీలకు చెల్లించవలసిన సబ్సిడీ తగ్గింది. ఇది నాలుగో లాభం.

ఇంత సానుకూలత మోడీ ప్రభుత్వానికి ముడి చమురు ధరలు పడిపోయినందున వచ్చినా ద్రవ్యలోటు తగ్గడం లేదు. అందువలన ఎరువుల సబ్సిడీని కంపెనీలకు చెల్లించకుండా బకాయిలు పెట్టారు. మోడీ హయాంలో ఆవిధంగా బకాయి పడిన ఎరువుల సబ్సిడీలు 350 శాతం పెరిగాయి. ఇదీ చాలలేదు. 2017-18లో ద్రవ్యలోటు 4 శాతం దాటిపోయేలా ఉందని గమనించి దానిని తక్కువ చేసి చూపడానికి ఇంకో పని చేశారు జైట్లీ. ఎఫ్‌సిఐ సబ్సిడీ బియ్యం సేకరణ చేస్తుంది. మార్కెట్‌లో రైతుల వద్ద కొన్న ధర ఎక్కువగా వుంటుంది. రాష్ట్రాలకు తక్కువ రేటుకు ఇవ్వాల్సి వుంటుంది. ఈ తేడాను కేంద్రబడ్జెట్‌లో ఎఫ్‌సిఐకి సబ్సిడీ రూపంలో కేటాయిస్తారు. ఈ సబ్సిడీ నుండి ఏకంగా రూ.50 వేల కోట్లు తిరిగి వెనక్కి తీసేసుకున్నారు. దానిని భర్తీ చేయలేదు. దాంతో ఎఫ్‌సిఐ మార్కెట్ నుండి రుణం తీసుకున్నది. ఇప్పుడు ఆలోటు ఏకంగా రూ.71,000 కోట్లకు పెరిగింది.

2014-15లో ద్రవ్యలోటు తగ్గించగలిగామని చెప్పుకోడానికి ఆ ఏడాది బడ్జెట్‌లో వివిధ పద్దులకు కేటాయించిన నిధులలో ఏకంగా రూ.130 వేల కోట్లు కోత పెట్టారు.

ఈ ఏడాది ఉపాధి హామీ కింద చెల్లించాల్సిన బకాయిలు ఏకంగా రూ.55 వేల కోట్ల మేరకు పేరుకు పోయాయి. ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు పార్లమెంటు కల్పించిన హక్కు. పని చేసిన 15 రోజుల లోపు వేతనం చెల్లించాలి. కాని ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు.

ముడి చమురు ధరలు తగ్గినా, పెట్రో ధరల బాదుడు ప్రజలకు తప్పలేదు. ఎరువుల కంపెనీల సబ్సిడీల చెల్లింపు ఎగ్గొట్టారు. ఎఫ్‌సిఐ సబ్సిడీ ఎగ్గొట్టారు. సంక్షేమ పథకాలకు కేటాయించిన మొత్తాలు ఖర్చు చేయలేదు. నిరుపేద గ్రామీణ కూలీల వేతనాలు ఎగ్గొట్టారు. ఇన్నివిధాలా ప్రజలను, ప్రజోపయోగ సంస్థలను పీడించి ద్రవ్యలోటు తగ్గించానని జబ్బలు చరుచుకుంటున్నారు జైట్లీ. ప్రజలు మాత్రం అందుకు మూల్యం చెల్లిస్తున్నారు!

సందర్భం

ఓటు వజ్రాయుధం

ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఓటే వజ్రాయుధం. నాయకుల రాతను మార్చే అస్త్రం. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును సద్వినియోగం చేసుకున్నప్పుడే ఎన్నుకున్న నేతను నిలదీయగలం. అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు, ఎలాంటి వాడో చూడాలి. ఇప్పటివరకు ఏం చేశాడో చూడాలి. పెట్టుకునే టోపి కాదు పెట్టిన టోపి చూడండి. బతకటానికి రాజకీయాల్లోకి రావద్దు, బతుకులను మార్చేందుకు రండి అని ఓటుతో సమాధానం చెప్పండి. 'రాజకీయం ఉద్యోగం కాదు, ఒక సామాజిక బాధ్యత' అని ఓటుతో నిరూపించాలి. అధికారం కోసం, డబ్బు కోసం, ఆడంబరం కోసం రాజకీయాల్లోకి వచ్చే వారికి ఓటుతో సమాధానం చెప్పాలి. ఓటర్లే దేశ ప్రగతిని మార్చే షూటర్లు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకుని తప్పక ఓటు వేయండి. వేయించండి. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుంటూ ప్రజల భవితకు, భవిష్యత్తుకు భద్రత కల్పించే వారినే ఎన్నుకోండి. నిస్వార్థంగా ఓటు వేయండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి. సమసమాజ సామాజిక న్యాయం కోసం కృషి చేయండి.

(నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం)

యుకె రామకృష్ణ దొర,
కొత్తగూడెం జిల్లా.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

కత్తిరింపులు

అర్బన్ నక్సల్స్ అంటే ఎవరు?

జి హరగోపాల్



సమాజంలో సంక్షోభం ఉన్నప్పుడు దానికి కారణాలు వెతికే వారుంటారు. హింసకు మూలాలను వెతికే వారుంటారు. 'కారణాలను, ప్రత్యామ్నాయాలను వెతికేవారిని మాట్లాడేవారిని 'ఉగ్రవాదులు'. చట్టాన్ని తుంగలో తొక్కైనా సరే వాళ్లను అణచివేయండి' అనే వారిని ఏం అనాలి?

సంఘ పరివార్ భావజాలాన్ని వ్యతిరేకించే వారందరిపై నక్సల్స్ అని ముద్ర వేసి, తమ భావజాలాన్ని తమకు తామే సమర్థించుకొని, ఇతర భావజాలాల మీద ప్రత్యామ్నాయాల మీద దుమ్ము చల్లడం నేడు ఒక కళగా మారింది. ఫలానా వాళ్ళు అర్బన్ నక్సల్స్ అని వాళ్ళు విశ్వవిద్యాలయాలలో విద్యార్థులని రెచ్చగొడుతున్నారని వాళ్ళను అడవులకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఏ ఆధారాలు లేకుండా ఆరోపిస్తున్నారు. ఉపన్యాసాల ద్వారా ఉత్తేజితులై అడవికి పోయే వారుండరు. మనుషులు అలా ప్రభావితం కారు. యువత తమ జీవిత అనుభవం నుండి, తమ కుటుంబ నేపథ్యం నుండి, సమాజంలో కొనసాగుతున్న అన్యాయాల నుండి ప్రభావితం అవుతారు. ఒక చిన్న పిల్లవాడు పెంటకుప్ప మీద ఆహారాన్ని వెతుకుతుంటే చూసిన వారు దానికి చలించి సమాజంలో ఎందుకు ఇంత అన్యాయం ఉంది అని ప్రశ్నిస్తూ సమాధానాలు వెతికే క్రమంలో ఉద్యమాలకి పోవచ్చు.

కొందరు చాలా బాధ్యతారహితంగా 'ఉగ్ర మేధావులు' వంటి పదాల్ని ఉపయోగిస్తున్నారు. మేధో ఉగ్రవాదులు అంటే మేధావులంతా ఉగ్రవాదులు అని భావించడమా లేక ఉగ్రవాదు లంతా మేధావులు అని సూత్రీకరించడమా అర్థం కాదు. మేధావి అంటే సమాజ చలనాన్ని, చరిత్ర పరిణామ క్రమాన్ని గమనిస్తూ, మానవాళి ఎటు ప్రయాణం చేస్తున్నదని అర్థం చేసుకుంటూ, చరిత్ర గమనాన్ని చెప్పేవాడు. మేధావి ఒక న్యాయబద్ధమైన, ఉదాత్తమైన మానవీయ స్వప్నాన్ని కలిగివుండేవాడు. మనుషులను ప్రేమించేవాడు, మానవాళికి మంచి భవిష్యత్తు ఉండాలని ఆశపడేవాడు. సమాజంలోని అన్యాయాలను విశ్లేషించేవాడు. మేధో జగత్తుకు ఆద్యుడుగా మనమందరం భావించే సోక్రటీస్ చేసిన పనేమిటి? యువతలో మౌలికమైన ఆలోచనలను రేకెత్తించి మంచి మనుషులంటే ఎవ్వరు అనే తాత్విక ప్రశ్నలడిగి, యువతలో నైతిక విలువలను పెంపొందించడానికి కృషి చేస్తే ఆయనను మేధో ఉగ్రవాదిగా ముద్ర వేసి అప్పటి పాలకులు ఆయనకు మరణశిక్షను వేసారు. పాలకులు ఇచ్చిన విషాన్ని తాగుతూ తన శిష్యులతో సంభాషిస్తూ మరణాన్ని ఆహ్వానించిన వాడు. ఇవాళ సోక్రటీస్ ప్రపంచానికి ఒక వెలుగు దివ్వెగా మారాడు.

విల్‌డ్యురాంట్ రాసిన 'స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ' పుస్తకంలో క్రైస్తవ మతోన్మాదుల చేతుల్లో చిత్రహింసలు పడిన తత్వవేత్తల జీవిత అనుభవాల గురించి వివరంగా రాశారు. అంతెందుకు ఇవ్వాళ శాస్త్రీయ విజ్ఞానానికి బీజాలు వేసి శాస్త్రజ్ఞులకి స్ఫూర్తిదాయకమైన గెలీలియో, కోపర్నికస్ ...చిత్రవధలు అనుభవించినవారే. చరిత్రలో మౌలిక ప్రశ్నలు అడిగినందుకు నాటి ఆధిపత్య వర్గాలు వాళ్లందరిని 'మేధో ఉగ్రవాదులు' అనే భావించింది. వాళ్ళ చిత్రవధల పునాదుల మీద మానవ నాగరికత ముందుకు నడిచింది.

సమాజంలో అన్యాయాలు ఉన్నంత కాలం ప్రతిఘటన ఉంటుంది. బానిస సమాజానికి వ్యతిరేకంగా పోరాడిన సోక్రటీస్ ఇవాళ ప్రపంచానికి ఆరాధ్యుడయ్యాడు. అంతెందుకు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, బ్రిటిష్ వాళ్ల దృష్టిలో ఉగ్రవాదే, మనకు ఆయన స్వాతంత్ర్య పోరాట యోధుడయ్యాడు. చరిత్ర అంతా ఉద్యమాలు, పోరాటాలున్నాయి. ఈ పోరాటాలు ఎందుకు జరిగాయి, ఎందుకంత ప్రాణ నష్టం జరిగింది అనే ప్రశ్నలు అడగాలి. ఇంత చరిత్ర అనుభవ వెలుగులో ప్రాణ నష్టం లేకుండా సమాజాలు మారవా? మనం మార్చలేమా? అన్నది మనందరి ముందున్న సవాలు. భారత రాజ్యాంగం ఈ ప్రశ్నకు జవాబుగానే ఒక శాంతియుత మార్పును కోరుకుంది. ఆదేశిక సూత్రాలలో ఒక సమ సమాజాన్ని ఆశిస్తూ అలాంటి సమాజాన్ని సాకారం చేసుకోవడానికి ప్రజలకు ప్రాథమిక హక్కులు ఇచ్చింది. పూర్తి భావ ప్రకటన స్వేచ్ఛను కల్పించింది. ఈ హక్కులు కాపాడడానికి చట్టబద్ధ పాలనను ఒక మౌలిక ప్రమాణంగా అంగీకరిం చింది. తీవ్రవాదులు చట్టాన్ని ప్రశ్నిస్తున్నారు కాబట్టి ఆ చట్టాన్నే మేం అంగీకరించేది లేదు అనే ప్రతివాదు చట్ట వ్యతిరేకే. ఎదుటివాడు చట్టాన్ని గౌరవించడం లేదు అని అనేవాళ్లకు తమకంటూ చట్టం మీద గౌరవం ఉంటే ఆ వాదన చెల్లుతుంది. అంటే నా ఎదుటివారికి చట్టం మీద గౌరవం లేదు కాని అతని పట్ల చట్టబద్ధంగా మాత్రమే ప్రవర్తించాలి. అన్న వాళ్లకు మాత్రమే చట్టాన్ని గురించి మాట్లాడే అర్హత ఉంటుంది.

ఇవ్వాళ మన మధ్యే ఉన్న పది మందిని అర్బన్ నక్సల్స్ పేర జైళ్లల్లో నిర్బంధించారు. వీళ్లు అర్బన్ నక్సల్స్ అని ఎవరు నిర్ధారించాలి. చట్టం ప్రకారం న్యాయస్థానాలు నిర్ధారించాలి. వీళ్లందరిని అరెస్టు చేస్తే సుప్రీంకోర్టు తలుపు అని అర్ధరాత్రి తట్టారు అంటే మరి ఎవ్వరిదగ్గరకు వెళ్ళాలి. తలుపులు తడతారనే చట్టాలను మారుస్తూ రాజ్యానికి మరిన్ని విపరీతమైన, విచ్చలవిడి అధికారాలు కల్పించారు. ఉపా (UAPA) చట్టం కింద ఎవ్వరినైనా, ఏ ఆధారాలు లేకున్నా కనీసం ఆరు నెలలు జైళ్లల్లో పెట్టవచ్చు. ఇది చిదంబరం చేసిన చట్టం. ఈ చట్టం కిందే ఆయనను ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు. అమాయకులను పట్టుకొని అలా నిర్బంధిస్తే రక్షణ ఏమిటి? ఎవరు అమాయకులు ఎవరు దోషులని ఎవ్వరు నిర్ధారించాలి? ఇవాళ అరెస్టు అయిన పది మంది గురించి రాయటానికి ఈ వ్యాసం పరిధి సరిపోదు. మచ్చుకి గతంలో అరెస్టు చేసిన పది మందే కాక ఈ మధ్య అంబేద్కర్ కుటుంబ సభ్యుడు, అంతర్జాతీయంగా గుర్తింపబడ్డ మేధావి ఆనంద్ తెల్తుందె గురించే చర్చిద్దాం.

ఆనంద్ తెల్తుందె అతి పేద దళిత కుటుంబంలో పుట్టాడు. చిన్నప్పటి నుండి క్లాసులో ఫస్టే. హై స్కూలులో చదివేప్పుడు ఇళ్లకు సున్నం వేసి డబ్బులు పోగుచేసుకొని చదివాడు. అత్యంత ప్రతిభ కలవాడు కాబట్టే ఐఐటి ఖరగ్‌పూర్‌లో, తర్వాత ఐఐఎం అహ్మదాబాద్‌లో చదివాడు. అటు ఇంజనీరింగ్‌లో, ఇటు మేనేజ్‌మెంట్‌లో అత్యున్నత మైన ర్యాంకులు సాధించాడు. ఉద్యోగరీత్యా ఒక బహుళజాతి కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పని చేసి, అది వదిలి ఐఐటి ఖరగ్‌పూర్‌లో ప్రొఫెసర్‌గా చేరాడు. ఇప్పుడు గోవాలో ఒక మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో అత్యంత క్లిష్టమైన, అధునాతన మెగా డేటా బోధిస్తున్నాడు. ఆయన చేసిన పాపం అల్లా, అత్యంత ప్రతిభావంతుడు కావడం వల్ల, అతి పేద కుటుంబ జీవిత అనుభవం వల్ల సమాజంలో ఉండే అన్యాయాల మీద స్పందిస్తూ దళితుల సమస్య మీద, అసమానతల మీద ఖైర్లాంజీ దురాగతాల మీద, సామ్రాజ్యవాదం మీద దాదాపు 26 పుస్తకాలు రాసాడు. ఆయన కుల వ్యవస్థ మీద రాసిన 'రిపబ్లిక్ ఆఫ్ క్యాస్ట్' అత్యంత ప్రామాణిక మైంది. సామాజిక అసమానతల మీద కుల వ్యవస్థ దుర్మార్గాల మీద స్పందించినందుకే ఇవాళ ఆయనను మేధో ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. విచిత్రమైన విషయమేమంటే ఆనంద్‌ని భీమా కోరేగాం సంఘటన 'కుట్ర'లో భాగం చేసారు. కాని ఆయన భీమా కోరేగాం సంఘటనతో విబేధించి, చాలా మంది ఆగ్రహానికి గురయ్యాడు. భీమా కోరేగాంని దళితులు పీష్వాల మధ్య యుద్ధంగా చూడడం సరైంది కాదని రాసాడు (ఆ అభిప్రాయంతో నాకు కూడా అంగీకారం లేదు). భీమా కోరేగాం సంఘటనతో విబేధించిన ఆయనను దాని వెనక ఉన్నాడని, వీరందరి వెనక మావోయిస్టు పార్టీ ఉందని, మావోయిస్టు పార్టీ వెనక కాంగ్రెస్ పార్టీ అందులో రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్ లాంటి వారు ఉన్నారని అనడం ఎంత హాస్యాస్పదమో వేరే రాయనవసరం లేదు. ఇప్పుడు చెప్పండి మేధో ఉగ్రవాదులనే పేర ఎలాంటి వాళ్ళ మీద ముద్ర వేసి జైళ్ళల్లోకి పంపుతున్నారో ఆలోచించండి.

మావోయిస్టు ఉద్యమం ఎందుకు గత ఐదు దశాబ్దాలుగా నిరాఘాటంగా కొనసాగుతుంది అనే ప్రశ్న అడగకుండా ఎలా ఉండగలం. అడిగితేనే మేధో ఉగ్రవాది అయిపోతాడా? ఆ పోరాటాన్ని విశ్లేషించకుండా దానికి పరిష్కారాలు కనుక్కోకుండా దానికి తుపాకి బదులు తుపాకి అంటే బాధ్యతారాహిత్యం అవుతుంది. ఈ ఉద్యమం మీద ఉమ్మడి రాష్ట్రంలో క్యాబినెట్ సబ్ కమిటీని వేసారు. ప్లానింగ్ కమిషన్ ఒక నిపుణుల కమిటీని వేసింది. ఒక పదిహేను మంది ప్రజాస్వామ్య మానవతావాదులు దశాబ్ద కాలం శాంతి చర్చల కొరకై కృషి చేసి విప్లవ పార్టీకి, ప్రభుత్వానికి మధ్య చర్చలు జరిగేలా చూసారు. ఈ పదిహేను మందిలో యస్.ఆర్ శంకరన్, పెద్దలు పొత్తూరి వెంకటేశ్వర రావు, డా॥ జయశంకర్, బొజ్జా తారకం, కోదండరాం, జీవన్ కుమార్ లాంటి వారున్నారు. ఈ చర్చలు జరగడానికి వరవరరావు సహకరించారు. వీరందరినీ-- చర్చలు జరిపిన ఐదుగురు క్యాబినెట్ మంత్రులను, ఒక దశలో చర్చలకి సిద్ధం అన్న చిదంబరంని ఉగ్రవాదులు అందామా? మన దేశంలో ఒక్క బిజెపి పార్టీ దాని అనుబంధ సంస్థలు తప్పించి అన్ని రాజకీయ పార్టీలు ఇది కేవలం శాంతి భద్రతల సమస్య కాదు అని అన్నవారే! సమాజంలో సంక్షోభం ఉన్నప్పుడు దానికి కారణాలు వెతికే వారుంటారు. హింసకు మూలాలను వెతికే వారుంటారు. 'కారణాలను, ప్రత్యామ్నాయాలను వెతికేవారిని మాట్లాడేవారిని 'ఉగ్రవాదులు'. చట్టాన్ని తుంగలో తొక్కైనా సరే వాళ్లను అణచివేయండి' అనే వారిని ఏం అనాలి?

'ఆంధ్రజ్యోతి' సౌజన్యంతో



విజ్ఞాన లోగిలిలో.. సృజన సంబరాలు



ఇంజినీరింగ్ విద్యార్థులంటే ఎలా ఉంటారు? వారిలోని సాంకేతిక ప్రతిభను ఎలా కొలుస్తాం? అసలు దాన్నెలా చూస్తాం? ఇంజినీరింగ్ అంటే- అంతా సీరియస్ చదువేనా? క్యాంపస్ సెలక్షన్ల కోసం వట్టి పడిగాపులేనా? కాదు కాదు. ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానం ... గుంటూరు జిల్లాలోని నంబూరు వివిఐటిలో జరిగిన విద్యార్థుల

నేడు చదువంటే మార్కులూ, ర్యాంకులతో తూకం అయిపోయింది. పోటాపోటీ అంతా అందులోనే నడుస్తోంది. దీనికి భిన్నంగా విద్యాసంస్థలు ప్రతిభకు వేదికయ్యే కార్యక్రమాలు చేపడితే- విద్యార్థినీ విద్యార్థులు ఉత్తుంగ తరంగాల్లా పోటెత్తుతారు. ప్రతిభా పాటవాలు వెల్లివిరిచేలా పాల్గొంటారు.
ఇటీవల గుంటూరు జిల్లా నంబూరు వివిఐటిలో జరిగిన వివిధ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సమ్మేళనమే ఇందుకు నిదర్శనం. వందలాదిమంది విద్యార్థులూ ఆటల్లో, పాటల్లో, సాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శనల్లో ... అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. 'మాకింత ఊతమిస్తే చాలు; రంగం ఏదైనా ప్రకాశిస్తాం.. ప్రజ్వలంగా వెలుగొందుతాం.' అన్న రీతిలో... తమ నైపుణ్యాలను చాటిచెప్పారు. రండి.. ఆ సందడి సంగతులను ఓసారి అవలోకిద్దాం..!

సమ్మేళనం. దేశంలోని 140 యూనివర్సిటీల పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులు ఈ సృజనోత్సవంలో పాల్గొన్నారు.

సృజనాత్మక దారుల్లో ...

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సైతం ఎంతో సృజనాత్మకత ఉట్టిపడుతుంది. ఎన్నో కళలు ప్రజ్వలిస్తూ ఉంటాయి. ఈ సృజనోత్సవం సందర్భంగా అన్ని కళలూ అనేక రూపాల్లో వ్యక్తమయ్యాయి. క్యాంపస్‌లో అడుగు పెట్టగానే ముందుగా కనిపించి మనసును మురిపించిన అద్భుత దృశ్యం.. మైదానంలో సీతాకోకచిలుకల్లా పరుగులు తీస్తున్న విద్యార్థులు... ఎంతో ఉత్సాహంగా ఫుట్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, ఇలా ఎవరికి నచ్చిన ఆటలో వారు చురుగ్గా పాల్గొంటున్నారు. వీటితో పాటు మ్యూజిక్, సింగింగ్, డ్యాన్స్ ఇంకా విజ్ఞానాన్ని పంచే పలు కార్యక్రమాలు కనువిందు చేశాయి. విద్యార్థులు ఎక్కడ ఏ నలుగురు కూడినా ఆటాపాటా.. అల్లరి! అలాంటిది వేల మంది విద్యార్థులు ఒక్కచోట చేరితే వారి ఆనందానికి అవధులు ఉంటాయా మరి? అంతరాలు విడిచి, అన్ని పోటీల్లో పాల్గొంటూ.. వివిఐటిలో సందడి వసంతాన్ని ఆవిష్కరించారు విద్యార్థులంతా.

ఒకే వేదికగా పలు కార్యక్రమాలు

ఈ సృజనోత్సవంలో టెక్నికల్, స్పోర్ట్స్, కల్చరల్ ... ఇలా మూడు విభాగాలుగా కార్యక్రమాలు నిర్వహించారు. టెక్నికల్ విభాగం సాంకేతికత ప్రతిభకు అద్దం పట్టింది. స్పోర్ట్స్ విభాగంలో వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, త్రో బాల్.. వంటి పోటీలు. కల్చరల్ విభాగంలో 12 క్లబ్‌లు ఉన్నాయి. వీటికి అనుసంధానిస్తూ మొత్తం 103 ఈవెంట్లు నిర్వహించారు. 140 యూనివర్శిటీల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.

వినోదంతో.. విజ్ఞానం

అంతరిక్షంపై అవగాహన కల్పిస్తూ స్పేస్ రూం ఒకటి ఏర్పాటు చేశారు. ఇందులో ఇస్రో ఇప్పటివరకూ నిర్వహించినవి, నిర్వహించబోయే కార్యక్రమాలు విఆర్ (వర్చ్యువల్ రియాల్టీ) రూపంలో సిద్ధం చేసి పెట్టారు. క్లబ్ వారీగా కేటగిరీలు చేసి, ఒక్కో క్లబ్‌కు ప్రత్యేకంగా న్యాయనిర్ణేతలని నియమించారు. పెయింటింగ్, కుకింగ్, మిమిక్రీ, లిటరసీ, ఇంగ్లీష్, థియేటర్ యాక్ట్, మోనోయాక్షన్, స్క్రిప్టు, తెలుగుతో పాటు మొత్తం 12 క్లబ్బులుగా విభజించారు. సహజంగా ఇంజినీరింగ్ కాలేజీల్లో తెలుగు భాషకు సంబంధించిన ఈవెంట్స్ చాలా తక్కువగా జరుగుతుంటాయి. వివిఐటిలో మాత్రం 'తెలుగు అభిమాన సమాఖ్య' పేరున ఒక క్లబ్ ఉంది. దానిలో 'సామెత మాది పదం మీది', సాహిత్య పరంగా డ్యాన్స్, మ్యూజిక్ వంటి ఇతివృత్తాలు ఉన్నాయి. ఇంకా వెస్టన్ డ్యాన్స్‌లో వెస్టన్ సోలో, క్లాసికల్‌లో క్లాసికల్ డ్యాన్స్, క్లాసికల్ సోలో, క్లాసికల్ గ్రూపుల్లో పోటీలు జరిగాయి. విద్యార్థులే ఈ ఈవెంట్ల నిర్వాహకులు. కొందరు లెక్చరర్లు జడ్జీలుగా, మరికొందరు కోఆర్డినేటర్లుగా ఉన్నారు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచేలా విద్యార్థులు అన్ని కార్యక్రమాలూ రూపొందించారు.





నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు

అదే విధంగా ఈ సందర్భంగా నిర్వహించిన వర్కుషాపులు ఎంతో ప్రయోజనకరంగా సాగాయి. వివిధ రంగాల్లో ప్రావీణ్యం ఉన్న విద్యార్థులను న్యాయనిర్ణేతలుగా నియమించి, వారి లోపాలను వారే సవరించుకునేలా ఈ వర్క్‌షాపులు నిర్వహించారు. ఏదో ఒక్క విషయానికే పరిమితం కాకుండా విద్యార్థిలో దాగిన నైపుణ్యాన్ని వెలికితియ్యడంతో పాటు తమని తాము నిరూపించుకునేందుకు ఇదొక మంచి వేదికగా నిలిచింది.

రెండ్రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో 6,300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలిచిన వారికి ఏరోజుకారోజు సాయంత్రం బహుమతి ప్రదానం జరిగింది. నాసాకు సంబంధించిన ఎపి రెరా చందు సాంబశివరావు చీఫ్‌గెస్ట్‌గా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇస్రోలో ఉన్న అవకాశాల గురించి ఆయన వివరించారు.



వేదికగా నిలిచాయి



గత ఎనిమిది సంవత్సరాలుగా యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో దాగిన మేధాశక్తిని వెలికితీయడానికి ఇదొక గొప్ప వేదిక. నేటి చదువు మార్కుల కోసం తప్ప మార్పు కోసం ఏమాత్రమూ ఉపయోగపడట్లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకునే చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు, మిగతా రాష్ట్రాల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఫీజుతో నిమిత్తం లేకుండా అన్ని పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించాం. పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్, ప్రోగ్రామింగ్, కల్చరల్ ప్రోగ్రామ్స్, స్పోర్ట్స్ విభాగాల్లో ప్రతిభను ప్రోత్సహించాం. విద్యార్థులు తమలో దాగిన ప్రతిభని బైటకు తీసేందుకు ఇదొక మంచి వేదికగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రతి చిన్న విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం, జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం తెలుస్తుంది.

- కుమార స్వామి,
వివిఐటి కన్వీనర్

అందరినీ ఆకర్షించాయి



ఈవెంట్ కోసం నెల రోజుల నుంచీ కష్టపడ్డాం. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో టెక్నికల్‌తో పాటు పోస్టర్ ప్రజంటేషన్ పెట్టారు. ఎవరైనా ఏదైనా కొత్తగా ఆవిష్కరించడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. ఎవరిలో ఎంత విషయపరిజ్ఞానం ఉందనేది తెలుసుకోవడానికి టెక్నికల్ అంశం సహకరిస్తుంది. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం స్పోర్ట్స్ బాగా ఉపయోగపడతాయి. మొత్తం 14 ఈవెంట్స్ కండక్ట్ చేశాం. వీటిలో ఇండోర్ 3, అవుట్ డోర్ 11. ప్రతి ఒక్కరికీ చదువు ఎంత ముఖ్యమో ఆటలూ అంతే ముఖ్యం. దీంతో పాటు డ్యాన్స్, మ్యూజిక్‌లోనూ విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. నిర్వహించిన కార్యక్రమాలన్నీ అందరినీ బాగా ఆకర్షించాయి. ఇకమీదట ప్రతి ఏటా ఇలాగే కొనసాగాలన్నది నా కోరిక.

– రణధీర్, వివిఐటి

సృజనాత్మకత పెరుగుతుంది



నెల రోజుల ముందే ఈ కార్యక్రమానికి అవసరమైన ప్రణాళిక తయారుచేశాము. ఎప్పుడూ చదువే కాకుండా, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు సృజనాత్మకత పెరుగుతుంది.

– సాయి బాలాజీ, వివిఐటి స్టూడెంట్స్ సెక్రటరీ

ఉన్నత విద్యాలయాలు విద్యార్థులకు కేవలం చదువునే కాదు; జీవితానికి సంబంధించిన అనేక పార్శ్వాలను పరిచయం చేయాలి. వారిలోని ఆటపాటల సామర్థ్యాన్ని, కళల ప్రావీణ్యాన్ని వెలికితీయాలి. జీవితమంటే రంగురంగుల హరివిల్లని చూపించాలి. ఆ ఉల్లాసపు, ఉత్తేజపు సమయంలోనే- బతుకు సంబంధించిన బాటనూ చూపాలి. వివిఐటిలో జరిగిన సృజనోత్సవం అలాంటి పనిని కొంతమేర చేసింది. ఈ సందడి, ఈ సృజన కలగలిసి నిరంతరంగా సాగాలి. అప్పుడే మన యువతకు ఉత్సాహం.. దేశానికి ఆనందకర భవితవ్యం ... !!

– వైష్ణవిశ్రీ

చలికాలంలో జుట్టు సంరక్షణ ఇలా..!

చలి మొదలవుతోందంటేనే మహిళలకు కొత్త సమస్యలు మొదలవుతాయి. సీజనల్ సమస్యల్లో భాగంగా చర్మం పొడిబారిపోవడం, జుట్టు అందవిహీనంగా, నిస్తేజంగా మారిపోవడంతో చాలామందికి కొత్త దిగులు మొదలవుతుంది. ఈ సమస్యల నుంచి తప్పించుకోవాలంటే తీవ్రం కాకముందే సరైన సంరక్షణ చర్యలు చేపట్టాలి. మరి అందమైన జట్టును కాపాడుకోవడం కోసం ఏం చెయ్యాలో తెలుసుకుందాం. వారంలో కనీసం రెండు సార్లు ఆలివ్ ఆయిల్ రాస్తే శిరోజాలకు జవజీవాలు సంతరించుకుంటాయి. చల్లటి గాలులు జుట్టును పొడి బారేటట్లు చేస్తాయి. కాబట్టి అలోవెరా రసంతో తరచూ మర్దన చేస్తే, శిరోజాలు మృదువుగా మారతాయి.



శీతాకాలంలో బయటకు వెళ్లినప్పుడు తలకు ఊలు స్కార్ఫ్ కంటే సిల్క్‌స్కార్ఫ్ కట్టుకోవడం మంచిది.

చలికాలం శిరోజాల రక్షణకు మొదటగా చెయ్యవలసింది తగినంత నీరు తాగడమే. శరీరంలో నీరు లేకపోతే శిరోజాలు గిడచబారతాయి. శిరోజాలు చిట్లడానికి చలికాలం అనువైన సమయం. కాబట్టి జుట్టు కొసలను తరచూ కత్తిరించుకుంటూ ఉండాలి. తడిజుట్టును మెత్తని తువ్వాలుతో తుడుచుకుని, గాలికి ఆరనివ్వడం మంచిది. తీవ్రంగా చలువ చేసే హెర్బల్ నూనెలు వేసవికి పనికొస్తాయి తప్ప, చలికాలానికి అనువుగా ఉండవు. కాబట్టి తలకు నూనె పట్టించేవారు ఈ కాలంలో నూనెను ఎక్కువ సేపు ఉంచకూడదు.

జొన్నలతో మెండైన ఆరోగ్యం



శరీరానికి కావలసిన పోషకాలు అందించడంలో జొన్నలు ప్రముఖపాత్ర వహిస్తాయి. పూర్వ కాలంలో ఆహారంలో భాగంగా వీటిని ఎక్కువగా ఉపయోగించేవారు. జొన్న సంకటి, జొన్న రొట్టెలు చేసుకుని తినేవారు. అందుకే అప్పట్లో వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేవారంటారు పెద్దలు. ప్రస్తుత కాలంలో సరైన పోషకాలు లేని ఆహారం తీసుకోవడం వల్ల అనేక రకాలైన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జొన్నలు వాడకం బాగా తగ్గింది. ఇందులో అనేకరకాలైన పోషకాలు దాగి ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం.

జొన్నల్లో పిండి పదార్థాలు, చక్కెరలు, పీచు పదార్థం, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయి. వీటిలో విటమిన్ బి1, బి2, బి3, బి5తో పాటు క్యాల్షియం, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం, సోడియం వంటి ఖనిజ లవణాలు ఉంటాయి. ఇందులో పీచు పదార్థం పుష్కలంగా ఉండటంతో జొన్నలు జీర్ణకోశానికి మేలు చేస్తాయి. అంతేకాకుండా శరీరంలోని చెడు కొవ్వును నియంత్రిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఎముకల దారుఢ్యాన్ని మెరుగుపరుస్తాయి. జొన్నల్లో ప్రోటీన్లు, ఫైబర్ అధిక మొత్తంలో లభిస్తుంది. అధిక బరువుతో బాధపడేవారు ఈ జొన్నలను ప్రతిరోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

పిల్లల కోసం.. ఓ నాన్న మినీ ఆటో బహుమతి!



పిల్లలు కోరుకునే విలువైన ఆట బొమ్మలను వారికందించాలని ఏ తల్లిదండ్రులకూ ఉండదు చెప్పండి. ఏదైనా కొత్తగా ఉండేవి పిల్లల చేతికందితే వారి సంతోషానికి అవధులే ఉండవు. అలాంటి కొత్తదనం కోసం ఏం చేయాలా అని ఆలోచించాడు ఓ తండ్రి. మనసుంటే మార్గముంటుందని అంటారు కదా! ఆ మార్గంలోనే తన పిల్లలను సంతోషపరిచాడు. దాని కోసం ఏకంగా ఓ మినీ ఆటోనే తయారుచేశాడు కేరళలోని ఇడుక్కి ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్ పురుషోత్తమన్. అరుణ్‌కుమార్ ఇడుక్కి జిల్లా ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు. వారు ఆడుకునేందుకు ఓ మినీసైజు ఆటోనే తయారుచేసి, బహుకరించాడు. అందుకు స్ఫూర్తి ఓ సినిమా అట!

1990లో మళయాళంలో విడుదలైన 'ఆయ్ ఆటో' సినిమాలో ఆటోకు 'సుందరి' అనే పేరుంది. ఆ పేరునే తాను తయారు చేసిన ఆటోకు పెట్టాడు. ఈ ఆటో తయారుచేయడానికి అతనికి ఏడు నెలల సమయం పట్టింది. దానితోపాటు రూ.15 వేల వరకూ ఖర్చయింది. ఇదంతా కూడా యూట్యూబ్ డిఐవై ఛానెల్‌లోని వీడియోలను చూసే తయారుచేశాడు. 'నా తండ్రి వడ్రంగి పనులు చేసేవాడు. చిన్నప్పుడు నేను ఆడుకోవడానికి, చెక్క చక్రాలు కలిగిన సైకిల్‌ను తయారుచేసి, నాకిచ్చారు. అదే సమయంలో వడ్రంగి పరికరాలను ఉపయోగించి, చాలా బొమ్మలను తయారుచేయడం నేనూ నేర్చుకున్నాను' అని చెప్పుకొచ్చాడు అరుణ్. మొదటిగా తన కొడుకు ఆడుకోవటానికి బొమ్మకారు నమూనాను తయారుచేశాడు. దానికోసం వేలాది రూపాయలు ఖర్చయ్యాయి. మళ్లీ చాలా రోజుల తర్వాత కూతురు కోసం మినీ ఆటోను తయారుచేశాడు.

'యూట్యూబ్‌లో మేకింగ్ వీడియోలను జాగ్రత్తగా పరిశీలించాను. ఈ పనికి ఏకాగ్రత చాలా అవసరం. నాకు చిన్నతనం నుంచే పనిముట్ల వినియోగంపై అవగాహన ఉండటంతో అనుకున్నట్లుగానే మినీ ఆటోను సృష్టించగలిగాను. దీని బాడీ కోసం పాత ఇనుప పరికరాలను రీసైకిల్ చేసి, ఉపయోగించాను. ప్రతి పరికరాన్ని తయారుచేసేందుకు శాటిలైట్ డిష్‌ల విడి భాగాలను, గ్యాస్ కట్టర్లను వినియోగించాను. ఈ కష్టమంతా నా పిల్లల సంతోషం కోసమే కదా!' అంటూ సంతోషంతో చెప్తాడు అరుణ్. ఇదిలా ఉంటే తన పిల్లల కోసం మొట్టమొదటిసారిగా తయారుచేసిన మినీ ఆటో మేకింగ్ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇది చూసిన వారంతా ఆటోబొమ్మ త్వరగా పూర్తవ్వాలని కోరారు. అనుకున్నట్టుగానే పూర్తయింది. వీటితో తన పిల్లలు ఆడుకుంటున్న వీడియోలనూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.



ఇప్పుడవి చాలా వైరల్ అయ్యాయి. అంతే కాకుండా ఆ తర్వాతా అతను చాలా బొమ్మలను తయారు చేశాడు. వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ తన సృజనాత్మకతతో తయారుచేసిన వస్తువులను విక్రయించటానికి సిద్ధంగా లేనంటున్నాడు. భవిష్యత్తులో వాటిని మరింత మెరుగుపరచ నున్నట్లు చెప్పుకొస్తున్నాడు అరుణ్.

జీవన సౌరభం

లక్ష్యం నెరవేరటానికి చివరి వరకూ.. ప్రయత్నించాలి. నిరాశకు తావివ్వకూడదు. ఆశావాదమే గొప్పది.. సంతృప్తి ఇంకా గొప్పది.



మీకోసం

తేనె, నిమ్మరసం, కొద్దిగా చక్కెర కలిపిన మిశ్రమాన్ని ముఖంపై అప్లై చేయాలి. ఆ మిశ్రమం ఆరిపోయిన తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం మెరిసిపోతుంది.

సెన్సెక్స్ ↑ 87
36,195

నిఫ్టీ ↑ 18
10,849

రూపాయి ↑ 25 పై
అమెరికా డాలరుకు రూ.
71.07

జాగ్గెల్‌కు ఐఎఎంఎఐ అవార్డు..

ఐఎఎంఎఐ ఇండియా డిజిటల్ సమ్మిట్ 2019లో పేమెంట్ అండ్ ఫిన్‌టెక్ విభాగంలో జాగ్గెల్‌కు అత్యుత్తమ ప్రీపెయిడ్ కార్డ్ సొల్యూషన్ అవార్డు దక్కింది. ఈ అవార్డును జాగ్గెల్ సిఇఒ అవినాష్‌కు ట్రాయ్ చైర్మన్ రామ్ సేవక్ శర్మ, టెలికం శాఖ సెక్రటరీ అరుణ సుందర రాజన్ అందజేశారు. విభిన్న పరిశ్రమలకు అత్యుత్తమ ప్రీపెయిడ్ కార్డు పరిష్కారాలను అందిస్తున్న తమ నిబద్ధతను ఈ అవార్డు మరోసారి నిరూపించిందని అనినాష్ పేర్కొన్నారు.



ఎస్‌బిఐ కార్డు.. ఎతిహాద్ ఎయిర్‌వేస్ ఒప్పందం..

ఎతిహాద్ ఎయిర్‌లైన్స్‌తో లీడింగ్ క్రెడిట్ కార్డు సంస్థ ఎస్‌బిఐ కార్డు ఒప్పందం చేసుకుంది. విదేశాలను చుట్టే భారతీయ ప్రయాణీకుల కోసం తాము తొలిసారి అంతర్జాతీయ సహ బ్రాండ్‌తో భాగస్వామ్యం అయ్యామని ఎస్‌బిఐ కార్డు సిఇఒ హర్దాయల్ ప్రసాద్ పేర్కొన్నారు. తమకు భారత్ అత్యంత కీలక మార్కెట్ అని ఎతిహాద్ ఎయిర్‌వేస్ ఉన్నతాధికారి యసీర్ ఎఐ యూసఫ్ పేర్కొన్నారు.



ఏడాదిలో 'నానో'కు గుడ్‌బై

- ఆ చిన్న కారుపై పెట్టుబడులు పెట్టం
- 7 శాతం పైగా మార్కెట్ వాటా లక్ష్యం
- టాటా మోటార్స్ ప్రెసిడెంట్ వెల్లడి

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో



తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి టాటా హారియర్‌ను విడుదల చేస్తున్న మయాంక్ పరీక్.

రతన్ టాటా కళల కారు నానోను బిఎస్ 4 నిబంధనలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేసే యోచన లేదని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ అన్నారు. నానో కోసం ఇకపై పెట్టుబడులు పెట్టబోమని స్పష్టం చేశారు. 2020 ఏప్రిల్‌తో నానో అమ్మకాలు, ఉత్పత్తిని నిలిపివేస్తామని వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన టాటా మోటార్స్ కొత్త ఎస్‌యువి హారియర్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నానోతో పాటు మరికొన్ని ప్యాసింజర్ వాహనాలను కూడా బిఎస్4 నిబంధనలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయబోమన్నారు. అయితే వాటి వివరాలను వెల్లడించడానికి ఆయన ఆసక్తి చూపలేదు. 2020 ఏప్రిల్ నాటికి అన్ని వాహనాలను బిఎస్4కు మార్చడం చాలా పెద్ద సవాల్‌తో కూడుకున్నదని అన్నారు.

క్రితం 36 నెలల్లో టాటా మోటార్స్ ప్రగతి చాలా మెరుగు పడిందన్నారు. క్రితం ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో పరిశ్రమ 4.4 శాతం పెరుగుదలను నమోదు చేయగా, తమ కంపెనీ ఏకంగా 22.4 శాతం వృద్ధిని కనబర్చిందని అన్నారు. ప్యాసింజర్ సెగ్మెంట్‌లో తమకు మూడేళ్ల క్రితం 2.8 శాతం మార్కెట్ వాటా ఉండగా.. ప్రస్తుతం దాదాపుగా 7 శాతం వాటాకు పెంచుకున్నామన్నారు. 2021–22 నాటికి కొత్త వాహనాలు 90 శాతం మార్కెట్‌ను ప్రభావితం చేయనున్నాయని, ప్రస్తుతం ఇది 60 శాతంగా ఉందన్నారు. క్రితం పండుగ సీజన్ వాహన మార్కెట్‌కు కలిసి రాలేదన్నారు. మార్కెట్‌లో నగదు లభ్యత లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. విద్యుత్ వాహనాల టెక్నలాజీ అభివృద్ధి జరుగుతున్నప్పటికీ.. దేశంలో విద్యుత్ ఛార్జింగ్ మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందన్నారు. కొత్త హారియర్‌కు మంచి డిమాండ్ ఉందని.. దీంతో మూడు నెలల వెయిటింగ్ పీరియడ్ ఉందన్నారు.

కొచర్‌పై ఎఫ్‌ఐఆర్

- ఎట్టకేలకు నమోదు చేసిన సిబిఐ
- దీపక్, వేణుగోపాల్‌పై కూడా..
- వీడియోకాన్ ఆఫీసుల్లో సోదాలు



ముంబయి : వీడియోకాన్–ఐసిఐసిఐ బ్యాంకు క్విడ్‌ప్రోకో కేసులో ఎట్టకేలకు చందా కొచర్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదయ్యింది. చందాతో పాటు ఆమె భర్త దీపక్ కొచర్, వీడియోకాన్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ దూత్‌పై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కేసు ఫైల్ చేసింది. వీడియోకాన్ రుణాలకు సంబంధించిన కేసులో వీరిని ప్రధాన నిందితులుగా ఆరోపించింది. అదే విధంగా మహారాష్ట్రలోని ముంబయి, ఔరంగాబాద్‌లలో ఉన్న వీడియోకాన్ కార్యాలయాలపై గురువారం ఉదయం సిబిఐ మెరుపు దాడులు చేసింది. ఈ కేసులో ఇరు పార్టీల మధ్య క్విడ్‌ప్రోకోకు సంబంధించిన కీలక ఆధారాలు రాబట్టేందుకు సిబిఐ ప్రయత్నిస్తోందని సమాచారం.

వీడియోకాన్ గ్రూప్ రుణాల అవకతవకల వివాదం కారణంగా చందా కొచ్చర్ గత ఏడాది అక్టోబరులో ఐసిఐసిఐ బ్యాంకు సిఇఒ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2012లో వీడియోకాన్ గ్రూప్‌నకు ఐసిఐసిఐ బ్యాంకు రూ.3,250కోట్ల అప్పులు ఇచ్చింది. రుణం మంజూరైన కొద్ది మాసాలకే ఆ కంపెనీ చీఫ్ వేణుగోపాల్ ధూత్.. చందాకొచర్ భర్తకు చెందిన న్యూపవర్ సంస్థలో కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టింది. తుదకు రూ.9 లక్షల నామమాత్ర ధరకే రూ.64 కోట్ల ఆస్తులను దీపక్ కొచర్‌కు అందజేశారనేది ప్రధాన ఆరోపణ. దీంతో చందా కొచర్‌పై విచారణ జరిపించాలని చాలా ఒత్తిడిలు వచ్చాయి. దీపక్, వేణుగోపాల్ ధూత్ న్యూపవర్ సహవ్యవస్థాపకులు కావడంతో క్విడ్‌ప్రోకోకు మరింత బలాన్ని చేకూర్చుతుంది.

ఈ క్విడ్‌ప్రోకోపై గతంలో సెబీ చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో చందాకొచర్ భర్త దీపక్ కొచర్ వీడియోకాన్ గ్రూప్‌తో పలుమార్లు వ్యాపార సంప్రదింపులు జరిపినట్టు వెల్లడయ్యింది. ఈ రుణ కేసు విచారణను సిబిఐ తాజాగా వేగవంతం చేసింది. ముంబయిలోని వీడియోకాన్ కార్యాలయాలు, ఔరంగాబాద్‌లోని న్యూపవర్, ముంబై నారిమన్ పాయింట్‌లోని సుప్రీం ఎనర్జీ కార్యాలయం తదితర పలుచోట్ల సిబిఐ దాడులు చేసి... కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకుంది. వీడియోకాన్‌కు రుణాల జారీలో క్విడ్‌ప్రోకో చోటు చేసుకుందని.. 10 నెలల క్రితం వచ్చిన ఆరోపణలపై 2018 మార్చిలో సిబిఐ ప్రాథమిక విచారణ చేపట్టింది. సాక్షాధారాలు లభించిన తర్వాత ఈ కేసులోని నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

జియో నుంచి రెండు ప్లాన్లు

హైదరాబాద్ : రిలయన్స్ జియో తమ ఖాతాదారుల కోసం రెండు కొత్త దీర్ఘకాల ప్రీపెయిడ్ ప్లాన్లను ఆవిష్కరించింది. రూ.594, రూ.297 రీచార్జితో వీటిని అందుబాటులోకి తెచ్చింది. రూ 594 పథకం కింద 168 రోజులు అన్‌లిమిటెడ్ కాలింగ్, అన్‌లిమిటెడ్ డేటా అందిస్తుంది. అయితే రోజుకు అపరిమిత హైస్పీడ్ డేటా 0.5జిబికే పరిమితం చేసింది. ఆ తరువాత డేటా స్పీడ్ 64కెబిపిఎస్‌కు తగ్గించనుంది. రూ.297 ప్లానులో 84 రోజుల గడువుతో వినియోగదారులు నెలకు 300 ఎస్‌ఎంఎస లతో ఉచిత కాలింగ్ సదు పాయంతో పాటు రోజుకు 0.5జిబి డేటా పొందనున్నారు.

మార్కెట్లకు ఉపశమనం..

ముంబయి : వరుసగా రెండు రోజులు నష్టాలు ఎదుర్కొన్న దేశీయ స్టాక్ మార్కెట్లకు గురువారం స్వల్ప ఉపశమనం లభించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 86 పాయింట్లు పెరిగి 36,195కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 18 పాయింట్లు లాభపడి 10,849 వద్ద ముగిసింది. సెన్సెక్స్ –30లో యస్ బ్యాంకు, రిలయన్స్, టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి, ఎస్‌బిఐ సూచీలు 8.39 శాతం వరకు లాభపడి.. మార్కెట్లకు ప్రధాన మద్దతును అందించాయి. టాటా మోటార్స్, సన్ ఫార్మా, కొటాక్ బ్యాంకు, కోల్ ఇండియా సూచీలు అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

యస్ బ్యాంకు కొత్త సిఇఒగా రన్వీత్ గిల్

14% ఎగిసిన షేర్ విలువ



న్యూఢిల్లీ : ప్రముఖ ప్రయివేటు రంగ విత్త సంస్థ యస్ బ్యాంక్ నూతన ఎండి, సిఇఒగా రన్వీత్ గిల్ నియమితులయ్యారు. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు ప్రస్తుత సిఇఒ రాణా కపూర్ పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. రన్వీత్ నియామకాన్ని ఆర్‌బిఐ కూడా ఆమోదించినట్లు యస్ బ్యాంక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వచ్చే మార్చి 1లోగా రన్వీత్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన ప్రస్తుతం డాయిష్ బ్యాంక్ ఇండియా సిఇఒగా ఉన్నారు. యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు, సిఇఒ రాణా కపూర్ పదవీకాలాన్ని పొడిగించేందుకు ఆర్‌బిఐ ససేమిరా అంగీకరించికపోవడంతో రన్వీత్‌కు ఈ అవకాశం దక్కింది. రన్వీత్‌ను సిఇఒగా ఎంపిక చేసినట్లు ప్రకటన రాగానే మార్కెట్‌లో యస్ బ్యాంకు షేర్లు పరుగులు పెట్టాయి. దీనికి తోడు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ప్రకటించడంతో.. గురువారం బిఎస్ఇలో ఈ సూచీ 8.39 శాతం పెరిగి రూ.231.85 వద్ద ముగిసింది. నిఫ్టీలో ఏకంగా 14.32 శాతం లాభపడి రూ.225.50 వద్ద నమోదయ్యింది. 2018–19 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో యస్ బ్యాంకు లాభాలు 7 శాతం తగ్గి రూ.1,002 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్యూ3లో రూ.1,076.87 కోట్ల లాభాలు ప్రకటించింది.

REASONING FOR ALL COMPETITIVE EXAMS



S. LENIN BABU
LECTURER IN MATHS
GOVERNMENT
POLYTECHNIC COLLEGE
VIJAYAWADA. PH : 9985476035

Logical Sequence of Words

Description : Logical sequence of words is all about Consistent arrangement which is the important course of action of words as per the characteristic laws and all around acknowledged ideas.

Certain between related words are given and numbered, followed by different groupings of the numbers meaning them, as options. The competitor is required to mastermind these words in a logical arrangement in light of a typical property and after that pick the accurately reviewed succession from the given options.

Concept : Logical sequence of words can be discussed by following four sequences. They are:

1. Sequence of Occurrence of events or various stages in a process.
2. Sequence of objects in a class or group, from part to the whole.
3. Sequence of increasing/decreasing size, value, intensity etc.
4. Sequence order of words according to dictionary.

1. Sequence of Occurrence of events or various stages in a process:
In this, the given words might be such that they are identified with a specific occasion or speak to the different phases of a specific binded process from start to finish. An applicant is required to pick that choice from the given options, which speaks to the right logical grouping of the procedure.

2. Sequence of objects in a class or group, from part to the whole:
Words might be given such that they are identified with a specific class or a gathering. A candidate is required to pick that choice from the given option which shows the right logical arrangement of the items in a specific class or gathering. The examples given underneath will give you a superior thought regarding such words.

3. Sequence of increasing/decreasing size, value, intensity etc:
The things or artticles represented by the given words might be identified with each other as far as their properties. An applicant is required to organize the given words on the premise of expanding/decreasing request of their size, age, need, value, intensity etc.

4. Sequence order of words according to dictionary:
In such kind of questions, the applicant is required to pick that choice from the given options, which is having the right consecutive request of words as indicated by the English dictionary. To check the request of words in English dictionary, as a matter of first importance check the principle letter of every word to discover which among these starts things out English letters in order took after by second letter etc. The word whose letter starts things out in English letters in order comes, the word whose letter comes next in English letter set comes next etc.

Model Problems :



Model 1: Arrange the given words in a meaningful sentence. The words are:

a) Composing b) Writing
c) Reading d) Printing

Solution:
Given words are: Composing, writing, reading, printing. By observing the given words, they are about a process of publishing. So, first writing comes then composing and later printing and reading. Therefore, correct order is b, a, d, c.

Model 2: Arrange the following in a logical order, from particular to general.
The words are:
a) Uttar Pradesh b) Universe
c) Lucknow d) World
e) India

Solution:
Given words: Uttar Pradesh, Universe, Lucknow, World, India. Lucknow is a city situated in the Uttar pradesh of India. India is a part of the world and world in turn, is a part of the universe. So, the correct sequence of part to whole is given as Lucknow Uttar Pradesh India World Universe.

Model 3: Arrange the following words in a logical sequence from small to big.
The words are:
a) Gold b) Iron
c) Sand d) Platinum
e) Diamond

Solution:
Given words are: Gold, Iron, Sand, Platinum, Diamond. All the given words represent substances which can be arranged in the expanding request of their expense. The minimum expensive is sand after which comes the expense of iron, followed by gold, jewel and the costliest among all is platinum. Therefore, correct order is Sand, Iron, Gold, Diamond, Platinum.

Model 4: Arrange the following words according to English dictionary. The words are:
a) Frog b) Eagle
c) Grasshopper d) Snake
e) Grass

Solution:
Given words are: Frog, Eagle, Snake, Grass. According to English dictionary, Eagle comes first, followed by Frog which in turn is followed by Grass and the last will be Snake. So, the correct sequential order of words is Eagle, Frog, Grass, Snake.

Model 5: Arrange the following words in a logical sequence.
The words are:
a) Letter b) Phrase
c) Sentence d) Word

Solution:
Given words are: Letter, Phrase, Sentence, Word. A group of Letters makes a Word. A group of words makes a Phrase. A group of Phrases makes a Sentence. Therefore, correct order is Letter, Word, Phrase, Sentence. ★

Model Questions

DIRECTIONS for the question 1 to 5: In each of the following questions, arrange the giver, words in a meaningful sequence and then choose the most appropriate sequence from amongst the alternatives provided below each question ;

1.Q
1. Site **2. Plan**
3. Rent **4. Money**
5. Building **6. Construction**
1. 1, 2, 3, 6, 5, 4
2. 2, 3, 6, 5, 1, 4
3. 3, 4, 2, 6, 5, 1
4. 4, 1, 2, 6, 5, 3

2.Q
1. Sentence **2. Chapter**
3. Letter **4. Book**
5. Word **6. Paragraph**
1. 4, 2, 1, 6, 5, 3
2. 4, 2, 6, 1, 5, 3
3. 4, 6, 1, 2, 3, 5
4. 4, 6, 2, 5, 1, 3

3.Q
1. Police **2. Punishment**
3. Crime **4. Justice**
5. Judgement
1. 1, 2, 3, 4, 5 2. 3, 1, 2, 4, 5
3. 3, 1, 4, 5, 2 4. 5, 4, 3, 2, 1

4.Q
1. Elephant **2. Cat**
3. Mosquito **4. Tiger**
5. Whale
1. 1, 3, 5, 4, 2 2. 2, 5, 1, 4, 3
3. 3, 2, 4, 1, 5 4. 5, 3, 1, 2, 4

5.Q
1. Book **2. Pulp**
3. Timber **4. Jungle**
5. Paper
1. 2, 5, 1, 4, 3 2. 3, 2, 5, 1, 4
3. 4, 3, 2, 5, 1 4. 5, 4, 3, 1, 2

6.Q
1. College **2. Child**
3. Salary **4. School**
5. Employment
1. 1, 2, 4, 3, 5 2. 2, 4, 1, 5, 3
3. 4, 1, 3, 5, 2 4. 5, 3, 2, 1, 4

7.Q
1. Leaf **2. Fruit**
3. Stem **4. Root**
5. Flower
1. 3, 4, 5, 1, 2 2. 2, 4, 1, 5, 3
3. 4, 3, 1, 2, 5 4. 4, 3, 1, 5, 2

8.Q
1. Atomic Age **2. Metallic Age**
3. Stone Age **4. Alloy Age**
1. 1, 3, 4, 2 2. 2, 3, 1, 4
3. 3, 2, 4, 1 4. 4, 3, 2, 1

9.Q
1. Foetus **2. Child**
3. Baby **4. Adult**
5. Youth
1. 1, 2, 4, 3, 5 2. 1, 3, 2, 5, 4
3. 2, 3, 5, 4, 1 4. 5, 4, 2, 3, 1

10.Q
1. Heel **2. Shoulder**
3. Skull **4. Neck**
5. Knee **6. Chest**
7. Thigh **8. Stomach**
9. Face **10. Hand**
1. 2, 4, 7, 10, 1, 5, 8, 9, 6, 3
2. 3, 4, 7, 9, 2, 5, 8, 10, 6, 1
3. 4, 7, 10, 1, 9, 6, 3, 2, 5, 8
4. 3, 9, 4, 2, 10, 6, 8, 7, 5, 1

11.Q
1. Butterfly **2. Cocoon**
3. Egg **4. Worm**
1. 1, 3, 4, 2 2. 1, 4, 3, 2
3. 2, 4, 1, 3 4. 3, 4, 2, 1

12.Q
1. Yarn **2. Plant**
3. Saree **4. Cotton**
5. Cloth
1. 2, 4, 1, 5, 3 2. 2, 4, 3, 5, 1
3. 2, 4, 5, 1, 3 4. 2, 4, 5, 3, 1

13.Q
1. Rain **2. Monsoon**
3. Rescue **4. Flood**
5. Shelter **6. Relief**
1. 1, 2, 3, 4, 5, 6
2. 1, 2, 4, 5, 3, 6
3. 2, 1, 4, 3, 5, 6
4. 4, 1, 2, 3, 5, 6

14.Q
1. Puberty **2. Adulthood**
3. Childhood **4. Infancy**
5. Senescence **6. Adolescence**
1. 2, 4, 6, 3, 1, 5
2. 4, 3, 1, 6, 2, 5
3. 4, 3, 6, 2, 1, 5
4. 5, 6, 2, 3, 4, 1

15.Q
1. Presentation **2. Recommendation**
3. Arrival **4. Discussion**
5. Introduction
1. 3, 5, 1, 4, 2 2. 3, 5, 4, 2, 1
3. 5, 3, 1, 2, 4 4. 5, 3, 4, 1, 2

16.Q
1. Never **2. Sometimes**
3. Generally **4. Seldom**
5. Always
1. 5, 2, 1, 3, 4 2. 5, 2, 4, 3, 1
3. 5, 3, 2, 1, 4 4. 5, 3, 2, 4, 1

17.Q
1. Doctor **2. Fever**
3. Prescribe **4. Diagnose**
5. Medicine
1. 1, 4, 3, 2, 5 2. 2, 1, 3, 4, 5
3. 2, 1, 4, 3, 5 4. 2, 4, 3, 5, 1

18.Q
1. Hecto **2. Centi**
3. Deca **4. Kilo**
5. Deci
1. 1, 3, 4, 5, 2 2. 1, 5, 3, 4, 2
3. 2, 5, 3, 1, 4 4. 5, 2, 1, 4, 3

19.Q
1. Patient **2. Diagnosis**
3. Bill **4. Doctor**
5. Treatment
1. 1, 4, 2, 3, 5 2. 1, 4, 3, 2, 5
3. 1, 4, 2, 5, 3 4. 4, 1, 2, 3, 5

20.Q
1. Probation **2. Interview**
3. Selection **4. Appointment**
5. Advertisement **6. Application**
1. 5, 6, 2, 3, 4, 1
2. 5, 6, 3, 2, 4, 1
3. 5, 6, 4, 2, 3, 1
4. 6, 5, 4, 2, 3, 1

Answers : 1.4, 2.2, 3.3, 4.3, 5.3, 6.2, 7.4, 8.3, 9.2, 10.4, 11.4, 12.1, 13.3, 14.2, 15.1, 16.4, 17.3, 18.3, 19.3, 20.1.

సమస్యలపై డప్పు కళాకారుల ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నం (విశాఖపట్నం)

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన డప్పు కళాకారులకు పింఛను మంజూరు చేయాలని కోరుతూ విశాఖ జిల్లా నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట గురువారం కెవిపిఎస్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ధర్నాలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజన్‌లో చర్మకారులు, డప్పు కళాకారులు చెప్పులు కుడుతూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. సిపిఎం, ప్రజాసంఘాల ఆందోళనతో ప్రభుత్వం దిగివచ్చి 45 ఏళ్లు పైబడిన అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించి దరఖాస్తులు స్వీకరించిందని పేర్కొన్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నా, నేటికి పింఛన్లు మంజూరు కాలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులిచ్చి బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని, ప్రభుత్వ పథకాల ప్రచారంలో అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ పి.రామునాయుడుకు వినతిపత్రం అందజేశారు.

అరకులోయ ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగితో మాట్లాడుతున్న శ్రీనివాసరావు



గిరిజనుల ప్రాణాలకు భరోసా ఏదీ?

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అరకు రూరల్ (విశాఖపట్నం)

విశాఖ మన్యంలో గిరిజనుల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల నాయకులతో కలిసి గురువారం ఆయన అరకులోయ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అరకు ఏరియా ఆసుపత్రి పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ సామెతలా ఉందని, ఆసుపత్రి భవనం గొప్పగా ఉన్నా కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. ఆసుపత్రిలో 13 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారని, ఇలా అయితే వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. గైనిక్, ఆర్థో, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యులు వంటి కీలకమైన స్పెషలిస్టు డాక్టర్లు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య నిపుణులు లేక ఏ కేసు వచ్చినా విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారన్నారు. రెండు అంబులెన్సులు, ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా ఇక్కడ ఆ పరిస్థితి లేదన్నారు. ఆసుపత్రిలో 42 రకాల పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా కేవలం 21 రకాల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారని, మిగిలిన పరీక్షల కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా స్పెషలిస్టు వైద్యులను నియమించాలని, అన్ని రకాల పరీక్షలకు ల్యాబ్, ఐసియు ఏర్పాటు చేయాలని, సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు వెంట సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మండల నాయకులు ఉన్నారు. అనంతరం డుంబ్రిగుడ మండలం సొవ్వ పంచాయతీ పరిధి కంగరుసోల, సాగిరివలస, కొట్రగొంది, గొప్పులవలస గ్రామాల్లో పర్యటించారు.

రెండో రోజూ డిఫెన్స్ సమ్మె సక్సెస్

విధులు బహిష్కరించిన ఉద్యోగులు, కార్మికులు

ప్రజాశక్తి-విశాఖపట్నం

రక్షణరంగ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజూ విజయవంతమైంది. నేవల్ డాక్ యార్డ్ విజయనగర్ గేట్ వద్ద గురువారం అఖిలపక్ష కార్మిక సంఘాలు, యూనియన్ల ఆధ్వర్యాన సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగస భలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ, ప్రధాని మోడీ దేశాన్ని విదేశీ, స్వదేశీ బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. దేశం కోసం పని చేసే ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. పెన్షన్ సాధించుకునే వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎన్‌సిఇయు గౌరవాధ్యక్షులు, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు, ఐఎన్‌సిఇయు ప్రధాన కార్యదర్శి బిఎస్.రెడ్డి, ఎన్‌సిఇయు ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడో రోజు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజనులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి - పెదబయలు రూరల్(విశాఖపట్నం)

విశాఖ ఏజెన్సీలోని పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీ వడ్డేపుట్టు గ్రామంలోని పేద గిరిజనులకు గురువారం సిపిఎం ఆధ్వర్యాన రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మాట్లాడుతూ చలి తీవ్రతతో గిరిజనులు పడుతున్న అవస్థలను గుర్తించి, సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన వీలైనంత ఎక్కువ మందికి రగ్గులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను వెచ్చించైనా మన్యవాసులకు రగ్గులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శరభన్న, సిహెచ్.రామకృష్ణ, రామారావు, పరశురామ్, రాజు, సోమేష్ పాల్గొన్నారు.

లారీ యజమానులపై చర్య తీసుకోవాలి

పోలీస్ స్టేషన్ ఎదుట కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా సమ్మె చేస్తున్న తమపై యజమానులు చేయిచేసుకోవడాన్ని నిరసిస్తూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని నవాబ్‌పాలెం ఏరియా లారీ వర్కర్స్, డ్రైవర్లు, క్లీనర్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. సమ్మె చేస్తున్న లారీ కార్మికుల వద్దకు బుధవారం రాత్రి వచ్చిన యజమానులు సమ్మెలో నుంచి కొంతమందిని విధుల్లోకి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా, యూనియన్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో లారీ డ్రైవర్లకు, యజమానులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. లారీ యజమానులు సంకాబత్తుల నాగసుబ్రహ్మణ్యం, మంచాల నాగు, అడపా ప్రసాద్, యాళ్ల రమేష్, కొత్తపల్లి కుమార్ తమపై చెయ్యి చేసుకున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకూ వెళ్లేది లేదంటూ లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు లారీ కార్మికులు భీష్మించుకుని కూర్చున్నారు. సిఐటియు నాయకులు కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యాన లారీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ బి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1.శతాబ్ది రైలు
2.80
3.డా.హెచ్.ఎస్.పాల్
4.11 ఒప్పందాలు
5.ఆండ్రి రాజోలీనా

ఇసుక, మట్టి, నీరు దోపిడీ

- టిడిపి, వైసిపిలను ఇంటికి పంపండి
- ఒంగోలు సభలో మధు, చంద్రశేఖర్ యాదవ్

ప్రజాశక్తి-ఒంగోలు టౌన్/నూజివీడు



ఒంగోలు సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

వచ్చే ఎన్నికల్లో టిడిపి, వైసిపిలను ఇంటికి సాగనంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు ప్రజలకు పిలుపునిచ్చారు. నూతన ప్రత్యామ్నాయాలను బలపరచాలని సిపిఎం, సిపిఐ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో ప్రజాభేరి సభ జరిగింది. సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్, సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌డి సర్దార్ అధ్యక్షతన జరిగిన సభలో పి మధు మాట్లాడుతూ ఇసుక దోపిడి, మట్టి దోపిడీ, నీరు దోపిడీ... ఇలా అన్ని విధాలుగా టిడిపి నేతలు ప్రజలను దోచుకు తింటున్నారని విమర్శించారు.. ఈ విషయంలో వైపిసి నిసత్తువతో ఉందన్నారు. రూ.వెయ్యి పింఛన్‌ను రూ.2000కు పెంచారనీ, మన జేబులు కొట్టేసి మనకే ఇస్తున్నారని దుయ్యబట్టారు. 15 మంది టిడిపి ఎమ్మెల్యేలు తెలంగాణాలో కెసిఆర్‌కు అమ్ముడుపోతే ఇక్కడ 23 మంది వైసిపి ఎమ్మెల్యేలు చంద్రబాబుకు అమ్ముడుపోయారనీ, రాజకీయాలను భ్రష్టుపట్టించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ, జనసేన కలిసి 175 స్థానాలోనూ పోటీ చేస్తాయని చెప్పారు. ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకొస్తున్న తమను బలపరచాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పిజె చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో కిరాతక పార్టీ అధికారంలో ఉందనీ, గోరక్షక పేరుతో 38 మందిని హత్య చేసిన రాజకీయ పార్టీ అని దుయ్యబట్టారు. మనుషులను నడి రోడ్డుపైనే చంపుతుంటే టిడిపి, వైసిపిలు కేంద్రాన్ని ప్రశ్నించలేదని విమర్శించారు. నేడు సామాన్యులు ఎమ్మెల్యేలు అయ్యే పరిస్థితులు లేవని జనసేన జిల్లా నాయకులు బి.చంద్రశేఖర్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఎన్నిక కావాలంటే కనీసం రూ.50 కోట్లు కావాలన్నారు. సిపిఎం తూర్పు జిల్లా కమిటీ కార్యదర్శి పూనాటి ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొన్నారు. ముందుగా ఒంగోలు నియోజకవర్గ ప్రణాళికను నేతలు ఆవిష్కరించారు. నగర ప్రణాళిక గురించి సిపిఎం ఒంగోలు నియోజకవర్గ నేత జివి కొండారెడ్డి, రూరల్ ప్రణాళిక గురించి సిపిఐ జిల్లా నేత ఆర్ వెంకట్రావు వివరించారు. సభలో ఐక్యతను ప్రదర్శిస్తూ నేతలు అభివాదం చేశారు. సభకు ముందు నగరంలో వామపక్షాలు, జనసేన భారీ ప్రదర్శన, దానికి ముందు మోటారు సైకిళ్ళ ర్యాలీ నిర్వహించారు.

కౌలు రైతుల రుణాలు మంజూరు బోగస్

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

ప్రజాశక్తి - వీరవాసరం

కౌలు రైతులకు రుణాల మంజూరు ఒక బోగస్ అని ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలంలో బినామీ పేర్లతో రూ.18.50 లక్షల కౌలు రుణాలు దుర్వినియోగం నేపథ్యంలో ఆయన గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు అధికారులు, వ్యవసాయాధికారులు, టిడిపి నాయకులు కలిసి కౌలు రైతుల రుణాలు నిజమైన కౌలు రైతులకు దక్కకుండా బినామీలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. వీరవాసరంలో రుణాల దుర్వినియోగం చిన్న సంఘటనేనని, ఇదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల రుణాలు దుర్వినియోగ మవుతున్నాయని అన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్‌ను, వ్యవసాయశాఖ మంత్రిని, వ్యవసాయ శాఖ కమిషనర్‌ను కలవనున్నట్టు తెలిపారు. నిజమైన సాగు రైతులను గుర్తించకుండా సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి బినామీ రుణాలు ఇచ్చారన్నారు. ఒక సంవత్సరం నుంచి బోగస్ సాగు పత్రాలు ఎంపిఇఒ తయారుచేసి జెఎల్‌జి గ్రూపులు ఏర్పాటు చేసి, రుణాలు మంజూరు చేయిస్తూ ఉంటే మండల వ్యవసాయాధికారి ఏం చేస్తున్నారని ఆయన మండిపడ్డాడు. మండల వ్యవసాయాధికారి సహకారం వల్లే ఈ బోగస్ రుణాల మంజూరుకు అవకాశం ఏర్పడిందని, ఈ సంఘటన జిల్లా అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ సరైన పరిశీలన లేదని అన్నారు. జిల్లావ్యాప్తంగా మూడు లక్షల పది వేల మంది కౌలు రైతులకు రూ.1695 కోట్లు రుణాలు మంజూరు చేశామంటున్న రాష్ట్ర ప్రభుత్వం వీరవాసరం మండలం ఘటనపై పాత కలెక్టర్ సమాధానం చెప్పాలన్నారు. బినామీ రుణాల దుర్వినియోగంపై వాస్తవాలు వెల్లడించాలని కోరుతూ ఈ నెల 31న వీరవాసరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, చేతివృత్తుల సంఘం మండల కన్వీనర్ యండమూరి సుబ్బారావు, రైతుసంఘం మండల కార్యదర్శి బాలం విజయకుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కృష్ణాజిల్లా గుడివాడలో ది గుడివాడ మున్సిపల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాడుగుల రేణుశివకుమార్, వడ్డాది శ్రీను మాట్లాడుతూ.. గుడివాడ అభివృద్ధికి తాము పూర్తిగా సహకరించాలనే ఉద్దేశంతో 279 జీవోకు కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. అయితే ఆ జీవో వల్ల నేడు కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 30 రోజులు కష్టపడి పనిచేసిన తమకు జీతాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తి రోజుకు నాలుగుసార్లు మస్తరుకు రావాలని ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కానర్‌లో సమస్యలుంటే దానిని బాగుచేయకుండా తమ జీతాల్లో కోత విధిస్తున్నారని వాపోయారు. వెంటనే 279 జోవోను రద్దుచేసి జీవో 151ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 28 నుంచి పనులు చేయకుండా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన టిడిపి

- యువజన, విదార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు

ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని హామినిచ్చి అధికారంలోకి వచ్చిన టిడిపి నిరుద్యోగుల ఆశలపై నీళ్ళు చల్లిందని పలు యువజన, విద్యార్థి సంఘాల నేతలు అన్నారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ఐ, డిహెచ్‌సి, వైసిపి యువజన సంఘాలు ఆధ్వర్యాన గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు మాట్లాడుతూ ఉద్యోగాలు భర్తీ చేయడంలో తెలుగుదేశం ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. గత ఎన్నికలకు ముందు జాబు కావాలంటే, బాబు రావాలని అన్నారని, ఇప్పుడు దానికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. గ్రూప్-1 పరీక్ష సిలబస్ ఎక్కువ ఉండడంతో అభ్యర్థులు సిద్ధం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందన్నారు. చాలా సిలబస్ అందుబాటులో లేని కారణంగా వాయిదా వేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్ని పరీక్షలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని, ఎపిపిఎస్‌సి చైర్మన్ ఉదయ భాస్కర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ టిడిపికి అధికారంలో కొనసాగే అర్హత లేదని విమర్శించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనకు రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు కాలేదని, ప్రభుత్వం లెక్కల ప్రకారం రాష్ట్రంలో 2.40 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సి, ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టులు ఎందుకు బర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్ క్రమం తప్పకుండా విడుదల చేయాలని కోరారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 వేలకు పైగా బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయని వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ సిఎం తన హామీలను అమలు చేయకుండా రాష్ట్రాన్ని ఎలా అభివద్ధి చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 13 జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు సిఎంని కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా ప్రయత్నం చేయాలని, ఫిబ్రవరి రెండున ఎపిపిఎస్సి చైర్మన్ ఉదయ్‌భాస్కర్‌ను తొలగించాలని, విజయవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించాలని, ఎస్సి, ఎస్టీ, బిసి, ప్రజా సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేయాలని తీర్మానించారు.

ఈ సమావేశంలో హెల్పింగ్ హాండ్స్ రాష్ట్ర కార్యదర్శి శివరామకష్ణ. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చంద్ర నాయక్, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు సతీష్, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి చరణ్‌సాయి, ఎఐవైఎఫ్ నగర అధ్యక్షులు మొయినుద్దీన్ వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జివిఎంసి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తోపుడుబండ్ల కార్మికులు

స్వచ్ఛభారత్ పేరుతో తోపుడుబండ్ల కార్మికుల తొలగింపు

జివిఎంసి కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి -కలెక్టరేట్, విశాఖ

స్వచ్ఛభారత్ పేరుతో తోపుడుబండ్ల కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ జోన్-2 పరిధిలో స్మార్ట్ సిటీ, స్వచ్ఛభారత్ పేరుతో తోపుడుబండ్లు, చిల్లర వ్యాపారస్తులను తొలగిస్తున్నారన్నారు. చినవాల్తేరు, సీతమ్మధార ఈనాడు, ఇసుకతోట, ఎంవిపి, మద్దిలపాలెం ప్రాంతాల్లోని పదేళ్లగా తోపుడుబండ్లపై టిఫిన్, న్యూడిల్స్, పానీపూరి, ఫ్రూట్స్ వంటివి కార్మికులు అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. చినవాల్తేరు కోటక్ స్కూల్ ఆవరణలో వ్యాపారం చేసుకుంటున్న కార్మికులను ఈ నెల 14న జివిఎంసి ఉద్యోగులైన జయరాజ్, ప్రసన్నలు లంచం అడిగితే ఇవ్వలేదని వారి వస్తువులను రోడ్డుపాలు చేశారన్నారు. కార్మికుల ఉపాధిని పోగొట్టే వైఖరిని ప్రదర్శించిన జయరాజ్, ప్రసన్నలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీధి విక్రయదారులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడు వి.కృష్ణారావు, కార్యదర్శి ఎ.సింహాచలం, గౌరవాధ్యక్షులు అనపర్తి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



చిలమత్తూరులో సమస్యలు తెలుసుకుంటున్న పాదయాత్ర బృందం

తీవ్రంగా తాగు, సాగు నీటి సమస్యలు

సిపిఎం పాదయాత్ర బృందం దృష్టికి తెచ్చిన రైతులు

ప్రజాశక్తి- చిలమత్తూరు

తాగు, సాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని చిలమత్తూరు మండల రైతులు గురువారం సిపిఎం పాదయాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. హంద్రీనీవా నీటి సాధన కోసం అనంతపురం జిల్లా వ్యాప్తంగా సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్ర నాలుగో రోజుకు చేరుకుంది. చెరువు ముందరపల్లిలో మొదలై చాగలేరు మీదుగా కల్లుకుంట, పలగలపల్లి, భూమయ్యగారిపల్లి, పాలేపల్లి, కందూరిపర్తి మధురేపల్లి గ్రామాలకు పాదయాత్ర చేరుకుంది. ఈ కార్యక్రమంలో దక్షిణ ప్రాంత జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ హాజరై మాట్లాడారు. చిలమత్తూరు మండలంలోని అన్ని చెరువులను నింపాలని, లేపాక్షి నాలెడ్జ్‌హబ్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ, జనసేన నాయకుల ఎదుట గ్రామస్తులు అనేక సమస్యలను విన్నవించారు. 'పది సంవత్సరాల నుంచి చెరువులోకి నీరు రాలేదు. చెరువులో నీరు తగ్గి బోర్లు ఎండిపోయాయి. గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్యల నెలకొంది. 15 ఏళ్లుగా చిత్రావతి నదిలోకి నీరు రావడం లేదు. హంద్రీనీవా నీరు చెరువులకు ఇస్తే మా బతుకులు బాగుపడుతాయి. ఆయకట్టు కింద పంటలు పండించుకోవచ్చు'. అంటూ కందూరిపర్తి, కల్లుకుంట, మదిరేపల్లి గ్రామాలకు చెందిన రైతులు నరసింహారెడ్డి, వెంకటేష్, రామకృష్ణ పలు సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి తెచ్చారు.



మాట్లాడుతున్న భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ

వంటావార్పు విజయవంతం

దిగొచ్చిన జిల్లా రెవెన్యూ అధికారి
స్పష్టమైన హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

భూమి కోసం, భుక్తి కోసం అంటూ పేదలు సాగించిన వంటావార్పు కార్యక్రమ నిరసన విజయవంతంగా గురువారం ముగిసింది. 48 గంటల పాటు తలపెట్టిన ఈ కార్యక్రమానికి రెండో రోజు పలు రాజకీయ పార్టీలు మద్దతునిచ్చాయి. రెండ్రోజులుగా పేదలు ఎర్రని ఎండను, గజగజ వణికించే చలిని ఏమాత్రం లెక్కచేయకుండా పోరాట పట్టు సడలనివ్వకుండా కలెక్టరు కార్యాలయం ముందు వంట, వార్పు, వాల్పు అన్నింటినీ ఇక్కడే నిర్వహించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. భూ పోరాట సాధన కమిటీ అధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు జిల్లా నలుమూల నుంచి భారీ ఎత్తున తరలి వచ్చిన జనం మొక్కవోని అకుంటిత దీక్షతో పోరాటంలో పాల్గొన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలని, ఇచ్చిన పట్టాలకు భూమిని చూపాలని, పేదలకు దక్కాల్సిన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెర నుంచి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌కు బారులు తీరారు. తట్టాబుట్టా, చెంబు చాటాను నెత్తినెట్టుకుని, పిల్లాపాపలను చంకనెత్తుకుని కలెక్టరు కార్యాలయం ముందు మకాం వేసిన సంగతి తెలిసిందే. రెండో రోజు కొనసాగిన వంటావార్పు కార్యక్రమంలో వివిధ అఖిలపక్ష పార్టీలు మద్దతు తెలియజేశాయి. సిపిఎం, సిపిఐ, జనసేన, కాంగ్రెస్, వైసిపితోపాటు అంగన్‌వాడీ, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాలు సంపూర్ణ మద్దతును తెలియజేశాయి. అనంతరం డిఆర్‌ఒను కలిసి నాయకులు వినతిపత్రం సమర్పించి పలు భూ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పేదలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని నాయకులు కోరగా డిఆర్‌ఒ ఆందోళనకారుల టెంటువద్దకు వచ్చి హామీనిచ్చారు. త్వరలోనే సంబంధిత మండల తహశీల్దారులతో చర్చించి అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు, సాగు చేసుకున్న భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని హామీ నివ్వడంతో ఆందోళనను ప్రజలు విరమించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, జనసేన పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ గురప్ప, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలి శ్రీనివాసులు, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నిత్యానందరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్ఎం.డి షఫి ప్రసంగించారు.

డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ సిటీ



ధర్నా చేస్తున్న డ్రైవర్లు, నాయకులు

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నగర పాలకసంస్థ పారిశుధ్య విభాగంలో తొలగించిన డ్రైవర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు మాట్లాడుతూ ఎటువంటి కారణం లేకుండా అన్యాయంగా ముగ్గురు డ్రైవర్లను తొలగించారని విమర్శించారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని కార్మికశాఖ అధికారి స్పష్టంగా చెబుతున్నా అధికారులు నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్మికుల తొలగింపునకు నగర ఎంఎల్ఎను కారణంగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. డ్రైవర్లు జులై 18న వికాస ద్వారా ఉత్తర్వులు పొంది, జులై 30 నుంచి విధుల్లో చేరారని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు వారికి మస్తరు వేయడమే కాకుండా, వారి బ్యాంకు ఖాతాలకే జీతాలు జమయ్యాయని అన్నారు. అక్టోబర్ 19న అకస్మాత్తుగా ముగ్గురు డ్రైవర్లను తొలగించి, వారి కుటుంబాలను రోడ్డుపాల్జేశారని విమర్శించారు. అధికారులు పునరాలోచించి విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని, కమిషనరు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. బాధిత డ్రైవర్ అనూప్ మాట్లాడుతూ అకస్మాత్తుగా తొలగించడంతో భార్యాపిల్లలను పోషించేందుకు నానా యాతనా పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మానవత్వాన్ని అయినా తమపై చూపాలని అధికారులను కోరుతున్నామని అన్నారు. ఆందోళనలో మున్సిపల్ యూనియన్ నాయకులు అశోక్‌కుమార్, సిఐటియు నగర కమిటీ సభ్యుడు సిహెచ్.విజయ్‌కుమార్‌తో పాటు లోకేష్, బాకి లక్ష్మినారాయణ, బాబ్జి, కార్మికులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- నర్సీపట్నం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా రావికమతం మండలంలో గిరిజనుల అధీనంలో ఉన్న డి-ఫారం పట్టా భూములను ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడమే కాకుండా పట్టాదారులపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ.. కొవగుంటలో గిరిజనుల అధీనంలో ఉన్న డి-పట్టా భూముల్లోని మొక్కలకు నీరు పోస్తుండగా, గిరిజన మహిళ రొబ్బ వరహాలమ్మపై దాడి చేసిన బిహెచ్‌పివి మాజీ ఉద్యోగి శివరామ్, అతని కుమారుడు శేఖరరావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చీమలపాడు పంచాయతీ, జెడ్.జోగుంపేటలో గిరిజనుల భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్న విశాఖకు చెందిన లాయర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రానైట్ భూ మాఫియాకు కొందరి అండదండలుండడంతో చర్యలు చేపట్టేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆర్‌డిఒ, ఎఎస్‌పిలకు వినతిపత్రం అందజేశారు.

బాలలే రోల్ మోడల్

న్యూఢిల్లీ : రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు ఎన్నికైన బాలలందరూ సమాజానికి రోల్ మోడలని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. బాలపురస్కార్‌కు ఎంపికైన బాలలకు గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మోడీ అవార్డులు అందజేసి, అభినందించారు. బాలలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కేంద్రమంత్రి మేనకాగాంధీ నేతృత్వంలోని జాతీయ ఎంపిక కమీటీ అభ్యర్థుల నివేదికను తయారు చేసింది. ఈ కార్యక్రమంలో నూతన ఆవిష్కరణలకు ఆరు, మూడు స్కాలరిస్ట్ అవార్డులు, ముగ్గురికి సామాజిక సేవకు గాను అవార్డులను బహూకరించారు. ఆర్ట్ అండ్ కల్చర్‌లో ఐదుగురికి, క్రీడలలో ఆరుగురికి, ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు ముగ్గురికి ఈ పురస్కారం కింద సత్కరించారు. బాలశక్తి పురస్కార్ కింద మొత్తం 783 దరఖాస్తులందాయి. కాగా, ఈ ఏడాది ఇద్దరితో పాటు మూడు ఇన్‌స్టిట్యూషన్లను నేషనల్ చైల్డ్ వెల్ఫేర్ అవార్డ్స్ (బాల కళ్యాణ్ పురస్కార్) కేటగిరీ కింద సత్కరించారు.



నిరసన | నేషనల్ సిటిజెన్‌షిప్ రిజిస్టర్‌కు వ్యతిరేకంగా ఐజ్వాల్‌లో బుధవారం నిరసన ప్రదర్శన చేస్తున్న మిజోలు

అమర జవానుకు 'ఆశోక చక్ర'

శ్రీనగర్ : ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో మృతి చెందిన సైనికుడు లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీని అశోక చక్ర అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 26న రిపబ్లిక్ డే వేడుకల్లో వనీ భార్య మహజబీన్‌కి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ అవార్డును అందచేయనున్నారు.

గత ఏడాది నవంబరు 25న కాశ్మీర్‌లోని హిరాపూర్ గ్రామంలో ఆరుగురు ఉగ్రవాదులను హతమార్చిన ఆపరేషన్‌లో వనీ సభ్యుడుగా ఉన్నాడు. ఉగ్రవాదులను నిరోధించే క్రమంలో వనీ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన తరువాత కూడా అతను ధైర్యంగా ఉగ్రవాదులను ఎదుర్కొన్నాడు. గాయపడ్డ వనీని ఒక మిలటరీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తరువాత రోజు జరిగిన అతని అంత్యక్రియలకు సైనిక అధికారులతో పాటు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

38 ఏళ్ల వనీ కుల్గాం జిల్లాలోని చెకి అస్మజి గ్రామానికి చెందినవాడు. 2004లో సైన్యానికి చెందిన 162వ పదాతిదళంలో చేరాడు. తను చేసిన సేవలకు గాను 2007, 2018లో సేనా పతకాలు పొందాడు. వనీకి భార్యతో పాటు ఇద్దరు కుమారులు అత్తర్ (20), షాహిద్ (18) ఉన్నారు.



విద్యార్థి ఉద్యమంలో ఎస్‌ఎఫ్‌ఐ కీలక పాత్ర

'వెబ్‌పోర్టల్' ప్రారంభంలో సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యార్థి ఉద్యమాల్లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌ఎఫ్‌ఐ) కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంఘం మాజీ అధ్యక్షుడు సీతారాం ఏచూరి పేర్కొన్నారు. దేశంలో తిరోగమన శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగంపై దాడులు మరింత అధికమయ్యాయని తెలిపారు. గురువారం నాడిక్కడ ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ కార్యాలయంలో 'స్టూడెంట్ స్ట్రగుల్' వెబ్ పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏచూరి వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థి ఉద్యమాల ద్వారానే రాజకీయాల్లోకి వచ్చానని గుర్తు చేశారు. విద్యార్థి దశలో నిర్మించే పోరాటాలు దేశ భవిష్యత్‌ను నిర్ధారిస్తాయని తెలిపారు. విద్య కాషాయీకరణపై పోరాడాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలకు పిలుపు నిచ్చారు. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలని సూచించారు. స్టూడెంట్ యూనియన్లు నిర్వహించే ఏ పోరాటానికైనా తాము మద్దతిస్తామని చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ ఈ వెబ్ పోర్టల్ ద్వారా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యా రంగానికి కేటాయిస్తున్న నిధులు, యూనివర్శిటీల్లో జరుగుతున్న అవకతవకలపై గళమెత్తుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను ప్రజల్లోకి తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ ప్రధాన కార్యదర్శి విక్రమ్ సింగ్, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షులు విపి సాను, స్టూడెంట్ స్ట్రగుల్ బాధ్యులు నితీష్ నారాయన్ తదితరులు పాల్గొన్నారు.

జులై 31లోగా ఎన్‌ఆర్‌సి తుది జాబితా

కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం

- సవరణతో వలసవాసులకు పౌరసత్వం కష్టమే : హోంమంత్రితత్వ శాఖ
- ఈ నెల 29న మణిపూర్ రాష్ట్ర పార్టీల భేటీ



న్యూఢిల్లీ: ఈ ఏడాది జులై 31 నాటికి అస్సాంలోని జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్‌ఆర్‌సి) సిద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం సుప్రీంకోర్టు ఆదేశించింది. గత ఏడాది విడుదల చేసిన జాబితాలో స్థానం దక్కని 40 లక్షల మంది ప్రజల నుండి దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరించేందుకు గత నెల 31న తుదిగడువుగా నిర్ణయించిన సుప్రీంకోర్టు ఇప్పుడు తుది జాబితాకు గడువును నిర్దేశించింది. జులై 31 గడువుకు ఎటువంటి పొడిగింపు వుండబోదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గత ఏడాది జులై 30న ప్రచురితమైన తుది ముసాయిదా జాబితాలో పేరు నమోదు కోసం మొత్తం 3.29 కోట్ల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2.89 కోట్ల మందికి మాత్రమే స్థానం దక్కిన విషయం తెలిసిందే. స్థానం దక్కని 40 లక్షల మందిలో 36 లక్షల మంది ఇప్పటికే తమ ఫిర్యాదులు అందచేశారని జాతీయ పౌరసత్వ జాబితా సమన్వయకర్త ప్రతీక్ హజేలా చెబుతున్నారు. వీరికి ఫిబ్రవరి 15 నుండి నోటీసులు జారీ చేసి వారి ఫిర్యాదులపై విచారిస్తామని సుప్రీంకోర్టుకు వివరించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పౌరసత్వ జాబితాకు ఎటువంటి ఆటంకం లేకుండా సిబ్బంది సర్దుబాటు చర్యలు తీసుకోవాలని అసోం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, ఎన్నికల కమిషన్ కార్యదర్శిని, పౌరసత్వ జాబితా సమన్వయ కర్తను సుప్రీంకోర్టు ఆదేశించింది. పౌరసత్వ జాబితా కమిటీని వారం రోజుల్లోగా సమావేశ పరచి వివరాలను తదుపరి విచారణ తేదీ ఫిబ్రవరి 5లోగా తెలియచేయాలని కోర్టు సూచించింది.

కాగా, అస్సాంలోని ఎన్‌ఆర్‌సి నుండి మినహాయించబడిన ముస్లిమేతరులు పౌరసత్వ (సవరణ)బిల్లు వలన వెంటనే కాని లేదా ప్రత్యక్షంగా గాని లబ్ది పొందలేరని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. అస్సాంలో కేంద్ర ప్రభుత్వానికి ఈ బిల్లు ద్వారా ఎదురు దెబ్బతగిలిందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. 1971 మార్చి అనంతరం బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చి స్థిరపడిన వలసవాసులు భారతీయ పౌరసత్వాన్ని ప్రభుత్వం తమకు మంజూరు చేస్తుందో లేదోనని వారు భయపడుతున్నారని, ఎన్‌ఆర్‌సి తుది జాబితాలో లేని వారు పౌరసత్వాన్ని తక్షణమే పొందలేరని అధికారి తెలిపారు మూడుదేశాల నుండి భారత్‌కు వచ్చినవారు మత హింస కారణంగానే దేశానికి వచ్చినట్లు నిరూపించాల్సి ఉంటుందని అన్నారు. 2014 డిసెంబర్ 31లోపు వలసవచ్చిన హిందువులు, క్రిస్టియన్‌లు, పార్సీలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు మొదలైన ఆరు మతాలకు చెందిన వారికే పౌరసత్వం కల్పించాల్సిందిగా చట్టం పేర్కొంది.

పౌరసత్వ బిల్లుపై 29న మణిపూర్ పార్టీల భేటీ
సిఎం బిరేన్‌సింగ్ వెల్లడి

ఇంఫాల్: పౌరసత్వ చట్ట సవరణ బిల్లుపై చర్చించేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఈ నెల 29న సమావేశం ఏర్పాటు చేసినట్లు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బిరేన్‌సింగ్ చెప్పారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఇప్పటికీ నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేయటం విశేషం. మణిపూర్‌లో నేషనల్ పీపుల్స్ పార్టీ, నాగా పీపుల్స్ ఫ్రంట్, లోక్‌జనశక్తి పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వానికి బిజెపి నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. మణిపూర్ పీపుల్స్ పార్టీతో పాటు రాష్ట్రంలోని అనేక విద్యార్థి సంఘాలు, పౌరసమాజ సంఘాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

తీవ్ర దుస్థితిలో బెంగాల్ జాలర్లు

- ప్రభుత్వ విధానాలే కారణం
- ఎఐఎఫ్‌ఎఫ్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.హేమలత

ప్రజాశక్తి ప్రతినిధి-కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఉన్న సుమారు 24 లక్షల మంది జాలర్లు తీవ్ర దుస్థితిలో ఉన్నారని అఖిల భారత జాలర్లు, మత్స్య కార్మికుల సంఘం (ఎఐఎఫ్‌ఎఫ్‌డబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి కె.హేమలత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హింగల్‌గంజ్-సుందర్‌బన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆమె ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిఎంసి అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వీటికి జాలర్లు కూడా మినహాయింపు కాదని ఆమె అన్నారు. ప్రభుత్వ విధానాల అండతో గూండాలు జలాశాయాలను అధీనంలోకి తీసుకుంటు న్నారని దీంతో జాలర్లకు ఉపాధి లేకుండా పోతుందని ఆమె తెలిపారు. అలాగే రాష్ట్రంలో మత్స్యకారుల కాలనీలను కూడా టిఎంసి గూండాలు అక్రమించుకుంటు న్నారని హేమలత ఆవేదన వ్యక్తం చేశారు. 'చేప నికర యజమానులకే జలాశాయాలు' అని ఆమె నినాదం ఇచ్చారు. గతంలో మత్స్య ఉత్పత్తిలో బెంగాల్ ప్రథమ స్థానంలో ఉండేదని, ప్రభుత్వ విధానాలతో ఉత్పత్తి దిగజారిందని ఆమె తెలిపారు. జలాశాయాల కోసం పోరాటం చేస్తున్న జాలర్లపై నకిలీ కేసులతో పోలీసులు, అధికారలు వేధింపులకు దిగుతున్నారని ఆమె ఆరోపించారు.

తేలని సిబిఐ నూతన డైరెక్టర్ నియామకం

- నేడు మళ్లీ కమిటీ భేటీ
- ఆరెస్సెస్‌తో సంబంధాలున్న వ్యక్తులకే అవకాశం..!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ) నూతన డైరెక్టర్ ఎవరనేది తేల్చకుండానే ముగ్గురు సభ్యులు అత్యున్నత స్థాయి కమిటీ సమావేశం ముగిసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కమిటీ నేడు మళ్లీ భేటీ కానున్నది. ఈ కమిటీలో మోడీతో పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖార్గే ఉన్నారు. 1982 నుంచి 1985 వరకు గల బ్యాచ్‌ల ఐపిఎస్ అధికారుల పేర్లను ఈ పదవికి పరిశీలనలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు పలువురు ఉన్నతాధికారుల పేర్లు తెరపైకి వచ్చాయి. ఆరెస్సెస్, బిజెపితో సంబంధాలు ఉన్న వ్యక్తులను ఈ పదవిలో కూర్చోబెట్టాలని ప్రభుత్వం యోచించినట్లు సమాచారం. సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని 12 మంది అధికారుల పేర్లతో లిస్టు తయారు చేశారు. 1983 బ్యాచ్‌కు చెందిన శివానంద్ ఝా (గుజరాత్ డిజిపి), రాజేశ్ రంజన్ (సిఐఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్), రజనీ కాంత్ మిశ్రా(బిఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్), యోగేశ్ చందర్ మోడీ (ఎన్‌ఐఎ డైరెక్టర్ జనరల్), సుభోద్ జైస్వాల్(ముంబాయి పోలీస్ కమిషనర్) వీరితో పాటు పరమీందర్ రాయ్, రీనా మిత్ర, ఒ.పి.గల్హోత్రా, హెచ్.సి.అవస్థి, ఎస్.ఎస్.దేశ్వాల్, అరుణ్ మిశ్రా, లోక్‌నాథ్ బెహరా పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నాగేశ్వరరావు నియామకంపై విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ సిక్రీ

సిబిఐ తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ నుంచి మరో న్యాయమూర్తి తప్పుకున్నారు. ఈ పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. అయితే విచారణ ప్రారంభం కాగానే ఈ ధర్మాసనం నుంచి తాను తప్పుకుంటున్నట్లు జస్టిస్ ఎకె సిక్రీ తెలిపారు. సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి ఆలోక్ వర్మను తొలగించిన కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నందు వల్లే ఈ విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ సిక్రీ తెలిపారు. "ఈ వ్యవహారంలో నా స్థానమేంటో మీకు తెలుసు. నేను ఈ విచారణ చేపట్టలేను. ఈ ధర్మాసనం నుంచి స్వయంగా తప్పుకుంటున్నాను. కేసు విచారణను శుక్రవారం మరో ధర్మాసనం చేపడుతుంది" అని పిటిషన్ దాఖలు చేసిన ఎన్జీవో కామన్ కాజ్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవేతో జస్టిస్ సిక్రీ అన్నారు. ఇప్పటికే ఈ కేసు విచారణ ధర్మాసనం నుంచి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ కూడా తప్పుకున్న విషయం తెలిసిందే. సిబిఐ నూతన డైరెక్టర్‌ను ఎంపిక చేసే ఉన్నత స్థాయి సెలక్షన్ కమిటీలో సిజెఐ గొగోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు నియామకంపై కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు గత సోమవారం జస్టిస్ గొగోయ్ ప్రకటించారు.

కేరళ సిఎం విజయన్‌పై కాంగ్రెస్ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కించపరిచేలా కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. సుధాకరన్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా నిరసన వ్యక్తమౌతోంది. ముఖ్యమంత్రి పని తీరు ఒక మహిళ కన్నా దారుణంగా ఉందని కాసర్‌గోడ్‌లో గురువారం ఒక సభలో ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి విజయన్ సమర్థవంతంగా పని చేస్తారని భావించామని అయితే తన విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రియాంక ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న తరుణంలో ఒక కాంగ్రెస్ నేత మహిళలను కించపరచడం ఆ పార్టీకి నష్టం కలిగిస్తుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రధాన నేతలలో ఒకరైన సుధాకరన్ గతంలో శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సు మహిళలకు ప్రవేశం కల్పిస్తూ ఇచ్చి సుప్రీంకోర్టు తీర్పుపై కూడా నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

మెరుగైన రేపటి భవితవ్యం కోసం బాలికలకు సాధికారత

దేశవ్యాప్తంగా జాతీయ బాలికా దినోత్సవం

న్యూఢిల్లీ : జాతీయ బాలికా దినోత్సవాన్ని గురువారం దేశమంతా జరుపుకున్నారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆడపిల్ల అంటేనే ఒక సమస్యగా భావించడం, కించపరిచేలా చూడడం నేడున్న అతిపెద్ద రుగ్మత, విద్య, పోషకాహారం, చట్టబద్ధమైన హక్కులు, వైద్య సంరక్షణ, భద్రత, బాల్య వివాహాలు ఇలా అనేక రంగాల్లో ఈ చిన్న చూపు కనిపిస్తూ వుంటుంది. 'మరింత మెరుగైన రేపటి భవితవ్యం కోసం ఈనాడే బాలికలకు సాధికారత కల్పించాలి' అనే థీమ్‌తో గురువారం పలు కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బేటీ బచావో, బేటీ పడావో పథకం అమల్లో మంచి పనితీరు కనపరిచినవారికి హర్యానా, రాజస్థాన్‌లు అవార్డు బహుకరించనున్నాయి. ఆంధ్రప్రదేశ్ వారం రోజుల పాటు ఉత్సవాల్లా జరుపుతోంది. ఈ సందర్భంగా ప్రజల్లో చైతన్యం పెంచే చర్యలు, ఆత్మ రక్షణ కార్యక్రమాలు, బాలలకు డ్రాయింగ్, పెయింటింగ్ వంటి పోటీలు నిర్వహిస్తోంది.

హర్యానాలో గోగూండాల దాడి



రోహ్‌తక్ : పశువులను ఆక్రమంగా రవాణా చేస్తున్నారన్న నెపంతో హర్యానాలో గోగూండాలు ఒక వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. అయితే ఈ ఘటనలో గాయపడ్డ తనకు పోలీసులు సహకరించకపోగా తనపైనే అక్రమ రవాణా కేసు నమోదు చేశారని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాధితుడు నౌషద్ మహ్మద్ ఆరోపించారు. తాను గత శనివారం రోహ్‌తక్ ప్రాంతానికి వెళ్లగా తనపై దాదాపు 20 మంది దాడి చేసి ఒక స్తంభానికి కట్టేసి కొట్టడంతో పాటు రూ.2 వేలను దోచుకున్నారని తెలిపారు. వారి బారి నుంచి తనను కాపాడిన పోలీసులు ఆ రోజు రాత్రంగా సంకెళ్ళతో స్టేషన్‌లోనే ఉంచారని చెప్పాడు. స్టేషన్ ఎదుట స్థానిక హక్కుల కార్యకర్తల ఆందోళనతో మరుసటి రోజు విడుదల చేసినట్లు నౌషద్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నౌషద్, మరో ఇద్దరిపై పశువుల అక్రమరవాణా, జీవహింస కేసు, దాడికి పాల్పడిన వారిలో 12 మందిపై కూడా పోలీసులు నమోదు చేశారు. ఇటువంటి దాడులు జరగడం ఈ సంవత్సరంలో ఇది రెండోసారి. బీహార్‌లోని అరారియా జిల్లాలో 55 ఏళ్ల వ్యక్తిపై ఈ నెల 3న అల్లరిమూకలు దాడి చేసి చంపేసిన విషయం తెలిసిందే.

ఇవిఎంలతోనే వచ్చే లోక్‌సభ ఎన్నికలు

స్పష్టం చేసిన ఎన్నికల కమిషన్

న్యూఢిల్లీ : వచ్చే లోక్‌సభ ఎన్నికలను ఇవిఎల ద్వారా నిర్వహిస్తామని, బ్యాలెట్ పత్రాలను వినియోగించే ప్రసక్తే లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా గురువారం స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలను పాత పద్ధతిలోనే బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించాలని కొన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో వచ్చిన ఫలితాలకు, నాలుగునెలల అనంతరం జరిగిన ఢిల్లీ ప్రభుత్వ ఎన్నికలలో వచ్చిన ఫలితాలు పూర్తి భిన్నంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, చత్తీస్‌ఘడ్‌లో విడతలవారీగా జరిగిన ఎన్నికలలో ప్రతిసారీ ఫలితాలు భిన్నంగా వచ్చాయని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో ఇవిఎంలను, వివిపిఎటిలనే కొనసాగిస్తామని, రాజకీయ పార్టీల నుండి, అభ్యర్థుల నుండి వచ్చే సూచనలను, అభిప్రాయాలను స్వాగతిస్తామని అన్నారు. అలాగే రెండు పిఎస్‌యులతో కట్టుదిట్టమైన భద్రతల మధ్య ఇవిఎంలను తయారు చేశామని అరోరా వెల్లడించారు. ఇటీవల లండన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇవిఎంలను హాకింగ్ చేయవచ్చని సైబర్ నిపుణుడు సయ్యద్ షుజా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈవిఎంలను టాంపరింగ్ చేయడం సాధ్యం కాదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

ఢిల్లీపై వివక్ష దేశద్రోహం కాదా..?

మోడీని ప్రశ్నించిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : దేశరాజధాని కోసం ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రధాని నరేంద్ర మోడీ అడ్డుకుంటున్నారని, ఢిల్లీపై వివక్ష చూపించడం 'దేశద్రోహం' కాదా.. అని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం ప్రశ్నించారు. 'కన్నయ కుమార్ చేసిన దేశద్రోహం ఏమిటో తెలియదు. అతని కేసును చట్టం విచారిస్తోంది. అయితే మరోవైపు మోడీ ఢిల్లీలోని చిన్నారులను, ఆసుపత్రులను, మొహల్లా క్లినిక్‌లనును, సిసిటీవీ కెమెరాలను నిరోధిస్తున్నారు. ఢిల్లీపై వివక్ష చూపిస్తున్నారు. ఇది దేశద్రోహం కాదా..' అని ట్వీట్టర్‌లో కేజ్రీవాల్ ప్రశ్నించారు.తమ ప్రణాళికలను, పథకాలను కేంద్రం వివిధ ఏజెన్సీల ద్వారా అడ్డుకుంటోందని గతం నుండి ఢిల్లీ ప్రభుత్వం ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

ఒడిశా బంద్‌లో ఉద్రిక్తత

- చెలరేగిన కాషాయ గూండాలు
- ఇరువర్గాల ఘర్షణ : పోలీసుల లాఠీఛార్జ్

భువనేశ్వర్ : ఒడిశాలో కేంద్రపరా జిల్లా కాషాయ మూకల మతోన్మాద చర్యలకు తల్లడిల్లుతోంది. మైనార్టీ కమ్యూనిటీకి చెందిన వారు నిర్వహించ తలపెట్టిన నేతాజీ జయంతికి మతోన్మాద శక్తులు అడ్డుతగలడంతో చెలరేగిన ఉద్రిక్తతలు ఘర్షణల రూపం తీసుకున్నాయి. తమ చర్యలను మైనారిటీలు ప్రశ్నించడాన్ని సహించలేని కాషాయమూకలు జిల్లాలో గురువారం 12 గంటల బంద్‌కు పిలుపునివ్వడంతోపాటు పలు చోట్ల విధ్వంసకాండకు దిగాయి. పరిస్థితులను అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్న భద్రతా సిబ్బందిపై దుండగులు రాళ్ల రువ్వడంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. 144 సెక్షన్ కింద నిషేదాజ్ఞలు జారీచేశారు. ఇంటర్నెట్ సేవలను నిలిపివేశామని. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని ఎస్‌పి రంజన్‌కుమార్ రే తెలిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను కేంద్రపరా నగరంలోని ఉన్నత పాఠశాలలో ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటు చేసింది. అయితే వారం రోజుల క్రితం మైనారిటీ కమ్యూనిటికి చెందిన వారు ఇదే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతి కోరినా ప్రభుత్వం నిరాకరించింది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో పాటు ఘర్షణకు దారితీసింది.

2019 ఎన్నికల్లో ఎన్‌డిఎకు మెజార్టీ అసాధ్యం

- ఎబిపి- సీవోటర్ సర్వే
- యుపిఎకి పెరగనున్న సీట్లు



న్యూఢిల్లీ : ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమికి మెజార్టీ దక్కడం అసాధ్యమని ఎబిపి-సీవోటర్ సర్వే తేల్చి చెప్పింది. ఈ సర్వే ప్రకారం ఈ కూటమికి గతసారి వచ్చిన సీట్లలో చాలా వరకూ గండిపడనున్నట్లు వెల్లడయింది. యుపిఎకి 166, ఇతరులకి 140 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 272 స్థానాలను ఎన్‌డిఎ గెలుచుకోలేదని సర్వే తెలిపింది. అంటే 2014 ఎన్నికల కన్నా 99 సీట్లను ఎన్‌డిఎ కోల్పోనుంది. అయితే యుపిఎ కన్నా ఎన్‌డిఎకు వచ్చే ఓట్ల శాతం కాస్త అధికంగా ఉంటుంది. అయితే యుపిఎకి 2014 ఎన్నికలు కంటే 106 సీట్లు అధికంగా వస్తాయి. అలాగే ఈ రెండు కూటముల్లో లేని వారు గత ఎన్నికల్లో కంటే 13 సీట్లను కోల్పోతారు.

ఈ సర్వే ప్రకారం ఎన్‌డిఎ 35 శాతం, యూపిఎ 33 శాతం ఓట్లను కైవసం చేసుకుంటాయి. వచ్చే ఎన్నికల్లో హంగ్ పార్లమెంట్ ఏర్పడితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మెజార్టీ కోసం ఎన్‌డిఎ ఇతర పార్టీల మద్దతు కోసం ప్రయత్నాలు జరపాల్సి ఉంటుంది. దీంతో ఈ పరిస్థితుల్లో ఇతర పార్టీలు కూడా ప్రధాన మంత్రి పదవి కోసం డిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగి, మేలో ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 44 సీట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి 109 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉంది. బిజెపికి వచ్చే ఎన్నికల్లో 203 స్థానాలు వచ్చే అవకాశం ఉంది. థర్డ్ ఫ్రంట్‌కు 130 స్థానాలు వచ్చే అవకాశం ఉందని, దీంతో వీరు కింగ్ మేకర్లుగా మారతారని సర్వే తెలిపింది.

అలాగే యుపిఎ కూటమికి పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ, టిఎంసి, సమాజ్ వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ మద్దతు తెలపాల్సి ఉంటుంది. రానున్న ఎన్నికల్లో 543 సీట్లకు ఎన్నికలు జరగనుండగా ప్రభుత్వ ఏర్పాటుకు 272 సీట్లు అవసరం అవుతాయి. ఈ నాలుగు పార్టీలు యుపిఎకి మద్దతు తెలిపితే ఆ కూటమి ఓట్ల శాతం 44 శాతంగా నమోదవుతుంది. అలాగే, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 272 సీట్లను పొందగలుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఎన్‌డిఎకు 234 సీట్లు, ఇతరులకి (ఎన్‌డిఎ,యుపిఎ కూటమిలో లేని పార్టీల వద్ద) 37 సీట్లు ఉంటాయి. ఒక వేళ థర్డ్ ఫ్రంట్ పార్టీలు చివరి నిమిషంలో ఎన్‌డిఎకు మద్దతు తెలిపినప్పటికీ ఆ కూటమికి 271 సీట్లు మాత్రమే దక్కుతాయి. ప్రభుత్వ ఏర్పాటుకు మరో సీటు కావాల్సి ఉంటుంది. ఒకవేళ టిఆర్‌ఎస్, బీజూ జనతా దళ్, అన్నాడీఎంకే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల తరువాత ఎన్‌డిఎకు మద్దతు తెలిపినప్పటికీ యుపిఎనే ముందంజలో ఉంటుంది. ఈ నాలుగు పార్టీలు ఎన్‌డిఎకి మద్దతు తెలిపితే ఈ కూటమి సీట్ల సంఖ్య 257కి పెరుగుతుంది.

రూ.13 రుణమాఫీ


మధ్యప్రదేశ్‌లో రైతులకు సర్కార్ షాక్

భోపాల్ : మధ్యప్రదేశ్ ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీ పథకం 'జై కిసాన్' అమలు తీరుతో రైతులు షాక్‌కు గురవుతున్నారు. తమ పేరు మీద వచ్చిన మాఫీ మొత్తాన్ని చూసి వారు విస్తు పోతున్నారు. రుణమాఫీ లబ్ధి పొందేందుకు దరఖాస్తులు సమర్పించే సమయంలో అగర్ మాల్వా గ్రామానికి చెందిన రైతులు శివనారాయణ్, శివపాల్, ఇతర ప్రాంతాల రైతులకు ఈ పరిస్థితి ఎదురైంది. తమకు వచ్చిన రూ.13 మాఫీని చూసి వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీరిద్దరూ బ్యాంకుల్లో రూ.20 వేలకు పైగా రుణం తీసుకున్నారు. అయితే ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకూ రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. అదే విధంగా ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కూడా ఇటువంటి ఘటనలు ఉన్నాయి. సాంకేతిక తప్పిదాల వలన ఇటువంటి పొరపాట్లు జరిగాయని వ్యవసాయ శాఖ మంత్రి సచిన్ యాదవ్ తెలిపారు. ఈ పథకం కింద దాదాపు 55 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

మరోసారి కాల్పులకు తెగబడ్డ పాక్

జమ్మూ : పాకిస్తాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. గురువారం ఉదయం నుంచి రాజౌరి జిల్లాలో వాస్తవాధీన రేఖ వెంబడి సైనిక కేంద్రాలు, పౌర నివాసాలపై మోర్టార్లు, చిన్న స్థాయి ఆయుధాలతో కాల్పులకు పాల్పడిందని భారత సైన్యం తెలిపింది. పాకిస్తాన్ కాల్పులను సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు వెల్లడించింది. అలాగే బుధవారం రాత్రి పూంచ్ జిల్లాలోని మెంధర్ సెక్టార్‌లోని సైనిక కేంద్రాలపై పాక్ సైన్యం కాల్పులు జరిపినట్లు భారత సైన్యం తెలిపింది. పాక్ కాల్పులతో సరిహద్దు ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని పేర్కొంది.

షరీఫ్‌ను తక్షణమే ఆస్పత్రికి తరలించాలన్న డాక్టర్లు



ఇస్లామాబాద్ : తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను వెంటనే జైలు నుండి ఆస్పత్రికి తరలించాలని డాక్టర్లు సూచించారు. హృదయ సంబంధిత సమస్యలతో ఆయన బాధడుతున్ననందున ఆయనకు ఆస్పత్రిలో మంచి చికిత్స అందగలదని తెలిపారు. లాహోర్ లోని జిన్నా ఆస్పత్రికి చెందిన నలుగురు డాక్టర్ల బృందం ఇటీవలే ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఈ నిర్ధారణకు వచ్చింది. అవినీతి కేసులో ఏడేళ్ళ శిక్ష అనుభవిస్తున్న షరీఫ్‌కు అనారోగ్యం తలెత్తడంతో మంగళవారం ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళారు.

। యుద్ధం వద్దు శాంతి ముద్దు

ప్రపంచ శాంతిని పరిరక్షించేందుకు కొత్త యుద్ధాలకు స్వస్తి పలకాలని నాటో కూటమిని రద్దు చేయాలని కోరుతూ వాష్టింగ్టన్‌లో ఇటీవల ప్రదర్శన నిర్వహించిన అమెరికన్లు.



ట్రంప్‌తో మలిభేటీకి సన్నాహాలు

అధికారులకు కిమ్ ఆదేశం

సియోల్ (ద.కొరియా): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో త్వరలో జరుగనున్న మలి భేటీకి సన్నాహాలు పూర్తి చేయాలని ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ ఆదేశించినట్లు ఉ.కొరియా అధికార మీడియా గురువారం వెల్లడించింది. ఉమ్మడి లక్ష్య సాధనకు ట్రంప్‌తో కలిసి కృషి చేసేందుకు కిమ్ పూర్తి విశ్వాసంతో ఓపిగ్గా ఎదురు చూస్తున్నారని మీడియా తన కథనాలలో పేర్కొంది. ట్రంప్‌తో మలిభేటీ కోసం కిమ్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నప్పటికీ కీలకమైన కొన్ని అంశాలలో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తటంతో భేటీలో జాప్యం జరుగుతోంది. ప్రధానంగా కొరియా ద్వీపకల్ప అణు నిరాయుధీకరణ విషయంలో ఉత్తర కొరియా అణు పరీక్షలు నిలిపివేయటంతో పాటు అణ్వాయుధ స్థావరాలను తొలగించి తన నిబద్ధతను చాటుకున్నప్పటికీ, ట్రంప్ ఆంక్షలను సడలించకపోవటంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది. గత వారం ఉ.కొరియా అధికార ప్రతినిధి కిమ్ యోంగ్ చోల్ ట్రంప్‌ను కలిసినపుడు మలి భేటీకి సుముఖత వ్యక్తం చేస్తూ ఆయన కిమ్‌కు లేఖ రాశారని కెసిఎన్ఎ వార్తా సంస్థ వెల్లడించింది. చోల్‌తో భేటీ అనంతరం కిమ్‌తో తన మలి భేటీ ఫిబ్రవరి చివరిలో వుండవచ్చంటూ ట్రంప్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అయితే ఎప్పుడు, ఎక్కడ ఈ భేటీ జరుగుతున్న వివరాలను వెల్లడించలేదు. కాగా కిమ్‌యోంగ్ చోల్ నెరపిన దౌత్యంపై కిమ్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, తనతో మలిభేటీకి ట్రంప్ ఆసక్తి చూపటం పట్ల హర్షం వ్యక్తం చేశారని ఉ.కొరియా మీడియా తన కథనాలలో పేర్కొంది. ఈ మలి భేటీ కోసం అత్యున్నత స్థాయి ఏర్పాట్లు చేయాలని కిమ్ అధికారులను ఆదేశించినట్లు కెసిఎన్ఎ తన కథనంలో వివరించింది.

అసాంజేపై అభియోగాల రద్దుకు వికీలీక్స్ పిటిషన్

వాషింగ్టన్:తమ సంస్థ వ్యవస్థాపక సంపాదకుడు జూలియన్ అసాంజేపై నమోదయిన అభియోగాలను రద్దు చేయాల్సిందిగా ట్రంప్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ వికీలీక్స్ సంస్థ అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ వద్ద బుధవారం పిటిషన్ దాఖలు చేసింది. తాము ఈ మేరకు మానవ హక్కుల సంస్థ వద్ద పిటిషన్ దాఖలు చేశామని, అసాంజేను అమెరికాకు తిరిగి రప్పించే యత్నాలపై పోరాడేందుకు సహకరించాలని కోరామని వికీలీక్స్ ఒక ప్రకటనలో వివరించింది. అసాంజే ప్రాసిక్యూషన్ నుండి మినహాయింపు పొందకుండా ఆధారాలివ్వాలని అమెరికా, జర్మనీ, ఐస్‌లాండ్ ప్రజలపై అమెరికన్ ప్రాసిక్యూటర్లు వత్తిడి తెస్తున్నారని వికీలీక్స్ ఆరోపించింది.

అసాంజే లండన్‌లోని ఈక్వెడార్ దౌత్య కార్యాలయంలో 2012 ఆగస్టు నుండి తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. అమెరికాకు చెందిన సైనిక, దౌత్య రహస్య పత్రాలను వికీలీక్స్ ద్వారా ప్రచురించిన తరువాత తనను అమెరికా బలవంతంగా రప్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనపై అమెరికా రహస్యంగా అభియోగాలు నమోదు చేసి విచారణ జరుపుతోందని అసాంజే వ్యక్తం చేస్తున్న భయాందోళనలు గత నవంబర్‌లో అమెరికన్ ప్రాసిక్యూటర్లు మరో కేసులో తప్పుడు అభియోగపత్రం నమోదు చేయటంతో వెలుగులోకి వచ్చాయి. ఈ అభియోగపత్రంలో నమోదు చేసిన అభియోగాలు సైతం వెలుగు చూశాయి. ఇప్పుడు అంతర్జాతీయ చట్ట నిబంధనల ప్రకారం ఈ తప్పుడు అభియోగాలను రద్దు చేయాలని తాము అమెరికా మానవ హక్కుల కమిషన్‌ను కోరినట్లు వికీలీక్స్ తన ప్రకటనలో వివరించింది.

షట్‌డౌన్ పరిష్కారమయ్యేదాకా

ట్రంప్ ప్రసంగించడానికి అనుమతించను

- తేల్చిచెప్పిన స్పష్టం చేసిన స్పీకర్ పెలోసి
- అంగీకరించిన ట్రంప్



వాషింగ్టన్ : ప్రభుత్వ ఆర్థిక సంక్షోభం సమసిపోయి తిరిగి ప్రభుత్వ కార్యకలాపాలన్నీ సజావుగా సాగేవరకు పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగించడాన్ని తాను అనుమతించబోనని అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి స్పష్టం చేశారు. ఈ నెల29న యూఎస్ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాలకు ట్రంప్ హాజరై 'స్టేట్ ఆఫ్ ది యూనియన్'ను ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. అయితే, యూఎస్‌లో పాలనస్తంభిన కారణంగా ప్రెసిడెంట్‌కు గతంలో పంపిన ఆహ్వానాన్ని రద్దు చేసుకున్నట్టు ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ (డెమోక్రటిక్ పార్టీ) బుధవారం ప్రకటించారు. ట్రంప్‌నకు ప్రసంగించే అవకాశం ఇవ్వలేమని తేల్చి చెప్పారు. పెలోసీ ప్రకటనపై ట్రంప్ మండిపడ్డారు. షట్‌డౌన్ ముగిసేంత వరకు వేచి ఉంటానని, ప్రతినిధుల సభలో తాను ప్రసంగించనని ట్రంప్ ట్వీట్ చేశారు. మెక్సికోతో సరిహద్దు గోడ నిర్మాణంపై నిధుల విషయంలో తలెత్తిన ప్రతిష్టంభన ప్రభుత్వ ఆర్థిక సంక్షోభానికి దారి తీసి ఇప్పటికి 33 రోజులు గడిచింది. పార్లమెంట్‌నుద్దేశించి తాను ప్రసంగించాలనుకుంటున్నట్లు ట్రంప్ రాసిన లేఖకు సమాధానంగా పెలోసి పై సమాధానం ఇచ్చారు. వీలుంటే ప్రసంగాన్ని వాయిదా వేసుకోవాల్సిందిగా ఈ నెల 16న ట్రంప్‌ను పెలోసి కోరారు. అయితే పెలోసి చెప్పినట్లుగా ఎలాంటి భద్రతాపరమైన ముప్పులు వుండబోవని దేశ భద్రతా విభాగం తనకు హామీ ఇచ్చినట్లు ట్రంప్ చెప్పారు.

అమెరికా చరిత్రలోనే అతిపెద్ద షట్‌డౌన్ : అమెరికాలో 34 రోజుల నుంచి పాలన స్తంభించింది. అమెరికా చరిత్రలోనే ఇది అతిపెద్ద షట్‌డౌన్ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు తప్పకుండా రాబట్టాలని ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. డెమోక్రాటిక్, రిపబ్లికన్ పార్టీ సెనెటర్ల మధ్య తలెత్తిన అభిప్రాయ బేధాల కారణంగా దాదాపు 8లక్షల మంది ఫెరడల్ ఉద్యోగులు జీతాలు లేకుండా పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది.మెక్సికో-అమెరికా సరిహద్దులో గోడ నిర్మాణం కోసం ట్రంప్ నిధులు రాబట్టడమే సరైన నిర్ణయమంటూ కేవలం7శాతం మంది ఓటర్లు మాత్రమే తమ అభిప్రాయాన్ని వెల్లడించారని మార్నింగ్ కన్సల్ట్ పోల్ సంస్థ గురువారం పేర్కొంది. రెండు దేశాల సరిహద్దులో గోడ నిర్మించాలనే ట్రంప్ నిర్ణయాన్ని మెజారిటీ అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారని తెలిపింది.



ఫ్లోరిడా బ్యాంక్‌లో కాల్పులు

ఐదుగురు మృతి

వాషింగ్టన్ : అమెరికా రాష్ట్రమైన ఫ్లోరిడాలో ఒక బ్యాంక్‌లో జరిగిన కాల్పుల్లో ఐదుగురు మరణించారు. కాల్పులు జరిపిన ఆ వ్యక్తి తర్వాత అధికారులకు లొంగిపోయాడని పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి బ్యాంక్‌లో జరిపిన విచక్షణారహిత చర్య వల్ల ఐదుగురు మరణించారని, పలువురు గాయపడ్డారని సెబ్రింగ్ పోలీసు చీఫ్ కార్ల్ హోగ్లాండ్ విలేకర్లకు తెలిపారు. సెబ్రింగ్ పట్టణంలోని సన్‌ట్రస్టు బ్యాంక్‌లో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయి. వెంటనే బ్యాంక్‌ను చుట్టుముట్టిన పోలీసులు అనుమానితుడిని లొంగిపోవాల్సిందిగా ఆదేశించారని స్థానిక మీడియా తెలిపింది. కాల్పుల్లో గాయపడిన వారు ఎంతమందనేది స్పష్టంగా తెలియరాలేదు. అనంతరం ఆ అనుమానితుడిని జీఫెన్ గ్జేవియర్ (21) గా గుర్తించారు. సాల్ట్ లేక్ నగరంలోని స్టీవెన్స్ కాలేజీలో ఆన్‌లైన్ విద్యార్థి అని తెలిసింది. నిందితుడికి కఠినమైన శిక్ష విధించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీ శాంటిస్ హామీ ఇచ్చారు.

సిరియాలో ఇరాక్ సైన్యం దాడులు

43 మంది ఐఎస్ ఉగ్రవాదుల హతం

బాగ్దాద్: సిరియా భూభాగంలో వున్న ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల స్థావరాలపై ఇరాక్ సైన్యం బుధవారం నిర్వహించిన దాడుల్లో 43 మంది మరణించినట్లు ఇరాక్ సైనికాధికారులు తెలిపారు. సిరియాలోని అల్-బగౌజ్ ప్రాంతంలో ఉగ్రవాదులు భేటీ అవుతున్నారన్న సమాచారం తెలుసుకున్న తమ సైన్యం ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంపై దాడి చేసిందని, ఈ దాడిలో 43 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని, మరికొంత మంది గాయపడ్డారని ఇరాక్ సైనిక ప్రతినిధి ఒక ప్రకటనలో వివరించారు. ఈ దాడిలో ఉగ్రవాదులకు చెందిన అనేక వాహనాలు, ఇంధన నిల్వలు కూడా ధ్వంసమయ్యాయని ఆయన తెలిపారు. ఇరాక్ భద్రతా దళాల స్థావరాలపై ఐఎస్ మిలిటెంట్లు దాడులకు సిద్దమవుతున్నారన్న ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు ఈ దాడి జరిగిందని ఆయన వివరించారు.

మలేసియా కొత్త రాజుగా సుల్తాన్ అబ్దుల్లా

31న బాధ్యతల స్వీకరణ

కౌలాలంపూర్ : మలేసియా కొత్త రాజుగా సుల్తాన్ అబ్దుల్లా పీఠం అధిష్టించనున్నారు. ఈ నెల 31వ తేదీన ఆయన అధికారికంగా బాధ్యతలు చేపడతారని ఒక ప్రకటన వెలువడింది. ఈ నెల 6వ తేదిన రాజీనామా చేసిన సుల్తాన్ మహ్మద్ స్థానంలో అబ్దుల్లా నియమితులు కానున్నారు. తీవ్ర అనారోగ్యం కారణంగా ఈ నెల 11న మృతి చెందిన సుల్తాన్ అహ్మద్ షా స్థానంలో పహంగ్ రాష్ట్ర సుల్తాన్‌గా అబ్దుల్లా నియమితులయ్యారు. క్రీడలంటే మంచి ఆసక్తి వున్న అబ్దుల్లా ఆసియన్ ఫుట్‌బాల్ సమాఖ్య, అంతర్జాతీయ సమాఖ్య పిఫాలలో సభ్యుడిగా కూడా వున్నారు. మలేసియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రస్తుతం వున్నారు. మలేసియాలో 9 రాష్ట్రాలకు 9మంది సుల్తాన్లు వున్నారు. వీరు మతపెద్దలుగా కూడా వ్యవహరిస్తారు. మలేసియాలో రాజ్యాంగబద్ధమైన రాజరిక వ్యవస్థ అమలులో వుంది. మలేసియా రాజు పదవీ కాలం ఐదేళ్ళు.

మార్చి 24న థాయ్‌లాండ్‌లో సార్వత్రిక ఎన్నికలు

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో మార్చి 24న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ దేశ ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించింది. షెడ్యూలు సమయం కన్నా ఒక నెల ఆలస్యంగా ఎన్నికలు జరుగుతుండటం గమనార్హం. రాజు మహావజ్రలాంగ్‌కార్న్ ఆమోదించిన అనంతరం కమిషన్ ఎన్నికల తేదీలను అధికారికంగా ప్రకటించినట్లు బ్యాంకాక్ మీడియా వెల్లడించింది. పార్లమెంటు దిగువ సభలో వివిధ పదవులకు రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఫిబ్రవరి 4 నుండి 8 లోగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ చీఫ్ ఇట్టిపోర్న్‌బూన్‌ప్రకాంగ్ చెప్పారు. కాగా ప్రస్తుత ప్రధాని ప్రయుత్ చాన్‌ఓచా ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కన్పించటం లేదని పరిశీలకులు చెబుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

25న విశాఖలో కీలక భేటీ

ముప్పాళ్ల నాగేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లి విల్సన్ తదితరులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. గుంటూరు జిల్లాలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఈ నెల 26 నుంచి రెండు రోజులపాటు పర్యటించనున్నారని జనసేన తెలిపింది.

ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

ఉందన్నారు. ఆర్టీసీ సమ్మె సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితులు ఉన్నందున, సాధారణ జీవనానికి ఎటువంటి ఆటంకం కలగని విధంగా సమ్మెను నివారించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన కొర్కెల పరిష్కారానికి చేస్తున్న పోరాటంలో ఆర్టీసీ కార్మికులకు జనసేన అండగా నిలబడాలని పవన్ పిలుపునిచ్చారని తెలిపారు.

నేడు ధర్నాలు

మరోవైపు ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఆర్టీసి కార్మిక సంఘాల జెఎసి నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. సమ్మె సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అన్ని డిపోల వద్ద జెఎసి ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టనున్నట్లు జెఎసి కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్ సుందరయ్య, వి వరహాలనాయుడు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆర్టీసి కార్మికులు పెద్ద ఎత్తున ఈ ధర్నాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జగన్ ఆంక్షలను భరించలేకపోయా

జరిగిన అవమానాలు వేరెవ్వరికీ జరగకూడదన్నారు. ఇప్పటికైనా జగన్ పద్ధతి మార్చుకుని రంగా అభిమానులను గౌరవించాలని ఆయన సూచించారు. మాజీ ఎంఎల్ఎ యలమంచిలి రవిని తాను వైసిపిలోకి తీసుకొచ్చానని, ఇపుడు సెంట్రల్ సీటు కాదని తూర్పు నుండి పోటీ చేయాలని జగన్ చెప్తే తాను తీసుకువచ్చిన వ్యక్తిని పక్కన పెట్టి తాను పోటీ చేయాలా! అని ప్రశ్నించారు. రంగా అభిమానులంటే జగన్‌కు ఏమాత్రమూ గౌరవం లేదన్నారు. తాను టిడిపిలోకి వెళ్లడానికి రూ.100 కోట్లు తీసుకున్నానని కొందరు ప్రచారం చేస్తున్నారని, అటువంటి ప్రచారాన్ని తాను అసలు పట్టించుకోనని అన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా రంగా అభిమానులను కాపాడుకోవడం తన బాధ్యతన్నారు. తనను చంపేస్తామని సోషల్ మీడియాలో బెదిరింపులు కూడా వచ్చాయని, అవి ఎవరు చేస్తున్నారో కూడా తనకు తెలుసని చెప్పారు. తన తండ్రి రంగాను చంపింది టిడిపిలోని కొందరు నేత లని, ఈ ఘటనను మొత్తంగా ఆ పార్టీకి ఆపాదించలేమని వివరించారు. టిడిపిలో చేరికపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలను దాటవేశారు. తాను రాజీనామా చేస్తే జగన్ కనీసం ఫోన్‌లో కూడా తనతో మాట్లాడలేదని, ముఖ్యమంత్రి హోదాలో ఉన్నా చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసి తనను టిడిపిలోకి ఆహ్వానించారని రాధా కృష్ణ వెల్లడించారు. విజయవాడలో ఎన్నో ఏళ్లుగా వేలాది మంది ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అమెరికాతో తెగదెంపులు

మొదటి పేజీ తరువాయి

అన్ని దౌత్య, రాజకీయ సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయించాం. అందరూ ఇక్కడ నుండి వెళ్లి పోవాలి." అని మదురో స్పష్టం చేశారు. కారకస్‌లోని అధ్యక్ష భవనం నుండి వేలాదిమంది మద్దతుదారులను ఉద్దేశించి మదురో ప్రసంగించారు. వాషింగ్టన్ నుండి వెనిజులాను పరిపాలించాలన్నది వారి లక్ష్యంగా వుందని దాన్ని సాగనివ్వబోమని మదురో స్పష్టం చేశారు. "వెనిజులాను గౌరవించండి, కుట్రను లేదా సామ్రాజ్యవాదాన్ని కాదు. శాంతిని, ప్రగతిని వెనిజులా కోరుకుంటోంది." అని మదురో పేర్కొన్నారు. కాగా, మెక్సికో, బొలీవియా, టర్కీ, రష్యా ప్రభుత్వాలు తాము మదురో ప్రభుత్వాన్నే గుర్తిస్తున్నామని ప్రకటించాయి. "వెనిజులా చమురు, గ్యాస్, బంగారు గనుల కోసం ఆశ పడుతున్న వారిని నమ్మవద్దు, వారి ప్రయోజనాల కోసమే ఇలా చేస్తున్నారు. ఇవన్నీ వెనిజులా ప్రజలవి" అని మదురో హెచ్చరించారు. "కుట్రలు, కుతంత్రాలు చెల్లవు, జోక్యందారీ విధానాలు కుదరవు, సామ్రాజ్యవాదానికి ఇక్కడ స్థానం లేదు. గెటౌట్! వెనిజులాను వీడి వెళ్లండి." అని మదురో స్పష్టం చేశారు. ఇదిలావుండగా వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడి చర్యను గుర్తించిన చిలీ ప్రభుత్వాన్ని చిలీ వామపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. చిలీ అధ్యక్షుడు సెబాస్టియన్ పినెరా చర్య అగ్నికి ఆజ్యం పోసిన రీతిలో వుందని వ్యాఖ్యానించాయి.

మా మద్దతు వుంటుంది : పాంపియో

జువాన్ గైడో తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాన్ని తాము గుర్తిస్తున్నామని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో ట్విట్టర్‌లో ప్రకటించారు. వెనిజులాలో ప్రభుతాన్ని నెలకొల్పడానికి చేస్తున్న యత్నాలకు తాము మద్దతిస్తామని అన్నారు. వెనిజులాలో స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని కోరారు. అమెరికా రాష్ట్రాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి లూయిస్ అల్మాగ్రో కూడా గెయిడోకి తన మద్దతు తెలియచేశారు. ఈ దిశలోనే కొలంబియా, బ్రెజిల్, పరాగ్వే, ఈక్వెడార్‌లు బహిరంగంగా తాత్కాలిక అధ్యక్షుడికి తమ మద్దతు తెలిపాయి.

వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం తగదు : వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడం పట్ల రష్యా, చైనా, టర్కీ ఆగ్రహం వ్యక్తం చేశాయి. మదురోను గద్దె దించేందుకు అమెరికా కుట్రపన్నిందని పేర్కొన్నాయి. 'మేము మీకు మద్దతిస్తున్నాం. మదురో' అంటూ పుతిన్ ఫోన్‌లో మాట్లాడారని మదురో అధికార ప్రతినిధి ఇబ్రహీమ్ కాలిన్ తెలిపారు. గైడో తనకు తాను అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్టు టర్కీ విదేశాంగ మంత్రి మెవ్లత్ కవుసోగ్లూ తెలిపారు. టర్కీ కూడా వెనిజులాకు మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. చైనా కూడా మదురోకు మద్దతిస్తున్నదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ తెలిపారు. బొలీవియా, క్యూబా కూడా తాజాగా వెనెజులాకు మద్దతు తెలిపాయి. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా తలదూర్చడంపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ స్పందించారు. ఈ సున్నితమైన వివాదాన్ని చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలని కోరారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ వేదికగా ఐరాస జనరల్ సెక్రటరీ స్పందించారు.

ఇంటర్నెట్ సేవల నిలిపివేత : వెనిజులాలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది. మదురోను అధ్యక్ష పీఠం నుంచి తప్పించాలని ఓ వర్గం, గైడోకు ప్రెసిడెంట్‌గా చూడాలన్నదే తమ ఆకాంక్ష అంటూ మరోవర్గం ఆందోళనలు చేపడుతున్నాయి. ఈనేపథ్యంలో పలు హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకునే అవకాశమున్నాయని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. ప్రభుత్వ తదుపరి ఆదేశాలు అందేంత వరకు నెట్ సేవలు నిలిపివేస్తున్నామని నెట్‌బ్లాక్స్.ఓఆర్‌జీ సంస్థ వెల్లడించింది.

మదురోకే మా మద్దతు : వెనిజులా సైనికులు అధ్యక్షుడు మదురోకే మద్దతివ్వాలని నిర్ణయించుకున్నారు. అమెరికా కుట్రలను తిప్పిగొట్టేందుకు సిద్ధమయ్యారు. తమ అధ్యక్షుడి ఆదేశాలను శిరసావహిస్తామని పేర్కొన్నారు. వెనిజులాలో సైనిక తిరుగుబాటుకు అవకాశంలేదని తేల్చి చెప్పారు. గైడోకు మద్దతు ఇవ్వలేమని స్పష్టం చేశారు.

అమెరికా జోక్యం గర్హనీయం : సిపిఎం

న్యూఢిల్లీ : బొలివేరియన్ రిపబ్లిక్ వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. పార్టీ పొలిట్‌బ్యూరో గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. వెనిజులాలో ప్రతిపక్ష గ్రూపు నేత జువాన్ గైడోను అధ్యక్షుడిగా గుర్తిస్తున్నట్లు అమెరికా ప్రకటించడం ఆ దేశ రాజ్యాంగ క్రమానికి తూట్లు పొడిచి, కుట్రను ప్రోత్సహించడమేనని సిపిఎం పేర్కొంది. 2018 మే 20న జరిగిన వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో నికోలస్ మదురో న్యాయబద్ధంగా ఎన్నికయ్యాడు. ఆయన ఎన్నిక వెనిజూలా రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం ప్రజాభిప్రాయానికి దర్పణం పడుతున్నది. ఆ ఎన్నికలను పర్యవేక్షించిన వివిధ దేశాల ఎన్నికల పరిశీలకులు న్యాయంగా, నిష్పక్షపాతంగా జరిగినట్లు ధృవీకరించారు. అయినా అమెరికా వెనిజులాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ఆ దేశంపై అమానుషమైన ఆర్థిక ఆంక్షలు విధించడంతో సహ రకరకాలుగా కుట్రలు పన్నుతూనే ఉంది. సైనికంగా జోక్యం చేసుకుంటామని బెదిరించింది. ఇవన్నీ ఐరాస నియావళిని బాహటంగా ఉల్లంఘించడమేనని పొలిట్ బ్యూరో పేర్కొంది. వెనిజూలాలో ఎన్నికైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ బలగాల తిరుగుబాటును ఎగదోయడం వంటి కుట్రలకు అమెరికా తెగబడినప్పటికీ వెనిజూలా ప్రజలు, సాయుధ బలగాలు మదురో ప్రభుత్వానికి అండగా నిలిచాయని పొలిట్ బ్యూరో పేర్కొంది. దేశాన్ని అస్థిర పరిచేందుకు అమెరికా సాగిస్తున్న కుట్రలను వెనిజూలా ప్రజలు తిప్పికొడతారని, అలాగే మితవాద శక్తులు పన్నిన ఈ కుట్రను మదురో చిత్తుగా ఓడిస్తారన్న విశ్వాసాన్ని సిపిఎం వ్యక్తం చేసింది. వెనిజూలాపై అమెరికా సామ్రాజ్యవాదం తాజాగా సాగిస్తున్న దురాక్రమణ చర్యను సిపిఎం తీవ్రంగా ఖండించింది. అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా, దేశ సారభౌమత్వ పరిరక్షణ కోసం వెనిజూలా ప్రజలు సాగిస్తున్న పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాంతియుత, ప్రజాతంత్ర శక్తులన్నీ సంఘీభావంగా నిలవాలని సిపిఎం పిలుపునిచ్చింది.

పోరుకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

నష్టాలకు ప్రభుత్వ విధానాలే తప్ప కార్మికులు కారణం కాదని, నష్టాల సాకుతో వేతన సవరణ పూర్తి చేయకపోవడం దారుణమని కార్మికులు మండిపడుతున్నారు. నాలుగేళ్లలో పది వేల మంది సిబ్బందిని కుదించడం వల్ల ఉన్న సిబ్బందిపై పనిభారం, ఒత్తిడి పెరిగిందని, అయినా సొంత సంస్థలా భావించి సేవలందిస్తున్నామని, తమ న్యాయమైన డిమాండ్ల నేరవేర్చేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకూ న్యాయమని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 64 శాతం ఫిట్‌మెంట్ డిమాండ్ చేస్తుంటే తాము 50 శాతం ఫిట్‌మెంటే డిమాండ్ చేస్తున్నామని, అందుకు కూడా యాజమాన్యం అంగీకరించకపోవడం కార్మిక సంక్షేమానికి వ్యతిరేకమేనని చెబుతున్నారు. ఆర్టీసి గుర్తింపు సంఘం ఎంప్లాయీస్ యూనియన్(ఇయు) నేతృత్వంలో అన్ని సంఘాలతో కలిసి జెఎసి ఏర్పాటైంది. అయితే ఎన్ఎంయు జెఎసిలో కలవకపోయినా వేతన సవరణ పూర్తి చేయాలని, సర్వీస్ కండీషన్ల మెరుగుదల కోసం ఈ నెల 21, 22న అన్ని డిపోల ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టింది. ఇప్పటి వరకూ ఆర్టీసిలో అన్ని కార్మిక సంఘాలు కలిసి మూడు సార్లు ఐక్య ఉద్యమాలు చేపట్టి విజయాలను సాధించారు. 2001లో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 24 రోజులు, 2005, 2015లో వేతన సవరణ కోసం ఉద్యమాలు చేపట్టారు. 2015లో 43 శాతం ఫిట్‌మెంట్‌ను సాధించు కోగలిగారు. ఇప్పుడు కూడా ఐక్యంగా ఉద్యమిస్తే డిమాండ్ల సాధన సాధ్యమవుతుందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్ట సవరణలపై స్టేకు సుప్రీం నో

సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో సుప్రీంతీర్పుకు వ్యతిరేకంగా కేంద్రం ప్రభుత్వం సవరణ బిల్లును ఆమోదించింది. ఈ సవరణలకు వ్యతిరేకంగా పలు పిటిషన్‌లు దాఖలయ్యాయి.

1 నుండి ఇబిసి కోటా

వారుగా గుర్తించి వారికి రిజర్వేషన్లను వర్తింప చేస్తామని సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వశాఖ విడుదల చేసిన మరో ప్రకటనలో వెల్లడించింది. అదే విధంగా ఐదెకరాలు, అంతకు మించిన సాగుభూమి, నోటిఫైడ్ మున్సిపాలిటీలలో వెయ్యి చదరపు అడుగుల నివాస స్థలం, లేదా 100 చదరపు గజాల నివాస భవనం, నాన్ నోటిఫైడ్ మున్సిపాలిటీలలో 200 గజాల నివాస స్థలం వున్న వారిని కుటుంబ వార్షికాదాయంతో సంబంధం లేకుండా ఇబిసి రిజర్వేషన్ల నుండి మినహాయిస్తామని ఈ ప్రకటనలో ప్రభుత్వం వివరించింది. ఆదాయం, ఆస్తుల ధృవీకరణకు తాసిల్దార్ స్థాయి అధికారి నుండి ధృవీకరణ పత్రం పొందాల్సి వుంటుందని తెలిపింది. విద్యాసంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేస్తుందని వివరించింది.

విద్యుత్ మీటరు రీడర్లకు ఉద్యోగ భద్రత

కార్మికులందరూ గుణపాఠం చెబుతారన్నారు. మీటరు రీడర్ల డిమాండ్ల సాధనకు సిఐటియు అండగా నిలుస్తుందని హామీఇచ్చారు. ఎమ్మెల్సి బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్టు వ్యవస్థను నిర్మూలించాలన్నారు. అన్ని ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే క్రమబద్దీకరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ రాష్ట్ర జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ పాలకులు కార్మికుల పట్ల నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రతతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ఎం బాలకాశి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీటరు రీడర్లందరూ ఏకమై డిమాండ్ల సాధనకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మీటరు రీడర్ల భవిష్యత్తు కార్యాచరణ తీర్మానాన్ని అమోదించారు. ఫిబ్రవరి 11,12తేదీల్లో ఈపిడిసిఎల్ విశాఖపట్నం కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు, 13న మహాధర్నా చేపట్టనున్నామన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 18,19 తేదీల్లో ఎస్‌పిడిసిఎల్ తిరుపతి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు, 20న మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో కృష్ణాజిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్‌సిహెచ్‌శ్రీనివాస్, ఎపి కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు టి శేషాచలం, యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు రామయ్య, మీటరు రీడర్ల నాయకులు హజరత్ వలి, శివారెడ్డి, ఎస్‌డి మూస, ఎమ్‌డి ఖలీలుల్లా, రామకృష్ణ, మురళి, కుమారస్వామి, హరి, రామాంజనేయులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఖర్చుకు డబ్బెలా?

మొదటి పేజీ తరువాయి

ఎంత ఖర్చు చేయాల్సి ఉంటుంది, అప్పటివరకు వచ్చే ఆదాయం ఎంత అన్నదానిపై గత నెల్లోనే అంచనాలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఆర్థిక సంవత్సరం చివరి నాలుగు నెలల్లో 78 వేల కోట్ల వరకు ఖర్చు ఉంటుందని అంచనా వేయగా, ఆదాయం మాత్రం 54675 కోట్లు లభిస్తుందని అంచనా వేశారు. దీంతో దాదాపు 24 వేల కోట్లు లోటు ఉంటుందని గుర్తించారు. అయితే అకస్మాత్తుగా ఫిబ్రవరిలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు కనిపిస్తుండడంతో ఈ అంచనాలు మారిపోయాయి. అందుకే ఇప్పుడు జనవరి, ఫిబ్రవరి ఆదాయానికి అనుగుణంగానే ముందుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థిక శాఖ గత అంచనాలను పరిశీలిస్తే జనవరి, ఫిబ్రవరి నెలలకు 28,422 కోట్లు ఆదాయం రానుంది. అయితే మార్చి వరకు చేయాల్సిన వ్యయాన్ని ఫిబ్రవరిలోనే చేయాల్సి ఉంటుంది. దీంతో దాదాపు మరొక 28 వేల కోట్ల రూపాయలు అదనంగా అవసరమవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికీ పది వేల రూపాయలు ఇవ్వాలన్న ప్రభుత్వ తాజా నిర్ణయం దీనికి అదనం! దీని అమలుకు మరో 8600 కోట్లు కావాల్సి ఉంటుంది. అలాగే తాజాగా పెంచిన పింఛన్ల కోసం మరో 1600 కోట్లు అవరమని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇక రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులకు కూడా భారీగానే నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. ఇవి కలుపుకొంటే ఫిబ్రవరిలోగా మొత్తం అంచనా వ్యయం 70 వేల కోట్లు దాటిపోతుందని అధికారులే అంటున్నారు. అంటే ఆదాయానికి, వ్యయానికి మధ్య 40 నుంచి 45 వేల కోట్ల వరకు గ్యాప్ ఏర్పడుతుందని అభిప్రాయపడుతున్నారు. కేవలం 20 నుంచి 25 రోజుల్లో ఇంత నిధులను ఖర్చు చేస్తే అది కూడా ఒక గిన్నిస్ బుక్ రికార్డేనని వారు చమత్కరిస్తున్నారు.

బిల్లుల చెల్లింపులు బంద్!

నిధుల సమీకరణలో భాగంగా కొన్ని ఖర్చులను పక్కనపెట్టడం ద్వారా లోటును తగ్గించుకోవాలని యోచిస్తున్నట్లు తెలిసింది. పారిశ్రామిక పోత్సాహకాలు, వివిధ పథకాలకు బిల్లుల చెల్లింపులను తాత్కాలికంగా నిలిపివేసి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత చెల్లింపులు చేయవచ్చుననే భావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ప్రస్తుతం కొంత భారం తగ్గినట్లుగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

సర్కారు ఖర్చుకు కార్పొరేషన్ నిధులు

ఇక నిధుల సేకరణలో భాగంగా వివిధ కార్పొరేషన్లకు ఉన్న నిధులను ప్రభుత్వం ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే వివిధ కార్పొరేషన్లకు భారీగా రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం గ్యారంటీలు ఇచ్చింది. దీనిద్వారా వచ్చిన రుణాలను తామే ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఒక అధికారి వివరించారు. ఇవి దాదాపు పదివేల కోట్లకుపైగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇలా ఉండగా, ఇటీవల మరికొన్ని రుణాలను కార్పొరేషన్లకు ఇప్పించేందుకు ప్రభుత్వం బ్యాంకర్లతో సంప్రదింపులు సాగిస్తోంది. అయితే, ముందుగా రుణాలు ఇచ్చేందుకు సుముఖత చూపించిన బ్యాంకులు కూడా తాజా పరిణామాల నేపథ్యంలో ఎన్నికలయ్యేంతవరకు వేచిచూడాలని భావిస్తున్నట్లు సమాచారం.



ఆయనొచ్చి అడగ్గానే వచ్చేశాను

నా కోసం నిలబడ్డ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా : అల్లు అర్జున్

'దక్షిణాది సినిమాల నుంచి ఈ మధ్య కాలంలో జాతీయ, అంతర్జాతీయంగా వైరల్ అయిన వీడియోలు కొలవెరి ఢీ., బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు?. ఈ మధ్య కాలంలో ఆ అంతలా వైరల్ అయిన వీడియోల్లో 'ఒరు ఆడార్ లవ్'. నాకు సౌతిండియా అంటే పిచ్చి. నా ప్రొఫెషన్‌లో సౌతిండియన్ యాక్టర్ అని రాసుకుంటాను. నేను దక్షిణాదికి చెందిన వాడినని చెప్పుకోవడానికి గర్వపడతాను. నేను పుట్టింది చెన్నైలో. పెరిగింది హైదరాబాద్‌లో.. అలాగే మలయాళం వాళ్లు , కర్ణాటక వాళ్లు కూడా నన్ను ఆదరిస్తున్నారు. కాబట్టి నేను సౌతిండియన్‌నే" అని అల్లు అర్జున్ అన్నారు.

ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన మలయాళ చిత్రం 'ఒరు ఆదార్ లవ్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'లవర్స్ డే' పేరుతో సుఖీభవ సినిమాస్ సంస్థ విడుదల చేయనుంది. ఎ.గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి నిర్మాతలు. ఒమర్ లులు దర్శకుడు. షాన్ రెహమాన్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో అల్లు అర్జున్ ఆవిష్కరించారు.

.అల్లు అర్జున్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఆడియోను విడుదలకు రావడానికి రెండు కారణాలున్నాయి. నా సినిమాలను కేరళవాళ్లు వాళ్ల సొంత సినిమాలా ఆదరిస్తున్నారు. ఓ ల్యాండ్ మార్క్ ఉన్న మలయాళ సినిమా తెలుగులోకి వస్తున్నప్పుడు నేను సపోర్ట్ చేసినట్టుగా ఉండాలి కదా అని వచ్చాను. ఈ సినిమా ద్వారా మలయాళ ఇండస్ట్రీకి స్వాగతం పలుకుతున్నా. మన సినిమాలను కూడా వేరే భాషల్లో చూస్తున్నారు కదా. ఈ సినిమాకు సోషల్ మీడియా ద్వారా బజ్ క్రియేట్ చేసిన రోషన్, ప్రియావారియర్‌లకు అభినందనలు. ఈ క్రెడిట్ డైరెక్టర్ ఒమర్ లులుది. ఇక రెండోది.. నా పేరు సూర్య సినిమా సమయంలో వినోద్ రెడ్డిని కలిశాను. అతనని నా అభిమానిగా బన్ని వాసు పరిచయం చేశాడు. సినిమా రిలీజై కొన్ని గొడవలు వచ్చాయి. ఆ సమయంలో ....వినోద్ రెడ్డి ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాడని వాసు ద్వారా తెలుసుకున్నాను. 'నిజంగా మనకు వీలైనప్పుడు మనమేదైనా చేయ్యాలి వాసు' అని అన్నాను. ఆయన వచ్చి నన్ను అడగ్గానే నేను వచ్చి నిలబడ్డాను. నేను ఎంత కాలం నిలబడగలనో తెలియదు కానీ.. అవకాశం ఉన్న ప్రతిసారి నా కోసం నిలబడ్డ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా. నా బర్త్‌డేకి ఎంత ఆత్రంగా ఉంటానో .. లవర్స్ డేకు కూడా అంతే కంటే 10 శాతం ఆత్రంగా ఉన్నాను. ఇప్పుడు అయితే నా భార్యను ఎలా సర్‌ప్రైజ్ చేయాలో ఆలోచిస్తుంటాను' అన్నారు.



దర్శకుడు ఒమర్ లులు మాట్లాడుతూ 'మలయాళంలో ఎంత మంది స్టార్స్ ఉన్నా.. మా వీడియో ఎవరూ షేర్ చేయలేదు. అల్లు అర్జున్ మాత్రమే షేర్ చేశారు. చాలా మంది కొత్త వాళ్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం' అని తెలిపారు.

ప్రియా ప్రకాష్ మాట్లాడుతూ 'అల్లు అర్జున్‌గారంటే నాకు చాలా ఇష్టం. ఆయనతో కలిసి స్టేజ్‌పై నిలబడే అవకాశం వస్తుందని అనుకోలేదు. ఆయన్ను కలుసుకున్నందుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అల్లు అర్జున్‌కి కేరళలో కూడా చాలా మంది అభిమానులున్నారని రోషన్ అన్నారు. .

చిత్ర సమర్పకుడు వినోద్ రెడ్డి మాట్లాడుతూ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమా డిస్ట్రిబ్యూషన్ చేశాను. బన్నివాసుగారి సహాయంతో అల్లు అర్జున్‌గారిని కలవగానే ఆయన నన్ను గుర్తు పట్టి.. అడగ్గానే మరో ఆలోచన లేకుండా ఈ ఫంక్షన్‌కి వస్తానని అన్నారు. భవిష్యత్‌లో కూడా నీకు నా సపోర్ట్ ఉంటుందని ఆయన అన్నారు. ఆయన సపోర్ట్‌ను జీవితంలో మరచిపోలేను' అని చెప్పారు.

పుట్టిన రోజు నాడే

రవితేజ హీరోగా, వి.ఐ. ఆనంద్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో మొదలుపెట్టబోతున్నారు. రామ్ తళ్లూరి భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 26న రవితేజ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం పేరుని అధికారికంగా ప్రకటించడంతో పాటు టైటిల్ లోగోని ఆవిష్కరించనున్నారు. రవితేజకు జోడిగా ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారు. త్వరలోనే ఈ సినిమా మొదటి షెడ్యూల్‌ని ప్రారంభించబోతున్నట్లుగా నిర్మాత రామ్ తళ్లూరి తెలిపారు. పాయల్ రాజపుత్, బాబీసింహా, వెన్నెల కిషోర్, సత్య తదితరులు నటించనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ : సాయి శ్రీరామ్, మ్యూజిక్ : థమన్.



రవితేజ

సినిమా వాళ్లను పెళ్లి చేసుకోను

– కాజల్ అగర్వాల్

కాజల్ అగర్వాల్ ప్రస్తుతం కమల్ హాసన్ సరసన నటించబోతుంది. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'భారతీయుడు 2'లో ఈమె కథానాయిక. తొలిసారిగా కమల్‌తో నటిస్తుండడంతో ఆమె చాలా ఆనందంగా ఉంది. కమల్‌తో నటించే అవకాశం తన జీవితంలో వస్తుందని ఊహించలేదని పేర్కొంది. ఈ చిత్రం ఇటీవల సెట్స్‌పైకి వెళ్లింది. హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రంతో పాటు తమిళంలో బాలీవుడ్ 'క్వీన్' రీమేక్‌లో నటిస్తోంది. ఈ సందర్భంగా మీడియాకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో కాజల్ మాట్లాడుతూ ' చిత్రసీమకు సంబంధం లేని వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నా. దానికి సంబంధించిన విషయాలను అతి త్వరలోనే మీకు తెలియజేస్తాను. ఏం చెప్పాలన్నా దానికి ఇంకా సమయం ఉంటుందని నేను అనుకుంటున్నా' అని చెప్పింది. సాధారణంగా వివాహం గురించి కాజల్‌ను మీడియా ఎప్పుడు ప్రశ్నించిన తనకు పెళ్లి ఆలోచనలే లేదని, ప్రస్తుతం అంతా కెరీర్‌పై దృష్టి సారిస్తున్నానని నిత్యం చెబుతూ ఉండేది.



వెంకటేశ్‌కు వెన్ను నొప్పి



వెంకటేష్ ఆసుపత్రిలో జాయిన్ అయ్యాడు. విశాఖపట్నంలోని నేచురల్ క్యూర్ ఆసుపత్రిలో వెన్ను నొప్పికి చికిత్స తీసుకుంటున్నాడు. ఇటీవలే 'ఎఫ్2' తో విజయం అందుకున్నాడు. 59 ఏళ్ల వెంకటేష్ వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు. దాంతో ఆ చికిత్స కోసం వైజాగ్ వెళ్లాడు . అక్కడే ట్రీట్‌మెంట్ పూర్తయ్యాక హైదరాబాద్ తిరిగి రానున్నాడు.



అమితాబ్, బొమన్ ఇరానీ

నేను ఎప్పటికీ నటుడినే

– బొమన్ ఇరానీ

'నేను ప్రొడక్షన్ హౌస్ ప్రారంభించినా 'నువ్వు ఎప్పటికీ నటుడివే అని నా హృదయం చెబుతూ ఉంటుంది. కాకపోతే నాలో ఉన్న రచన అనే కొత్త క్రాఫ్ట్‌ను గుర్తించాను. నా చిన్నప్పటి నుంచీ రాస్తున్నా ఏవీ సరిగ్గా రాసేవాడ్ని కాదు అని బాలీవుడ్ ప్రముఖ నటుడు బొమన్ ఇరానీ అన్నారు. ఆయన తాజాగా ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. 'ఇరానీ మూవీ టోన్' పేరుతో బ్యానర్‌ను స్థాపించారు. ఇంతకాలం నటుడిగా రాణించిన ఈ వ్యక్తి ఇప్పుడు నిర్మాతగా, దర్శకుడిగా మారబోతున్నాడు. గురువారం ఇరానీ మూవీ టోన్ బ్యానర్‌ను అమితాబచ్చన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చాలా ఏళ్ల తర్వాత రచనకు సంబంధించిన రంగంలో రాణించాలని పుస్తకాలు చదవడం ప్రారంభించాను. దాని కోసం అస్కార్ విన్నర్, హాలీవుడ్ రైటర్ అలెగ్జాండ్రోను న్యూయార్క్ కలిశాను. ఆ సమయంలో మా ఇద్దరం నేను రాసిన స్క్రిప్ట్‌లు గురించి చర్చించాం. అతను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అలెక్స్, అతని స్నేహితులను నేను కలిసినప్పుడు వారి నుంచి చాలా నేర్చుకున్నా. ఈ బ్యానర్‌లో మొదటి సినిమా నేను రాసిన స్క్రిప్ట్‌పైనే సినిమా మొదలు అవుతుంది. ఒకవేళ అలా కాకపోతే తర్వాత చిత్రం నుంచి దృష్టి సారిస్తా." అని అన్నారు.



వరుణ్ తేజ్



హరీష్ శంకర్

27న సెట్స్‌పైకి

దర్శకుడు హరీష్ శంకర్ కొత్త చిత్రంపై ఇటీవల రకరకాలుగా ప్రచారం జరిగింది. అంతిమంగా కొత్త స్రిప్ట్‌తో సెట్స్‌పైకి వెళ్లబోతున్నాడు ఈ దర్శకుడు. తమిళంలో విడుదలైన కామెడీ చిత్రం 'జిగర్తాంద'ను తెలుగులో రీమేక్ చేయబోతున్నారు. ఈ చిత్రంలో ఇద్దరు హీరోలు నటించనున్నారు. అందులో ఒక పాత్రను వరుణ్ తేజ్ చేస్తున్నారు. మరొక పాత్రలో ఎవరు చేస్తారన్న సమాచారం బయటకు తెలియలేదు. ఇప్పటికే మల్టీస్టారర్ 'ఎఫ్2' చేసి విజయాన్ని అందుకు వరుణ్‌కు మరోసారి అటువంటి చిత్రంలో నటించడానికి ఆసక్తి చూపాడు. ఈ చిత్రం షూటింగ్ ఈనెల 27న లాంఛనంగా ప్రారంభం కానుంది. దేవీశ్రీప్రసాద్ బాణీలు సమకూరుస్తున్నాడు. డీజే ఫేమ్ అయాంక్ బోస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నాడు. రామ్ ఆచంట, గోపా ఆనంత సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌లో ఈ చిత్రం తెరకెక్కనుంది.

మరో కట్టప్ప!



సముద్రఖని

తమిళ నటుడు సత్యరాజ్ 'బాహుబలి'లో చేసిన కట్టప్ప పాత్రకు ఎంత గుర్తింపు వచ్చిందో అందరికీ తెలిసిందే. అప్పటి వరకు సత్యరాజ్‌కున్న క్రేజ్ ఒక ఎత్తయితే.. కట్టప్ప పాత్ర చేసిన తరవాత ఆయనకొచ్చిన ఇమేజ్ మరో ఎత్తు. ఈ ఒక్క పాత్రతో దేశ వ్యాప్తంగా ప్రేక్షకుల గుండెల్లో చెరిగిపోని ముద్ర వేశారు సత్యరాజ్. ఇప్పుడు అంత ప్రాధాన్యత ఉన్న మరో పాత్రను 'ఆర్ఆర్ఆర్'లో రాజమౌళి డిజైన్ చేశారట. ఆ పాత్రకు తమిళ దర్శకుడు, నటుడు, జాతీయ అవార్డు గ్రహీత సముద్రఖనిని ఎంపిక చేసుకున్నారు. ఈ సినిమా ద్వారా సముద్రఖని తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఈ సినిమాతో నటిస్తుండటంపై సముద్రఖని స్పందించారు. ఓ తమిళ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనను రాజమౌళి ఎంపిక చేసిన విధానాన్ని చెప్పారు. 'నా సినిమా 'నడోడిగల్' చూసిన తరవాత రాజమౌళి సార్ నాకు ఒక పెద్ద మెసేజ్ పంపారు. అప్పటి నుంచి మేమిద్దం టచ్‌లో ఉన్నాం. ఇటీవల ఆయన ఇంటికి నన్ను ఆహ్వానించారు. ఆయన కుటుంబ సభ్యులను నాకు పరిచయం చేశారు. ఎన్టీఆర్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో వస్తోన్న సినిమాలో నన్ను ఓ ప్రధాన పాత్రలో నటించమని అడిగారు. నేను వెంటనే అంగీకరించాను' అని సముద్రఖని వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోనే 'ఆర్ఆర్ఆర్' రెండో షెడ్యూల్ జరుగుతోంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దాదాపు రూ.300 కోట్ల బడ్జెట్‌తో దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా శాటిలైట్ హక్కులు రికార్డు స్థాయిలో రూ.132 కోట్లకు అమ్ముడుపోయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తెలుగు, తమిళం, హిందీ శాటిలైట్ హక్కులను జీ నెట్‌వర్క్ ఈ పెద్ద మొత్తానికి సొంతం చేసుకుందని అంటున్నారు.

ఏవో కొన్ని రోజులే ఇలా..



రష్మిక మదన్నా

రష్మిక మదన్నా...'గీత గోవిందం' చిత్రంలో ఆమె నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈమె సామాజిక మాధ్యమాల్లో చాలా తక్కువగా టచ్‌లో ఉంటుంది. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వ్యవహారంపై సోషల్‌మీడియాలో రచ్చరచ్చ కావడంతో దీనికి కాస్త దూరంగా ఉంది. విజయ్ దేవరకొండ హీరోగా చేస్తోన్న 'డియర్ కామ్రేడ్' చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్న ఈమె తన ట్విట్టర్ ఖాతాలో సంప్రదాయ దుస్తులు ధరించిన దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఈ పిక్స్ పెట్టిందో లేదో గంటలో వేలల్లో లైక్స్ లభించాయి. అంటే ఈమెకు అభిమానులు ఏ రేంజ్‌లో ఉంటారో అర్ధం చేసుకోవచ్చు. దక్షిణ భారత దేశంలో ఇటువంటి సంప్రదాయ దుస్తులను ఎక్కువ ఇష్టపడడం కూడా మరో కారణం. ఏవో కొన్ని రోజులే ఇలా సంప్రదాయకాన్ని తీసుకొస్తాయి" అని పేర్కొంది.

నవ్వించేలా ఉంటుంది

– కృతి సనన్

"లుకా చుప్పి' చిత్రంలో కొన్ని సన్నివేశాలు వచ్చినప్పుడు అలా నవ్వేస్తారు. అంతే. బలవంతంగా నవ్వించేలా మాత్రం ఏ సన్నివేశమూ ఉండదు. ఇటువంటి సినిమాలు చేస్తే కచ్చితంగా చాలా సంతోషంగా ఉంటాం అని చెప్పగలను" అని బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ చెప్పింది. ఆమె, బాలీవుడ్ యువ నటులు కార్తిక్ ఆర్యన్ జోడీగా నటించిన చిత్రం 'లుకా చుప్పి'. లక్ష్మణ్ ఉతేకర్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. కుటుంబంతో కలిసి ఓ జంట సహజీవనం చేస్తే ఎలా ఉంటుంది? అన్న కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమాలో కార్తిక్ రిపోర్టర్ పాత్ర పోషించాడు. పెళ్లికి ముందు సహజీవనం చేస్తే ఎలా ఉంటుంది. అదీ ఇరుకుటుంబాలకు తెలియకుండా ఓ ఇల్లు తీసుకుని భార్యాభర్తల్లా జీవించడం, ఈ విషయం వారికి తెలిసిపోవడం వంటివి ఈ ట్రైలర్‌లో చూపించారు. ట్రైలర్‌లో కార్తిక్, కృతి కెమిస్ట్రీ చూడటానికి చక్కగా ఉంది. మ్యాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేశ్ విజన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మార్చి 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో కృతిసనన్ మాట్లాడుతూ 'సాధారణంగా నవ్వించడం చాలా కష్టం. ప్రేక్షకులను నవ్వించగలగడం అనేది గొప్ప విషయమే. అయితే ఈ సినిమా ఆడియెన్స్‌ను బలవంతంగా నవ్వాలి అనేటట్టు ఎక్కడా సన్నివేశాలు ఉండవు. సందర్భానుసారంగా వచ్చే సీన్లే పగలబడి నవ్వేలా చేస్తాయి. ఇటువంటి సినిమాగానీ చేస్తే చాలా ఆనందంగా ఉండొచ్చు. ఈ సినిమాలో కామెడీ అంతా మనలోకి వచ్చేస్తుంది' అని చెప్పింది.



కృతి సనన్



అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. శుక్రవారం ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అఖిల్ అక్కినేని, వెంకీ, బివిఎస్ఎన్ ప్రసాద్, నిధి అగర్వాల్ గురువారం పాత్రికేయులతో మాట్లాడారు.



అగ్రి ప్లస్



గ్రీన్‌హౌసులు ... ఆధునిక సేద్య కేంద్రాలు. మొక్కలకు వివిధ దశల్లో కావల్సిన వాతావరణాన్ని నిర్దేశించే ఉష్ణోగ్రత, కాంతి, ఆర్ధ్రతల నియంత్రణ కచ్చితమైన విధంగా సమకూర్చడానికి ఇవి బాగా దోహదపడతాయి. రక్షిత వాతవరణం (గ్రీన్ హౌస్)లో మొక్కల్ని పెంచినప్పుడు, వాటి చుట్టూ అనువుగా ఉండే సూక్ష్మ వాతావరణం ఏర్పడి, ఆరోగ్యరకంగా పెరుగుతాయి. వాతావరణాన్ని ఏమేరకు నియంత్రించే ఏర్పాట్లు ఉంటాయి అనే అంశం మీద ఆధారపడి, గ్రీన్‌హౌస్‌ల నాణ్యతను, ధరలను నిర్ణయిస్తారు. వీటిని ఎక్కువ ధర (పూర్తి నియంత్రణ), మధ్యస్థ ధర (పాక్షిక నియంత్రణ), తక్కువ ధర కలిగిన (నియంత్రణలేని) గ్రీన్ హౌస్‌లు అని మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. వీటి నిర్మాణం, యాజమాన్యం గురించి డాక్టర్ కృష్ణప్రియ ఇస్తున్న వివరాలను చూద్దాం.



గ్రీన్ హౌస్

నిర్మాణం-యాజమాన్యం

ఎక్కువ ధర గ్రీన్ హౌసుల్లో ఎగుమతికి అనువైన పూలు, కూరగాయలు, మొక్కలను కోరిన నాణ్యతలో పెంచవచ్చు. అయితే మన దేశంలో ఉన్న వివిధ వాతావరణ పరిస్థితులకు తక్కువ ధర గ్రీన్‌హౌస్‌లు, మధ్యస్థ ధర గ్రీన్ హౌస్‌లు ఎంతో అనువుగా ఉంటాయి.

గ్రీన్‌హౌస్‌లో మొక్కలు పెంచడం వల్ల ప్రయోజనాలు:

- గ్రీన్‌హౌస్‌లో ఉత్పాదకత ఎక్కువగా ఉండి, ఒక యూనిట్ విస్తీర్ణంలో దిగుబడి చాలా హెచ్చుగా ఉంటుంది.
- గ్రీన్‌హౌసుల్లో పెంచిన పూలు చాలా ఎక్కువ నాణ్యత కలిగి మచ్చలు, దెబ్బలు లేకుండా విదేశాల ఎగుమతికి అనుకూలంగా ఉంటాయి.
- గ్రీన్‌హౌసుల్లో పురుగులను, తెగుళ్ళను సులభంగా, సమర్థవంతంగా అరికట్టవచ్చు. సీజన్ కాని సమయంలోనూ గ్రీన్ హౌసుల్లో సాగు చేయవచ్చు.
- అత్యంత విలువైన అలంకార మొక్కల్ని రక్షిత వాతావరణంలో సులభంగా పెంచగలిగే వీలుంటుంది.

ఏఏ పంటలు అరుకూలం? : గ్రీన్‌హౌసుల్లో తక్కువ పరిమాణంలో విలువైన అలంకార మొక్కల్ని, కట్‌ఫ్లవర్స్‌గా ఉపయోగపడే మొక్కలను సాగు చేయాలి. గులాబీ, జెర్బెరా, కార్నేషన్, ఆంథూరియం, ఆర్కిడ్లు గ్రీన్‌హౌసుల్లో సాగుకు అనుకూలంగా ఉండే ప్రధానమైన పంటలు.

ప్లానింగ్, డిజైన్ : గ్రీన్‌హౌస్ నిర్మాణం ఆయా ప్రదేశం, పంటలను బట్టి నిర్ధిష్టంగా ఉంటుంది. గ్రీన్‌హౌస్ నిర్మాణం తగినంత బలంగానే కాకుండా మొక్కల పెరుగుదలకు అవసరమైనంత సూర్యకాంతి ప్రసరించేదిగా కూడా ఉండాలి.

స్థలం ఎంపిక : మురుగు నీటిని సులభంగా తీసి వేయడానికి అనువుగా ఉండే విధంగా వాలు ఉండాలి. వర్షపు నీరు గ్రీన్‌హౌస్‌లోకి ప్రవహించకూడదు. గ్రీన్‌హౌస్‌లో సాగు చేయడానికి సమృద్ధిగా మంచి నాణ్యమైన నీరు కొరత లేకుండా, విద్యుత్తు సరఫరా కూడా ఉండాలి. గ్రీన్‌హౌస్‌లు సూర్యరశ్మికి అంతరాయం లేకుండా బిల్డింగులకు, వృక్షాలకు దూరంగా నిర్మించాలి.

నిర్మించాల్సిన దిశ : సింగిల్ స్పాన్ గ్రీన్‌హౌస్‌లను ఏ దిశలోనైనా నిర్మించవచ్చు. అయితే మల్టీస్పాన్ గ్రీన్‌హౌస్‌లను ఉత్తర, దక్షిణ దిశలో ఉండేలా నిర్మించాలి. దీనివల్ల గ్రీన్‌హౌస్‌లోని నిర్మాణపు భాగాల వల్ల నీడ నిరంతరం ఒకే ప్రదేశంలో పడకుండా ఉంటుంది.

వివిధ భాగాలు : తక్కువ ధర గ్రీన్‌హౌస్‌లో నిర్మాణపు ఫ్రేమ్, పైకప్పు మాత్రమే ఉంటాయి. అయితే మధ్యస్థ ధర గ్రీన్‌హౌస్‌లో వీటితో బాటు వాతావరణాన్ని నియంత్రించే పరికరాలు (గాడ్జెట్స్) కూడా ఉంటాయి. దీనివల్ల వీటి నిర్మాణపు ఖర్చు పెరుగుతుంది. గ్రీన్‌హౌస్‌లో ఫ్రేమ్ దాదాపు 15 నుంచి 20 సంవత్సరాలు, పైకప్పు 3-6 సంవత్సరాలు, కంట్రోల్ లేదా మోనటరింగ్ పరికరాలు 5 నుంచి 10 సంవత్సరాలు, వినియోగించిన వస్తువు నాణ్యత, యాజమాన్యాన్ని బట్టి మన్నుతాయి.

నిర్మాణ రకాలు : సాధారణంగా గ్రీన్‌హౌస్ నిర్మాణంలో రెండు రకాలున్నాయి. మొదటి రకం సింగిల్ స్పాన్ గ్రీన్‌హౌస్. ఇది విడిగా ప్రత్యేకంగా ఉంటుంది. వీటిని స్క్వాన్సెట్, గోథిక్, గేబుల్ డోమ్ మొదలైన అనేక ఆకారాల్లో నిర్మిస్తారు. వీటిని 100 నుంచి 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించవచ్చు. మల్టీస్పాన్ లేక రిడ్జి అండ్ ఫర్రో లేక గట్టర్లతో అనుసంధానం చేసిన గ్రీన్‌హౌస్‌లు పెద్దవిగా ఉండి, ఒకే రకమైన వాతావరణాన్ని కోరుకునే పంటల్ని లాభసాటిగా సాగు చేయవచ్చు.

గ్రీన్‌హౌస్‌ల నిర్మాణం

ఫ్రేమ్‌ను ఫాబ్రికేట్ చేయటం : నిర్మాణం సైజు, మన్నికలను బట్టి ఖర్చును తగ్గంచటానికి మైల్డ్ స్టీలు లేదా గెల్వనైజ్డ్ ఐరన్ పైపులను (0.5 -1.5 అంగుళాల వ్యాసం గలవి) నిర్మాణం ఫ్రేమ్ కోసం వాడాలి. ఇవి అల్యూమినియం యాంగిల్స్ లేక పెద్ద కొలతలు గల పైపులు కంటే చౌకగా లభిస్తాయి. 100 చ.మీ. విస్తీర్ణంలో నిర్మించిన పాలిహౌస్ యూనిట్ మొక్కల పెరుగుదలకి, వాణిజ్య సరళిలో పూలసాగు చేపట్టడానికి కనీసం 300 నుంచి 500 విస్తీర్ణంలో నిర్మించిన పాలీహౌస్‌కు అనుకూలంగా ఉంటుంది. తక్కువ ధరలో నిర్మించే గ్రీన్‌హౌస్‌లో పెంచే మొక్కలకు కావలసిన ఉష్ణోగ్రతను వెంటిలేటర్లను ఏర్పరిచి, సహజసిద్ధంగా జరిగేలా ఏర్పాటు చేస్తారు. కాబట్టి నిర్మాణం మధ్య ఎత్తు కనీసం 3.5 మీటర్లు, 500 చ.మీ. ఉంటుంది. ఆపైన విస్తీర్ణమున్న గ్రీన్‌హౌస్‌లో కనీసం 5-7 మీటర్ల ఎత్తు మధ్యన ఉండేలా, నిర్మాణపు పైభాగాన వెంటిలేటర్లను ఏర్పాటు చేయాలి.

పైకప్పు/ ఫ్రేమ్ క్లాడింగ్ : నిర్మాణం పైకప్పుగా 200 మైక్రాన్ల (800 గేజ్) మందం గల పాలియిథలిన్ ఫిల్మ్ లేదా అతినీలలోహిత కిరణాలను స్థిరీకరించే (యు.వి. స్టెబిలైజ్డ్) ఫిల్మ్‌ను గానీ వాడవచ్చు. వీటి ధర చదరపు మీటరుకు 25-30 రూపాయల వరకు ఉంటుంది. ఫైబర్ గ్లాస్ దాదాపు చ.మీ. 300-500 రూపాయల వరకూ ఉంటుంది.

వాతావరణాన్ని నియంత్రించే పద్ధతి : వివిధ పరికరాలు ఏర్పాటు లేకుండా సహజంగా ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి సరిపడినంత వెంటిలేషన్ (60-70 శాతం) కోసం నిర్మాణపు పక్కల 40-60 మెష్‌రాంబో నెట్టును అమర్చాలి. దీనిపై అవసరాన్ని బట్టి మూసి వేయడానికి అనువుగా, పైకి చుట్టడానికి అవకాశం ఉండేలా పాలిథిన్ ఫిల్మ్ కూడా ఏర్పాటు చేయాలి. మధ్యస్థర గ్రీన్‌హౌసుల్లో సహజసిద్ధంగా వెంటిలేషన్ బదులుగా ఎవపరేటివ్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. దీనికోసం సెల్పాడ్స్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లను ఉపయోగించాలి.

గ్రీన్‌హౌస్‌ల యాజమాన్యం : గ్రీన్‌హౌస్‌లో ఉష్ణోగ్రతను సిఫార్సు చేసిన స్థాయిలో ఉండేలా నియంత్రించాలి. గ్రీన్‌హౌస్‌లోని గాలి ఉష్ణోగ్రతలు పంట తట్టుకోలేని స్థాయికి పెరిగినప్పుడు చల్లబర్చి తగ్గించాలి.

వెంటిలేషన్

సహజ వెంటిలేషన్ పద్ధతి : ఈ పద్ధతిలో గ్రీన్‌హౌస్‌లు తగినంత ఖాళీ ప్రదేశం ఉండేలా ఏర్పాటు చేయాలి. బయట వాతావరణంలోని గాలి లోపలికి ప్రవేశించి, గ్రీన్‌హౌసుల్లో ఉన్న గాలి సమాన పరిమాణంలో బయటికి నెట్టబడేలా చేయాలి. గ్రీన్‌హౌస్‌లోని గాలి సహజంగా లోపలి గాలి, బయటి గాలికి గల ఉష్ణోగ్రతల తేడాల వల్ల బయటికి నెట్టబడుతుంది. గాలి కదలిక కూడా దీనికి దోహదపడుతుంది. సహజంగా వెంటిలేషన్ జరగడానికి 20-50 శాతం ఫ్లోర్ ఏరియా రంధ్రాలు నిర్మాణంలో ఉండాలి.



కృత్రిమ (ఫోర్స్డ్) వెంటిలేషన్ : ఈ పద్ధతిలో గ్రీన్‌హౌస్‌లోని గాలి కదలికను పవర్ ద్వారా చేస్తారు. దీనికోసం ఫ్యాను, లోవర్స్, వెంట్స్ ఉంటాయి. లోవర్స్ మనుషుల ద్వారా లేదా మోటార్ల ద్వారా పనిచేస్తాయి. మోటార్ల ద్వారా పనిచేసే రోవర్లు అనుకోకుండా పెనుగాలులు వీచే సమయంలో గ్రీన్‌హౌస్ నిర్మాణాన్ని రక్షించుకోవడానికి ఉపయోగపడతాయి.

ఎగ్జాస్ట్ వెంటిలేషన్ : ఈ సిస్టమ్‌లో ఇన్‌లెట్లు ఎక్కువ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమైన విషయం. సింగిల్ స్పాన్ గ్రీన్‌హౌస్‌లో గాలి ప్రయాణపు దూరం 30 మీటర్లు, మల్టి-బే హౌస్‌లో 60 మీటర్ల వరకు ఉండాలి. ఫ్యాన్లకు ఒకవైపు చివర బిగించి, ఇన్‌లెట్లను మరో వైపు చివర అమర్చాలి.

రూఫ్ షేడింగ్ : గ్రీన్‌హౌసులో ప్రసరించే సూర్యకాంతి శక్తిని గ్లేజింగ్‌పై అపారదర్శక పదార్థాలను వాడిగానీ, గ్లేజింగ్‌పై కర్ర లేదా అల్యూమినియం లాథ్ అమర్చి గానీ, తగ్గించవచ్చు. దీనికోసం వాణిజ్యపరంగా తయారుచేసిన షేడింగ్ కాంపౌండ్ లేదా రంగులతో తయారుచేసిన మిశ్రమ పదార్థాలను ఉపయోగించవచ్చు.

- 1.0 కిలో వైట్ లెడ్, జింక్, టీలానియం పైంట్, 1.0 కిలో వెటెనింగ్, 4 1/2 స్పూన్ల లిన్సీడ్ ఆయిల్, 8 లీటర్ల గాసోలిన్ లేదా పెయింట్స్ నాఫా (అగ్నిప్రమాదాన్ని అరికట్టడానికి).
- 2.25 కె.జి. వైట్‌లెడ్, 4 టీస్పూన్ల లిన్సీడ్ ఆయిల్, 7.5 లీటర్ల గాసోలిన్ లేదా పెయింటర్స్ నాప్తా.
- తెల్లని కాంపౌండ్స్ ఎక్కువ సూర్యకాంతిని పరావర్తనం చేస్తాయి (83 శాతం). ఆకుపచ్చ రంగు 43 శాతం, నీలం, ఊదా రంగులు 25 శాతం సూర్యకాంతిని మాత్రమే పరావర్తనం చెందేలా చేస్తాయి. కాబట్టి తెలుపు రంగును ఎక్కువగా వాడతారు.

లాడ్ షేడ్స్ : షేడింగ్ కాంపౌండ్‌ల కంటే కర్ర లేదా అల్యూమినియంతో చేసినవి అనువుగా ఉంటాయి. కానీ ధర ఎక్కువగా ఉంటుంది. షేడింగ్ కాంపౌండ్లు లాథ్‌ల కంటే కొంచెం తక్కువ సామర్థ్యం కలిగి ఉంటాయి. షేడింగ్ కాంపౌండ్లు సౌరశక్తిని చాలా వరకు పరావర్తనం చేసినప్పటికీ, కొంత ఇవి వాహకాలుగా పనిచేసి, కొంతభాగం గ్రహిస్తాయి. పేడింగ్ గ్లాస్ కంటే లాథ్ కవర్లు ఎక్కువ చల్లదనాన్ని ఇస్తాయి.

ఎవాపొరేటివ్ కూలింగ్ ఫ్యాను, పాడ్ సిస్టమ్ : ఫ్యాన్, పాడ్ కూలింగ్ సిస్టమ్‌లో పెద్ద ఫ్యాన్లు, ఎప్పుడూ తడిగా ఉండే కచ్చితమైన సైజులో బిగించిన పాడ్ ఉంటాయి. ఇవి రెండింటిని గ్రీన్‌హౌస్ ప్లానింగ్ ప్రకారం సరైన చోట అమర్చుతారు. ఫ్యాను గ్రీన్‌హౌస్‌లోని గాలిని బయటకు పంపిస్తుంది. దీనివల్ల గ్రీన్‌హౌస్‌లో కొద్దిగా శూన్యం లేక వ్యతిరేక పీడనం ఏర్పడుతుంది. కొద్దిగా ఏర్పడిన శూన్యం ఫ్యాన్లకు అభిముఖంగా మరో అంచున బిగించిన పాడ్ నుండి లోపలికి గాలిని లాగుతుంది. దీనివల్ల చల్లని గాలి లోపలికి మృదువుగా ప్రవేశించి, మొక్కలు పెరుగుతున్న ప్రదేశంపై కదులుతూ వేడిని గ్రహిస్తుంది. ఈ వేడిగాలి ఫ్యాన్ల ద్వారా తిరిగి బయటకు లాగబడుతుంది. హీట్ సిస్టమ్‌కు తగినంత ఫ్లో స్థలం ఉండాలి. దీనివల్ల ఉష్ణాన్ని గ్రహించడానికి తగిన పరిమాణంలో ప్రవేశించడానికి అవకాశం ఏర్పడుతుంది. పాడ్‌లో తడిచే పీచు పదార్థం, ప్రత్యేకమైన సెల్యులోజ్‌తో అరలు కలిగి ఉండేలా తయారు చేయబడి ఉంటుంది. నీటిలో తడుపుతూ దీనిని ఎప్పుడూ తడిగా ఉంచాలి. నీటిని తిరిగి పంపిణీ చేయాలి. ఇది గ్రీన్‌హౌస్‌లో ప్రవేశించే గాలిని చల్లబర్చుతుంది.

ఫ్యాన్, పాడ్ పద్ధతుల్లో కొంత శూన్యం ఏర్పడుతుంది. కనుక గ్రీన్‌హౌస్‌ను గాలి చొరబడకుండా ఉండేలా నిర్మించాలి. తగిన విధంగా మరమ్మతులు చేయాలి. తలుపులను, తెరిచిన ప్రదేశాలను మూసివేసి, బయటి నుంచి వేడిగాలి లోపలికి ప్రవేశించకుండా జాగ్రత్త పడాలి. లోపలికి పాడ్ ద్వారా ప్రవేశించిన గాలి, వేడిని గ్రహించి వెచ్చబడుతుంది. గాలి ప్రసరణ పెంచి, గాలి లేదా కాంతి తీవ్రతను తగ్గించి, వేడిని తగ్గించవచ్చు.

నీరు కట్టుట, పోషణ : గ్రీన్‌హౌస్‌లో పెంచే పంటకు నీటి అవసరం బయటి వాతావరణంలో పెరిగే పంట కంటే తక్కువగా ఉంటుంది. డ్రిప్ పద్ధతి లేదా మైక్రో స్ప్రింక్లర్ల ద్వారా గ్రీన్‌హౌస్‌లో నీరు పెట్టాలి. దీనివల్ల నీరు బాగా ఆదా అవడమే కాకుండా, పంటకు వివిధ దశల్లో అవసరమైనంత తేమ ఉండేలా నీరు పెట్టి పంట పెరుగుదల దిగుబడి, నాణ్యతలని పెంచవచ్చు.

గ్రీన్‌హౌస్‌లో పూర్తిగా లేదా పాక్షికంగా వాతావరణాన్ని నియంత్రిస్తాం. కనుక మొక్కలు అత్యధిక ఉత్పాదక శక్తి కలిగి ఎక్కువ దిగుబడినిస్తాయి. కాబట్టి ఫెర్టిగేషన్ ద్వారా పంటను బట్టి, తగిన పరిమాణంలో సమతుల పోషకాలను ఇవ్వాలి. ఫెర్టిగేషన్ పద్ధతిలో ఎరువులు ఆదా అవడమే కాకుండా కూలీ (లేబరు) ఖర్చు తగ్గుతుంది. ఈ పద్ధతిలో వాడే ఎరువులు నీటిలో పూర్తిగా కరిగిపోవాలి. వెంచురీ ద్వారా లేదా ఫెర్టిలైజర్ పంపు ద్వారా గానీ సిస్టమ్‌లోకి పంపాలి. గ్రీన్‌హౌస్‌లోని పంటకు మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల వీటి చుట్టూ ఉన్న సూక్ష్మ వాతావరణం పురుగులు, శిలీంధ్రాలు ఒక సారి లోపల ప్రవేశిస్తూ, త్వరగా అభివృద్ధి చెందడానికి అనుకూలంగా ఉంటుంది. కాబట్టి వీటి ప్రవేశానికి ఆస్కారం లేకుండా నిర్మూలనకు అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్ ఎన్. కృష్ణప్రియ, సైంటిస్ట్
డాక్టర్ ఎస్.ఎం.ఎం.మునీంద్ర నాయుడు,
ప్రోగ్రాం కో ఆర్డినేటర్
కృషి విజ్ఞానకేంద్రం, నెల్లూరు





చిన్నారి

చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కన ఉన్న చిత్రంలో చుక్కలను కలిపి, ఆ బొమ్మేంటో కనుక్కోండి!

స్వచ్ఛభారత్‌పై ప్రచార చిత్రం



అది శనివారం. క్లాసులో లంచ్ బ్రేక్ అయ్యింది. నేను నా స్నేహితులు జి.పవన్, టి.ఛత్రీస్, డి.సాయిచైతన్య, జి.బాలకృష్ణ అందరం అనుకున్నాం, ఎలా అయినా ఆదివారం సినిమా షూట్ చేయాలని. ఆదివారం వచ్చింది. అందరం సంతోషంలో ఉన్నాం. అయితే బాలకృష్ణ షూటింగ్‌కి రాలేకపోయాడు. వాడి బదులు ఎస్.అభిరాం వచ్చాడు. అందరం పలాస జి.జె కాలేజీ గ్రౌండులో షూటింగ్ చేసుకుని, పలాస మున్సిపల్ ఆఫీస్‌లో షూటింగ్ మొదలుపెట్టాం. అక్కడి సిబ్బంది కూడా మేము షూటింగ్ చేసుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అక్కడ స్వచ్ఛ్ భారత్ వ్యాన్ కూడా ఉంది. అది చూసి మాకు ఒక ఆలోచన వచ్చింది. అక్కడ మేం ప్రజలకు మా తరపున మున్సిపల్ ఆఫీస్ తరుపున స్వచ్ఛభారత్ గురించి ప్రచారం చేశాం. అంతే! వారంతా మా చుట్టూ చేరి ప్రశంసలతో ముంచేశారు. అది పేపర్లో వేయించమని వారే మాకు సలహా ఇచ్చారు. అలా మేము ఆదివారం రోజున చేసిన సినిమా షూటింగ్ ఎంతో సంతోషాన్నిచ్చింది



డబ్బీరు శ్రీరాజ్ పట్నాయక్
7వ తరగతి,
శ్రీ గురుకుల విద్యాలయం,
ఇంగ్లీష్ మీడియం హైస్కూల్,
పలాస.

దారి చూపండి!




పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చేపకు అక్వేరియం లోకి వెళ్ళే దారిని చూపండి!

పొడుపు కథలు

చీకటి పడక ముందే ఇంటికి చేరాలనే తొందరేం లేదు. రాత్రయినా.. పగలయినా.. చేత దీపం పట్టుకొని తిరుగుతుంది.

జవాబు : మిణుగురు పురుగు




జోక్:

తల్లి : ఇవాళ బడిలో ఏం నేర్చుకున్నావ్ ?
కొడుకు : రాయడం నేర్పించారు.
తల్లి : ఏం రాశావో చదువు?
కొడుకు : ఏమో ! ఇంకా చదవటం నేర్పలేదు అమ్మా!

నేను గీసిన బొమ్మ



ఇ. స్నేహిత,
3వ తరగతి,
సిస్టర్స్ స్టానిష్‌లాస్,
ఇంగ్లీష్ స్కూల్,
కర్నూలు



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com



రోడ్రిగ్స్ (81 నాటౌట్)



మంధాన 105 పరుగులు

తొలి వన్డేలో కివీస్‌ను భారత మహిళాజట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఓడించి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. పురుషుల జట్టు కివీస్‌పై గెలిచి 24 గంటలు గడవకముందే మహిళా జట్టు గెలుపుతో శుభారంభం చేసింది. ఓవైపు దూసుకుపోయే బౌన్సర్లతో కివీస్ బాట్స్‌ఉమెన్‌ను హడలెత్తించి మరోవైపు మంధాన, రోడ్రిగ్స్ అద్భుత భాగస్వామ్యంతో... మొత్తానికి క్రికెట్‌లో పురుషుల జట్టుకు 'మేమేం తీసిపోం' అని మరోసారి మహిళలు నిరూపించారు.

మంధాన మెరుపులు

- తొలి వన్డేలో కివీస్‌పై ఘన విజయం
- సత్తా చాటిన ఏక్తా, పూనమ్

నేపియర్ : న్యూజిలాండ్ మహిళలతో గురువారం జరిగిన తొలి వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. న్యూజిలాండ్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని భారత మహిళలు 33 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. దీంతో టీమిండియా జట్టు ఐదు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. భారత ఓపెనర్లు స్మృతి మంధాన(105) శతకంతో చెలరేగగా, జమీమా రోడ్రిగ్స్(81 నాటౌట్) అర్ధసెంచరీతో అకట్టుకుంది. ఈ జోడీ తొలి వికెట్‌కు 190 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించింది. న్యూజిలాండ్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మంధాన, రోడ్రిగ్స్‌లు ధాటిగా బ్యాటింగ్ చేసి న్యూజిలాండ్ బౌలర్లను చీల్చి చెండాడి స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించారు. అయితే చివర్లో విజయానికి మూడు పరుగుల దూరంలో మంధాన భారీ షాట్‌కు యత్నించి పెవిలియన్ చేరింది. తరువాత వచ్చిన దీప్తి శర్మ ఖాతాను తెరవకుండానే చివరి పరుగు వైడ్ రూపంలో రావడంతో టీమిండియా వికెట్ నష్టపోయి 33 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌లో బోణీ కొట్టింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టు ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్‌ల దెబ్బకు 48.4 ఓవర్లలో 192 పరుగులకే చేతులెత్తేసింది. న్యూజిలాండ్ ఓపెనర్లు సుజీ బేట్స్(36), సోఫీ డివైన్(28)లు శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించిన తర్వాత సోఫీ డివైన్ పెవిలియన్ చేరింది. ఆపై ఫస్ట్ డౌన్‌లో వచ్చిన లారెన్ డౌన్ డకౌట్ కాగా, కాసేపటికే సుజీ బేట్స్ కూడా పెవిలియన్ బాట పట్టడంతో కివీస్ 70 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అటు తర్వాత సాటెర్‌వైట్(31), అమీలా కెర్(28)లు 49 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించడంతో కివీస్ తేరుకుంది. వీరిద్దరూ 17 పరుగుల వ్యవధిలో ఔట్ కావడంతో మళ్లీ కివీస్ పరిస్థితి మొదటికొచ్చింది. చివర్లో హనహ్ రోవ్(25) ఫర్వాలేదనిపించారు. ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్‌లు తలా మూడు, దీప్తి శర్మ రెండు వికెట్లతో రాణించింది. శతకంతో మెరిసిన స్మృతి మంధానకు ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది.

స్కోర్ బోర్డు

కివీస్ ఇన్నింగ్స్ : బేట్స్ (సి)గోస్వామి(బి)శర్మ 36, డివైన్ (రనౌట్)శర్మ 28, డౌన్ (స్టంప్) భాటియా(బి) పూనమ్ 0, సాటెర్‌వైట్ (సి)రోడ్రిగ్స్(బి)పూనమ్ 31, కెర్ (సి)హేమలత(బి)పూనమ్ 28, గ్రీన్ (బి) ఏక్తా 10, బెజ్వేనవుట్ (స్టంప్) భాటియా (బి)శర్మ 9, హుడ్డీస్టన్ (సి)కౌర్ (బి)పాండే 10, తహుహు(నాటౌట్)4 అదనం 5 (మొత్తం 48.4 ఓవర్లలో 192 పరుగులు)

బౌలింగ్ : గోస్వామి 10-0-41-0, పాండే 7.4-1-38-1, ఏక్తా 9-0-32-3, దీప్తి 10-0-42-3, హేమలత 2-0-11-0.

భారత్ ఇన్నింగ్స్ : రోడ్రిగ్స్ (నాటౌట్) 81, మంధాన (సి)తహుహు(బి)కెర్ 105, దీప్తి (నాటౌట్) 0. అదనం 7 (మొత్తం 33 ఓవర్లలో వికెట్ నష్టానికి 193 పరుగులు)

బౌలింగ్ : తహుహు 5-0-34-0. రోయ్ 5-0-29-0. హుడిల్‌స్టన్ 3-0-22-0. కాస్పెర్క్ 7-0-37-0. కెర్ 6-0-33-1. డివైన్ 3-0-14-0. సాటెర్‌వైట్ 4-0-22-0.

నిప్పులు చెరిగిన ఉమేష్

కేరళ 106 ఆలౌట్ - విధర్భతో రంజీ సెమీస్



వయనాడ్ : రంజీట్రోఫీ సెమీఫైనల్ పోటీల్లో భాగంగా విధర్భ బౌలర్ ఉమేష్ యాదవ్ నిప్పులు చెరిగే బౌలింగ్ చేశాడు. దీంతో కేరళ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే పరిమితమైంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 28.4 ఓవర్లలోనే తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. ఉమేష్ 12 ఓవర్లలో 48 పరుగులిచ్చి ఏడు వికెట్లతో సత్తా చాటాడు. గుర్బానీ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన విధర్భ ఐదు వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఫజల్ 75, వసీం జాఫర్ 34 పరుగులు చేయగా, వారియర్, నిధేష్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. మరో సెమీస్ పోరులో కర్ణాటక జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది.

శ్రీలంక ఢమాల్

ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్

బ్రిస్బేన్ : ఆస్ట్రేలియా-శ్రీలంక జట్ల మధ్య గురువారం నుండి ప్రారంభమైన తొలిటెస్ట్‌లో లంక జట్టు తొలి ఇన్నింగ్‌సలో 144 పరుగులకే పరిమితమైంది. వికెట్ కీపర్ డిక్వెల్లా 64, కరుణరత్నే 24 పరుగులు చేయగా, కమ్మిన్స్‌కు నాలుగు, రిచర్డ్సన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా జట్టు తొలిరోజు ఆటముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. హ్యారీస్ 40, లియాన్ 0 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.

జూనియర్ ర్యాంకింగ్స్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

(ప్రజాశక్తి-స్పోర్ట్స్‌డెస్క్)

విజయవాడ క్లబ్‌లో యోనెక్స్ సన్రైజ్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన విజయవాడ ఎంపి కేశినేని నాని, రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ అంధ్రప్రదేశ్ ఛైర్మన్ అంకమ్మ చౌదరి ఈ పోటీలను ప్రారంభించారు. అండర్-19 విభాగంలో శరత్ (ఆంధ్రప్రదేశ్) 21-12, 21-15 తేడాతో మహ్మద్ (తమిళనాడు)పై వరుస సెట్లలో గెలిచాడు. మరో మ్యాచ్‌లో హర్ష జెట్టి (అంధ్రప్రదేశ్) 21-18, 21-11 తేడాతో శశిధర్(ఆంధ్రప్రదేశ్)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్ అండర్-19లో రష్మిత(ఆంధ్రప్రదేశ్) 11-21, 21-15, 21-15తేడాతో తనిష్క (మహారాష్ట్ర)పై, వర్షిత (అంధ్రప్రదశ్) 21-10, 20-22, 21-7 తేడాతో మేఘ (ఆంధ్రప్రదేశ్)పై గెలిచింది. బాలుర డబుల్స్‌లో చరణ్ నాయక్ (ఆంధ్రప్రదేశ్)-భార్గవ్ (కర్ణాటక)జోడీ 21-17, 21-6 తేడాతో విజయ్-హర్ష జెట్టి(ఆంధ్రప్రదేశ్)పై గెలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆంధ్రా షట్లర్లు నిరాశపరిచారు.



ఒసాకా

క్విటోవా

ఛాంపియన్ ఎవరు?

మహిళల సింగిల్స్ ఫైనల్లో ఒసాకా, క్విటోవా

తుదిపోరుకు నాదల్ కూడా..



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్ పోరుకు మెల్‌బోర్న్ పార్క్‌లో రంగం సిద్ధమైంది. ఫైనల్లో ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా(చెక్ రిపబ్లిక్), నాలుగో సీడ్ నవోమి ఒసాకా(జపాన్) అమీతుమీ తేల్చుకోనున్నారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వీరిద్దరూ తొలిసారి ఫైనల్‌కు చేరుకున్నారు. ఫలితంగా కొత్త ఏడాదిలో టైటిల్ నెగ్గాలని ఇద్దరూ తహతహలాడుతున్నారు. తొలి సెమీఫైనల్‌లో క్విటోవా 7-6(7/2), 6-0 తేడాతో అన్ సీడెడ్ క్రీడాకారిణి డానియెల్లీ కొలిన్స్(అమెరికా)పై విజయం సాధించగా... రెండో సెమీఫైనల్లో జపాన్ క్రీడాకారిణి ఒసాకా 6-2, 4-6, 6-4 తేడాతో కరోలినా ప్లిస్కోవా(చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. దీంతో వీరిద్దరూ శనివారం జరిగే ఫైనల్ సమరంలో తలపడనున్నారు. క్విటోవా 2011, 2014లో రెండుసార్లు వింబుల్డన్ సింగిల్స్ విజేతగా నిలిచింది. ఒసాకా గత ఏడాది యుఎస్ ఓపెన్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. దీంతో ఆస్ట్రేలియా ఓపెన్‌ను వీరిద్దరిలో ఎవరు గెలిచినా సరికొత్త చరిత్ర సృష్టించనున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్లో స్పెయిన్ బుల్, రెండోసీడ్ రఫెల్ నాదల్ 6-2, 6-4, 6-0 సెట్ల తేడాతో 14వ సీడ్ సిట్సిపన్(గ్రీస్)ను చిత్తుచేసి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్, సైనా



జకార్తా : భారత స్టార్ షట్లర్లు పివి సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్‌లు ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండోరౌండ్ పోటీలో రెండోసీడ్ సింధు 23-21, 21-7 తేడాతో గ్రెగోరియా మరిస్కా (ఇండోనేషియా)పై గెలిచింది. కేవలం 37 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలిరౌండ్‌లో పోరాడి గెలవగా, రెండో గేమ్‌లో తన అనుభవాన్ని ఉపయోగించి అవలీలగా నెగ్గింది. క్వార్టర్స్‌లో కరోలినా మారిన్(స్పెయిన్)తో సింధు తలపడే అవకాశం వుంది. మరో మ్యాచ్‌లో సైనా నెహ్వాల్ 21-17, 21-15 తేడాతో ఫిట్రాయ్‌ని (ఇండోనేషియా)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ కిదాంబి శ్రీకాంత్ 21-14, 21-9 తేడాతో కెంటో నిషిమోటో(జపాన్)పై విజయం సాధించాడు. తొలిగేమ్‌ను 21-14తో గెలిచిన శ్రీకాంత్, రెండో గేమ్‌లో పెద్దగా కష్టపడకుండానే 21-9 తేడాతో సొంతం చేసుకోవడం విశేషం. డబుల్స్ విభాగంలో తొలిరౌండ్‌లో గెలిచిన మను అత్రి-సుమీత్ జోడి 14-21, 21-17, 10-21 కిమ్ అసిరుప్-రస్మసేన్(డెన్మార్క్) చేతిలో ఓడి నిరాశపరిచారు.

ఆంధ్ర, కేరళ మ్యాచ్ డ్రా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



అండర్-19 కూచ్ బిహర్ ట్రోఫీలో భాగంగా ఒంగోలు సిఎస్ఆర్ శర్మ కళాశాల క్రీడామైదానంలో ఆంధ్ర, కేరళ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రా అయింది. ఓవర్ నైట్ స్కోరు 142/5తో చివరి రోజు ఆట ప్రారంభించిన కేరళ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 313 పరుగులకు ఆలౌట్ అయింది. కేరళ కెప్టెన్ వత్సల్ గోవింద్ 116 (268 బంతుల్లో; 14 ఫోర్లు) పరుగులతో టోర్నీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. ఇతనికి తోడు నిఖిల్ టి 65(162 బంతుల్లో; 9 ఫోర్లు) పరుగులు, మోహిత్ శిబు 41(29 బంతుల్లో; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఆంధ్ర బౌలర్‌లలో బి.సంతోష్ కుమార్ 63 పరుగులిచ్చి 4 వికెట్లు, ఏ.ప్రణయ్ కుమార్ 47 పరుగులిచ్చి 3 వికెట్లు, సాయి కార్తీక్ రావు 81 పరుగులిచ్చి 3 వికెట్లు సాధించారు. కేరళ జట్టు ఆంధ్రకి 318 (తొలి ఇన్నింగ్స్‌లో 4 పరుగుల ఆధిక్యం) పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆంధ్ర జట్టు 21 ఓవర్‌లలో 2 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ టి.వంశీకృష్ణ 33 (31 బంతుల్లో; 5 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు, ఎం.హర్షవర్ధన్ 44(46 బంతుల్లో; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన కేరళ జట్టుకి 3 పాయింట్లు, ఆంధ్ర జట్టుకి 1 పాయింట్ దక్కింది. ఆంధ్ర, కేరళ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కి చేరాయి.

పాండ్యా, రాహుల్‌కు ఊరట

సస్పెన్షన్‌ను ఎత్తివేసిన పాలక కమిటీ



ముంబయి : హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లకు ఊరట లభించింది. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను వీరిపై వేటుపడిన విషయం తెలిసిందే. వీరిద్దరిపై సస్పెన్షన్ విధించడం సరైంది కాదంటూ గతవారం బిసిసిఐ అధ్యక్షుడు సీకే ఖన్నా పాలకుల కమిటీకి లేఖ రాశారు. యువ క్రికెటర్లు చేసిన పొరపాటుకు ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నారని, ఇకవారికి ప్రత్యేకంగా శిక్షేమీ అవసరం లేదంటూ ఆయన సీఓఏకు వివరించారు. ఈ దశలో వారిపై వేటు వేయడం వల్ల టీమిండియా ఖ్యాతికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఖన్నా అభిప్రాయపడ్డారు. దీంతో పాలకుల కమిటీ(సీఓఏ) ఈ ఇద్దరిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తి వేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. కానీ ఈ వివాదంపై జరుగుతున్న విచారణను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. సస్పెన్షన్ ఎత్తివేసిన నేపథ్యంలో పాండ్యా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే అవకాశముంది.

విండీస్ 289 ఆలౌట్

బార్బొడస్ : వెస్టిండీస్ పర్యటనలో భాగంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో ఆతిథ్య కరేబియన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 289 పరుగులకే పరిమితమైంది. ఓవర్‌నైట్ స్కోర్ ఎనిమిది వికెట్ల నష్టానికి 273 పరుగులతో గురువారం ఇన్నింగ్స్‌ను కొనసాగించి మరో 16 పరుగులు మాత్రమే జోడించి రెండు వికెట్లు కోల్పోయింది. హోప్(57), ఛేస్ (54), హెట్‌మెయిర్(81) అర్ధసెంచరీలతో రాణించారు. ఇంగ్లాండ్ పేస్ బౌలర్ అండర్సన్ ఐదు, స్టోక్స్ నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ రెండోరోజు భోజన విరామ సమయానికి 11 ఓవర్లలో 30 పరుగులు చేసి జెన్నింగ్స్(17) వికెట్‌ను కోల్పోయింది. సుదీర్ఘ పర్యటనలో భాగంగా ఇంగ్లాండ్ జట్టు మూడు టెస్ట్, ఐదు వన్డేలతోపాటు మరో మూడు టీ20 పోటీల్లో వెస్టిండీస్ జట్టుతో తలపడనుంది.

క్రికెట్‌కు బోథా గుడ్‌బై



హోబార్ట్ : దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జోహాన్ బోథా అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఈ మేరకు అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు గురువారం ప్రకటించాడు. బిగ్‌బాష్ లీగ్(బీబీఎల్)లో భాగంగా హోబార్ట్ హరికేన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన బోథా బుధవారం సిడ్నీ సిక్సర్స్‌తో మ్యాచ్ తర్వాత తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. ఈ మ్యాచ్‌లో బోథాకు ఒక్క వికెట్ కూడా దక్కలేదు. దాంతో క్రికెట్‌కు వీడ్కోలు చెప్పే సమయం ఆసన్నమైందని భావించిన 36 ఏళ్ల బోథా ఉన్నపళంగా రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. 2005 నుంచి 2012 వరకూ దక్షిణాఫ్రికా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన బోథా 78 వన్డేలు, 40 టీ20, 5 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. 10 వన్డేల్లో సఫారీజట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. 2009లో బోథా నేతృత్వంలోని దక్షిణాఫ్రికా జట్టు నంబర్‌వన్ ర్యాంకును సొంతం చేసుకుంది.

మాతా శిశు సంరక్షణపై సంతృప్తి తక్కువే!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాతా శిశు మరణాల రేటును తగ్గించామని, ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని ప్రభుత్వం చెబుతోంది. కానీ మాతా శిశు సంరక్షణలో ప్రజలలో సంతృప్తి స్థాయి నామమాత్రంగానే ఉంది. వివిధ వైద్యఆరోగ్య సేవలైన 108, చంద్రన్న సంచార చికిత్స, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ తదితర సేవలపై 75 శాతం పైగా ప్రజా సంతృప్తి నమోదవగా, మాతా శిశు సంరక్షణపై 55.7 శాతంగానే సంతృప్తి స్థాయి నమోదైంది. లబ్ధిదారులకు మాతా శిశు సంరక్షణ కార్డులు ఇవ్వకపోవడం వల్లే అసంతృప్తి పెరిగినట్లు ఆర్టీజీ సర్వేలో వెల్లడయింది. గర్భ నిర్ధారణ జరిగినప్పటి నుంచి కాన్పు వరకు గర్భిణికి అందించే అన్ని రకాల వైద్యఆరోగ్య సేవలు, పరీక్షలు, తదితర సేవలన్నీ మాతా శిశు సంరక్షణ కార్డులోనే నమోదు చేస్తారు. కానీ ఈ కార్డులు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ఇవ్వడంలేదు. ఇక 'ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పిఎమ్‌ఎమ్‌వివై)' పథకాన్ని రాష్ట్రంలో 'తల్లి బిడ్డ చల్లగా' పేరుతో అమలు చేస్తున్నారు. ఈ పథకాన్ని ఉత్తమంగా అమలు చేస్తున్నందుకుగాను ఇటీవల కేంద్రం కూడా రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖకు అవార్డును అందజేసింది. కానీ దీనిపై ప్రజలలో దాదాపు 32 శాతం అసంతృపి ఉంది. జిల్లాలవారీగా చూస్తే విశాఖలో అత్యధికంగా యాభై శాతం, ప్రకాశంలో 42 శాతం, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 40 శాతం మంది ఈ పథకం సరిగా అమలు కావడంలేదని సర్వేలో తెలిపారు.

మరో మారు రైతన్నల పోరు బాట



మూడు సంఘాల ఆధ్వర్యంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు ధర్నా

కార్మిక, కర్షక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ధర్నాలకు పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల మద్ధతు

ఎఐకెఎస్ నేతలు హన్నన్ మొల్లా, దావలే వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా వ్యతిరేక మోడీ సర్కార్‌పై రైతులు, మాజీ సైనికులు, యువత, దళితులు, ఆదివాసీలు పోరు బాట పట్టారు. వివిధ వర్గాల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయా సంఘాలు డిమాండ్ చేశాయి. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బిజెపి సర్కారు తక్షణమే దృష్టి సారించాలని అఖిల భారత కిసాన్ సభ(ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. అన్నదాతలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, హన్నన్ మొల్లా ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రైతు పండించిన పంటలకు ధర నిర్ణయించే హక్కు బిల్లు, రుణ మాఫీ బిల్లులను ఆమోదించాలని డిమాండ్ చేశారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ ఎఐకెఎస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవానీ, మేజర్ జనరల్ సత్‌వీర్ సింగ్, ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు విపి సాను తదితరులతో కలిసి అశోక్ దావలే, హన్నన్ మొల్లా మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో రైతు సమస్యలే ప్రధాన అజెండా కావాలన్నారు. దేశంలోని అన్నదాతలు తమ సమస్యలపై గొంతెత్తుతుంటే, మరోవైపు రైతాంగ ఉద్యమాలను పక్కదోవపట్టించేందుకు సంఘపరివార్ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. రామమందిరం, శబరిమల వంటి ఘటనల్లో ప్రజలను రెచ్చగొట్టడమే అందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. తమ పోరాటానికి మాజీ సైనికులు, ఆదివాసీ సంఘం, దళిత్ మంచ్, మహిళా లోకం మద్ధతిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, మేధావులు, రచయితులు సైతం సంఘీభావం తెలుపుతున్నారని పేర్కొన్నారు. దేశంలో మోడీ సర్కార్ గద్దెనెక్కిన నాటి నుంచి ప్రజలపైన, రైతులపైన తీవ్రమైన దాడి జరుగుతోందని అన్నారు. నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, 2013 భూసేకరణ చట్టంపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి బిజెపి సర్కార్ రైతులపై దాడి ప్రారంభించిందన్నారు. గత ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన మోడీ సర్కార్ రామమందిరాన్ని ఎన్నికల అజెండాగా ముందుకు తెస్తోందని విమర్శించారు. అయితే, తమకు మాత్రం రైతుల సమస్యలే ఎన్నికల అజెండా అని స్పష్టం చేశారు. మాజీ సైనికుడు సాబీర్‌సింగ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని నమ్ముకున్న ఏ వర్గమూ నేడు ఆనందంగా లేద న్నారు. జై జవాన్ జై కిసాన్ నినాద స్ఫూర్తితో తాము ఉద్యమంలోకి వచ్చినట్లు తెలిపారు. గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మాట్లాడుతూ దళిత, గిరిజనల సమస్యలను మోడీ సర్కార్ గాలికొదిలేసిందని, మతోన్మాద ఎజెండాతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. అయితే ప్రజలు ఐక్యంగా మోడీ సర్కార్‌పై పోరుకు సిద్ధమవుతున్నారని తెలిపారు.

తొమ్మిది రోజుల పాటు ధర్నాలు...

1. జనవరి 30 : భారత త్రివిధ దళాలకు చెందిన మాజీ సైనికులు, యుద్ధంలో మరణించిన జవానుల భార్యలు ఆందోళనలో పాల్గొంటారు.
2. జనవరి 31 : ఆదివాసీ, దళిత సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తాయి. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంపై నిరసన కార్యక్రమాలు
3. ఫిబ్రవరి 1 : రైతులు, కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ధర్నా
4. ఫిబ్రవరి 2 : చిట్‌ఫండ్ స్కాం బాధితులు హర్తాళ్
5. ఫిబ్రవరి 3 : పౌర సమాజం కార్యకర్తలు నిరసన
6. ఫిబ్రవరి 4 :ఆధార్ ద్వారా నిఘా పెంచడంపై, పర్యావరణ పరిరక్షణకు కార్యకర్తల ధర్నా
7. ఫిబ్రవరి 5 : మహిళా రిజర్వేషన్ బిల్లుపై మహిళా సంఘాల పోరాటం
8. ఫిబ్రవరి 6 :విద్యా రంగ సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల పోరు.
9. ఫిబ్రవరి 7 : రాజ్యాంగ సంస్థలపై దాడికి నిరసనగా రాజకీయ పార్టీలతో భారీ సమావేశం.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68